
'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 70

శనివారం 1-6-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భళా.. భారత్

క్యూ4లో 7.8శాతం పురోగతి
2023-24లో 8.2% పరుగు -15లో



స్పెల్ బీ విజేత బృహత్ సోమ

అమెరికా స్పెల్లింగ్ పోటీలో తెలుగు సంతతి విద్యార్థి గెలుపు -6లో



ఆదివారం లొంగిపోతా..

ఎన్నికల ప్రచారం కోసం బెయిల్‌పై తిహార్ జైలు నుంచి బయటకు వచ్చిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆదివారం తిరిగి లొంగిపోనున్నారు.

వివరాలు 6లో ▸



భారత్ ఎన్నికలపై విదేశీ కుట్ర

ప్రజాభిప్రాయాన్ని 'ఏఐ'తో ప్రభావితం చేసేందుకు ఇజ్రాయెల్ కేంద్రంగా జరిగిన కోవర్ట్ ఆపరేషన్‌ను ఓపెన్ ఏఐ బయటపెట్టింది.

వివరాలు 6లో ▸



ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అరెస్ట్

లైంగిక దాడుల కేసు నిందితుడు, జేడీఎస్ ఎంపీ (హాసన్) ప్రజ్వల్ రేవణ్ణ ఎట్టకేలకు గురువారం అర్ధరాత్రి పోలీసులకు చిక్కాడు.

వివరాలు 6లో ▸



డొనాల్డ్ ట్రంప్ దోషి

పోర్న్‌స్టార్ స్టార్మీ డేనియల్స్‌కు 1.30 లక్షల డాలర్లు చెల్లించి, రికార్డులు తారుమారు చేసిన కేసులో ట్రంప్‌ను కోర్టు దోషిగా తేల్చింది.

వివరాలు 6లో ▸

వచ్చిందే సగం.. 'బ్లాక్'తో ఆగం!

పత్తి విత్తనాల కోసం రైతుల అగచాట్లు

సీజన్ మొదలయ్యే దాకా ఏమాత్రం పట్టించుకోని వ్యవసాయశాఖ

అవసరమైన విత్తనాల్లో సగమే సిద్ధం.. ఇంకా సేకరణలోనే అధికారులు

నల్లబజారుకు బ్రాండెడ్, నాణ్యమైన విత్తనాలు.. రెండింతల ధరకు విక్రయాలు

కొన్నిచోట్ల కాలం చెల్లిన సీడ్స్ అంటగడుతున్న వ్యాపారులు

అనుమతి లేని బీటీ-3 విత్తన విక్రయాలు కూడా..

వ్యాపారులతో అధికారుల కుమ్మక్కు.. తూతూమంత్రంగా దాడులు

ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపంతోనూ సమస్య!



ఆదిలాబాద్‌లో పత్తి విత్తనాల కోసం రైతుల పడిగాపులు

అందుబాటులో 75 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల 7లో

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్

వానాకాలం ముంచుకొస్తోంది. ఈసారి మంచి వర్షాలు పడతాయన్న వాతావరణశాఖ ప్రకటనతో.. రైతులు పెద్ద ఎత్తున సాగుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా పత్తి విత్తనాల కోసం భారీగా డిమాండ్ నెలకొంది. కానీ బ్రాండెడ్ పత్తి విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయాయి. రైతులు కోరుకునే విత్తనాలను వ్యాపారులు 'బ్లాక్' చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కాలం చెల్లిన, సాధారణ విత్తనాలను మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో మంచి విత్తనాల కోసం రైతులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. మరోవైపు అనుమతి లేని విత్తనాలను ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి అమ్ముతున్నట్టూ ఆరోపణలు ఉన్నాయి.

అధిక దిగుబడి వస్తుందనే ప్రచారంతో..

శాస్త్రీయంగా అన్నిరకాల విత్తనాలు దాదాపు ఒకే రకమైన పంట, దిగుబడిని ఇస్తాయని నిపుణులు చెప్తున్నారు. కానీ వ్యాపారులు వ్యూహాత్మకంగా కొన్ని రకాలే మంచి దిగుబడులు ఇస్తాయని అపోహలు సృష్టిస్తూ దండుకుంటున్నారు. ప్రస్తుతం కంపెనీ ఏదైనా సరే.. బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్ (475 గ్రాములు) ధర రూ.864గా నిర్ణయించారు. 30కిపైగా కంపెనీలు ఉత్పత్తి చేస్తున్న 200 రకాల విత్తనాలను ఇదే ధరపై విక్రయించాలి. కానీ మార్కెట్లో ఒక నాలుగైదు రకాలు అధిక దిగుబడులు ఇస్తాయనే ప్రచారం ఉంది. వ్యాపారులు అలాంటి వాటిని బ్లాక్ చేస్తూ రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. కొన్నిచోట్ల ఒక్కో ప్యాకెట్ విత్తనాలకు రూ.2 వేల నుంచి రూ. 2,500 వరకు

మిగతా 7వ పేజీలో ▶



- చండీగఢ్ సహా ఏడు రాష్ట్రాల్లోని 57 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్..
- పోటీలో మొత్తం 904 మంది అభ్యర్థులు
- బరిలో ప్రధాని మోదీ, అనురాగ్ ఠాకూర్, అభిషేక్ బెనర్జీ, కంగన తదితర ప్రముఖులు
- ఒడిశాలో 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు సైతం ఎన్నికలు..
- ఓటు వేయనున్న 10.06 కోట్ల మంది..
- 1.09 లక్షల పోలింగ్ స్టేషన్లు సిద్ధం

నేడే తుది పోరు

6లో

నేడు ఎగ్జిట్ పోల్స్

సాయంత్రం ఆరున్నర గంటలకు వెల్లడి కానున్న ఎన్నికల ఫలితాల అంచనాలు

వట్టిపోయిన 'ఎల్లంపల్లి'



గతేడాది పొడవునా నీటితో కళకళలాడిన పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రస్తుతం అడుగంటిపోయింది. అటు కాళేశ్వరం రిజర్వాయర్ల నుంచి ఎత్తిపోతలు నిలిచిపోవడం, ఇటు ఇన్‌ఫ్లో లేకపోవడం, ఇంకోవైపు మండే ఎండలతో నీరు ఆవిరైపోతుండటం, మిగిలిన నీటిని ఎన్టీపీసీ విద్యుత్, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు తరలిస్తుండడంతో ప్రాజెక్టు వట్టిపోయింది. దీని నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా.. శుక్రవారం 5.08 టీఎంసీలకు పడిపోయింది.

సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



5 డిగ్రీల వరకు అధికంగా..

- రాష్ట్రంలో తీవ్రస్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు.. పలు చోట్ల 45 డిగ్రీల సెల్సియస్‌కు మించి నమోదు
- మరో రెండు రోజులు భగభగలే
- ఈ సీజన్‌లోనే అత్యధిక వేడిమి రోజుగా మే 30

16లో

వడదెబ్బతో 8 మంది మృతి

ఉత్తరాదిన ఎండ ప్రచండం

- వడదెబ్బకు మరో 43 మంది మృత్యువాత
- మృతుల్లో 25 మంది పోలింగ్ సిబ్బంది

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాల్సిందే



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు.

- వివరాలు 2లో▶

నేటి నుంచి ఇంటర్ క్లాసులు



ఇంటర్ క్లాసులు శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కానున్నాయి. అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ప్రస్తుతం వడగాడ్పులు వీస్తున్న నేపథ్యంలో జూన్ రెండో వారం వరకూ విద్యార్థులు పెద్దగా కాలేజీలకు రాకపోవచ్చని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

- వివరాలు 16లో▶

రుణమాఫీకి మహారాష్ట్ర మోడల్!



మహారాష్ట్ర తరహాలో తెలంగాణలోనూ రైతులకు పంటల రుణమాఫీ చేయాలని సర్కారు యోచిస్తోంది. అక్కడ గతంలో ఒకేసారి రూ.20 వేల కోట్లు మాఫీ చేశారు. దీనిపై ఆ రాష్ట్రంలో రెండ్రోజులు పర్యటించి అధ్యయనం చేసిన తెలంగాణ అధికారులు.. ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్టు తెలిసింది.

- వివరాలు 3లో▶



'భారత్‌మాల' నుంచి ట్రిపుల్ ఆర్ ఔట్

- కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయ లోపం ఫలితం
- ఉత్తర భాగం ప్రాజెక్టు 'భూసేకరణ వ్యయం'పై భిన్నాభిప్రాయాలు
- ప్రక్రియలో ఆలస్యం.. భారత్‌మాల ఫేజ్-1కు కేంద్రం ముగింపు
- ట్రిపుల్ ఆర్ స్థానంలో మరో ప్రాజెక్టు
- నిధులంది పనులు ముందుకుసాగే అవకాశం కోల్పోయిన ట్రిపుల్ ఆర్
- ఫేజ్-2లో పట్టాలెక్కినా తప్పని జాప్యం!

- వివరాలు 16లో

బీఆర్ఎస్ ఉద్యమ పాత్ర ప్రతిబింబించేలా

నేటి నుంచి 'తెలంగాణ అవతరణ ఉత్సవాలు'

- ఏర్పాట్లపై నందినగర్ నివాసంలో అధినేత కేసీఆర్ సమీక్ష




సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భారత్ రాష్ట్ర సమితి సన్నాహాలు పూర్తి చేసింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా 3 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల జాబితాను సిద్ధం చేశారు. గతేడాది ప్రభుత్వపరంగా దశాబ్ది ఉత్సవాల ప్రారంభ వేడుకలను జరిపిన నేపథ్యంలో ప్రస్తుతం పార్టీ పరంగా ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బీఆర్ఎస్ పాత్రకు అద్దం పట్టేలా వేడుకల నిర్వహణకు

మిగతా 2వ పేజీలో ▶

అభివృద్ధి.. అప్పులు.. ఆరోపణలు..

పయనం పదేళ్లు

- వివరాలు 8లో▶



కేసీఆర్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం

రాష్ట్ర అవతరణ వేడుకలో భాగస్వాములు కావాలని లేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలకు రావాల్సిందిగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ శుక్రవారం కేసీఆర్‌ను కలిశారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి జీఏడీ అధికారులతో కలిసి వెళ్లిన వేణుగోపాల్.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వాన పత్రికను ఇవ్వడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌కు రాసిన

మిగతా 2వ పేజీలో ▶

బయట కాపుకాసి.. కాళ్లు, చేతులు కట్టేసి..

స్టింగ్ ఆపరేషన్‌తో పిల్లల విక్రయ ముఠా ఆటకట్టించిన అక్కాచెల్లెళ్లు



అనూష, శ్రీవైష్ణవి, ప్రత్యూష

- పిల్లాడిని కొనుగోలు చేస్తామంటూ శోభారాణిని ట్రాప్ చేసిన అక్షర ఫౌండేషన్ నిర్వాహకులు
- సీక్రెట్ కెమెరాలతో ఈ వ్యవహారమంతా రికార్డింగ్
- పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితులతో ధైర్యంగా పోరాడిన అనూష, ప్రత్యూష, శ్రీవైష్ణవి
- శోభారాణి విచారణ అనంతరం వెలుగులోకి ఢిల్లీ, పుణే లింక్‌లు

(ఆడెపు శ్రీనాథ్)

సంచలనం సృష్టించిన పిల్లల విక్రయం కేసు వెనుక ముగ్గురు ధీర వనితల పోరాటం దాగి ఉంది. అక్షర జ్యోతి ఫౌండేషన్‌ను నిర్వహించే అక్కాచెల్లెళ్లు ధైర్య సాహసాలతో ఈ మానవ అక్రమ రవాణా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. పీర్జాదిగూడలో ఆర్ఎంపీ శోభారాణితో పాటు స్వప్న, షేక్ సలీంలను పట్టుకున్నారు. ఈ స్టింగ్ ఆపరేషన్ నిర్వహించిన తీరును అక్కాచెల్లెళ్లు అనూష, శ్రీవైష్ణవి, ప్రత్యూషలు 'సాక్షి'తో పంచుకున్నారు.

మహిళ ఇచ్చిన సమాచారంతో..

అక్షర జ్యోతి ఫౌండేషన్ తరఫున కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో ఓ మహిళ అనూషను సంప్రదించింది. తనకు పిల్లల్లేరని, శోభారాణి పిల్లలను విక్రయిస్తున్నట్టుగా తెలిసిందని, ఈ విషయంలో తనకు సహాయం చేయాలంటూ శోభారాణి ఫోన్ నంబర్ ఇచ్చింది. షాక్‌కు గురైన అక్కాచెల్లెళ్లు శోభారాణి కార్యకలాపాలపై స్టింగ్ ఆపరేషన్ చేయాలని నిర్ణయించుకున్నారు. వీరికి యూట్యూబ్ చానల్ విలేకరి సాయికుమార్ సహకరించారు.

సీక్రెట్ కెమెరాలతో క్లినిక్‌లోకి..: ఈనెల 21న శ్రీవైష్ణవి పిల్లల్లేని తల్లిగా నటిస్తూ తనకో బిడ్డ కావాలని శోభారాణిని కలిసింది. దీంతో ఆమె వాట్సాప్‌లో అబ్బాయి, అమ్మాయి

మిగతా 2వ పేజీలో ▶



మీరేమో నోట్లో నాలుక లేనట్లుండేవారు!
అయనకేమో నోటి నిండా నాలుకలే!

శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి అమిత్ షా



తిరుమల: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సతీసమేతంగా శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి టీటీడీ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా...

లక్ష్మీబాయికి భట్టి నివాళి



లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భట్టి, దీపాదాస్ మున్షీ తదితరులు

పహాడీషరీఫ్ (హైదరాబాద్): మాజీ గవర్నర్ పి.శివశంకర్ సతీమణి లక్ష్మీబాయి మృతిపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం మామిడిపల్లి గ్రామంలోని ఆమె నివాసానికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీతో కలిసి ఆయన వెళ్లారు. లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆమె కుమారుడు డాక్టర్ వినయ్ కుమార్, కోడలు అలేఖ్యను భట్టి ఓదార్చి సానుభూతి తెలిపారు.

చిహ్నంలో అమరవీరుల స్తూపం ఎందుకు పెట్టకూడదు?

ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ చిహ్నంలో అమరవీరుల స్తూపాన్ని ఎందుకు పెట్టకూడదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ప్రభుత్వ ప్రతినిధి మల్లు రవి, టీపీసీసీ నేతలు భవాని రెడ్డి, చరణ్ కౌశిక్, కైలాష్ నేత, లింగం యాదవ్, ఇందిరా శోభన్, శ్రీనివాస్‌రెడ్డితో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ చిహ్నం మార్పుల్లో వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేశారు. అందరితో సంప్రదించి, అతి త్వరలో ప్రజల ఆకాంక్షలకు తెలంగాణ చిహ్నాన్ని తీసుకువస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం రేవంత్, భట్టి, ఉత్తమ్ ఆలోచనలు కాదని, ప్రజల నుంచి వచ్చిన ఆకాంక్ష అని అన్నారు.

మోదీది ధ్యానమా.. కొంగ జపమా?

తెలంగాణ చిహ్నంలో రాచరిక పాలన తీసి ప్రజా పాలనకు గుర్తుగా మంచి చిహ్నాన్ని తీసుకొస్తామని మల్లు రవి పేర్కొన్నారు. కన్యాకుమారిలో ప్రధాని మోదీ చేసేది ధ్యానమా, కొంగ జపమా భగవంతుడికే తెలియాలని ఎద్దేవా చేశారు. ధ్యానంతో అక్కడి వచ్చే వేలాది మందికి తీవ్ర ఇబ్బంది అవుతుందని, వారికి మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'కేసీఆర్ నేర్పిన బాటలోనే టెస్కాబ్‌కు రాజీనామాలు'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రయోజనాలే తమకు ముఖ్యమంటూ, అవసరమైనప్పుడు పదవులను గడ్డి పరకలా వదిలివేయడం నేర్పిన కేసీఆర్ బాటలో.. తమ పదవులకు రాజీనామా చేస్తూ టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిలు తీసుకున్న నిర్ణయం అభినందనీయం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరి పదవులు కాపాడుకోవాలని ఎన్ని ప్రలోభాలకు, ఒత్తిడిలకు గురి చేసినా లొంగకుండా నమ్మి నడిచిన బీఆర్‌ఎస్ పార్టీ, కేసీఆర్ బాటకే వారు జై కొట్టారని శుక్రవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'తమ హయాంలో రాష్ట్రంలో సహకార బ్యాంకులను అద్భుతంగా నడిపిన వీరి పనితీరు రాష్ట్ర సహకార రంగ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. రూ.10 వేల కోట్ల రుణాలతో ఉన్న టెస్కాబ్‌ను రూ.42 వేల కోట్ల సంస్థగా తీర్చిదిద్దారు. టెస్కాబ్‌ను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపి అనేక అవార్డులతో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంక్‌గా తీర్చిదిద్దారు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

కేసీఆర్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం

▶ మొదటి పేజీ తరువాయి

లేఖను అందజేశారు. అనంతరం వేణుగోపాల్ మీడియాతో మాట్లాడుతూ 'రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నాం. తెలంగాణ అవతరణ దినోత్సవం అందరికీ పండుగ. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని కేసీఆర్‌ను కోరాం. ఆయన మా ఆహ్వానానికి సానుకూలంగా స్పందించారు'అని వెల్లడించారు. అయితే ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఈ వేడుకల్లో పాల్గొనేదీ లేనిదీ తెలియదని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.

బయట కాపుకాసి..
కాళ్లు, చేతులు కట్టేసి..

▶ మొదటి పేజీ తరువాయి

ఫొటోలను పంపించింది. బాబును కొనేందుకంటూ రూ.4.50 లక్షలకు డీల్ కుదుర్చుకున్నారు. అడ్వాన్స్‌గా కొంత మొత్తాన్ని చెల్లించారు. ఆ మరుసటి రోజు ఉదయమే పీర్జాదిగూడలోని క్లినిక్‌కు వచ్చి బాబును తీసుకెళ్లాలని శోభ సూచించింది. దీంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లు, సాయికుమార్‌తో శివ, శ్రీనివాస్ అనేవారు బృందంగా ఏర్పడి, సీక్రెట్ కెమెరాలను ధరించి క్లినిక్ లోపలికి వెళ్లారు. ఒకవేళ నిందితులు అనుమానంతో తమపై దాడి చేసినా, పారిపోయేందుకు ప్రయత్నించినా పట్టుకునేందుకు వీలుగా క్లినిక్‌కు వెళ్లే రెండు మార్గాలలో మరో 10 మందిని కూడా ఏర్పాటు చేసుకున్నారు. క్లినిక్ లోపల నిందితులు శోభారాణి, స్వప్నలతో జరిగే సంభాషణలు, వారి కదలికలను ఎప్పటికప్పుడు బయట ఉన్న బృందానికి వాట్సాప్ మెసేజ్‌లలో చేరవేస్తూ ఏమాత్రం తేడా వచ్చినా వారు సహాయపడేలా రంగం సిద్ధం చేసుకున్నారు.

ఆల్టో కారులో బాబును తెచ్చి..

వారు క్లినిక్‌లోకి వెళ్లిన అరగంటలో మరో నిందితుడు షేక్ సలీం తెలుపు రంగు ఆల్టో కారులో బాబును తీసుకొచ్చాడు. క్లినిక్ ఫస్ట్ ఫ్లోర్‌లో ఉండే భవనం యజమాని ఇంట్లోకి వెళ్లాడు. కాసేపటి తర్వాత శోభరాణి వెళ్లి బాబును తీసుకుని క్లినిక్ లోపలికి వచ్చింది. రెండు నకిలీ ఆధార్ కార్డులను ఇస్తూ వీళ్లే బాబు తల్లిదండ్రులు అని చెప్పింది. ఇంకో రూ.20 వేలు అదనంగా ఇస్తే బాబు బర్త్ సర్టిఫికెట్ కూడా ఇస్తానని, దీంతో మీరే సొంత తల్లి అయిపోతారని శ్రీవైష్ణవికి శోభ సూచించింది. ఒప్పందం మేరకు మిగతా డబ్బును అందించాలని కోరింది. దీంతో బయటికెళ్లి తీసుకొస్తానని శ్రీవైష్ణవి తలుపులు తెరవడంతో అప్పటికే బయట ఉన్న వారిని చూసిన శోభ, ఇతర నిందితులు ఇదంతా ట్రాప్ అని గ్రహించారు.



మేడిపల్లి ఠాణా ముందు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు బాబును అప్పగిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చున్నీతో కాళ్లు, చేతులు కట్టేసి..

శోభారాణి, స్వప్న, సలీంలు క్లినిక్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించారు. కానీ బయట ఉన్న బృందం కాపు కాస్తుండటంతో వారికి చాన్స్ లేకుండాపోయింది. సలీం గోడ దూకి పారిపోయేందుకు ప్రయత్నించగా.. ప్రత్యూష బలంగా అతన్ని పట్టుకొని, చున్నీతో అతని కాళ్లు, చేతులు కట్టేసింది. అతన్ని పక్కన ఉన్న పిల్లర్‌కు కట్టిపడేసింది. ఇదంతా స్టింగ్ ఆపరేషన్ తెలిసిపోవడంతో శోభారాణి ఏడుపు మొదలుపెట్టింది. పోలీసులకు ఫోన్ చేయవద్దని సెటిల్‌మెంట్ చేసుకుందామంటూ ఆఫర్ ఇచ్చింది. ఈలోగా డయల్ 100కు ఫోన్ చేయడంతో మేడిపల్లి పోలీసులు వచ్చారు. నిందితులను ఠాణాకు తరలించి, బాబును చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులకు అప్పగించారు. నిందితులను పోలీసులు విచారించగా.. ఢిల్లీకి చెందిన కిరణ్, ప్రీతి, పుణేకు చెందిన కన్నయ్యల నుంచి పసికందులను కొనుగోలు చేసి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విక్రయిస్తున్న అంశం వెలుగులోకి వచ్చింది.

లింగ నిర్ధారణ, గర్భస్రావాలు కూడా..

శోభారాణి 20 ఏళ్లుగా పీర్జాదిగూడలో ఫస్ట్ ఎయిర్ సెంటర్ పేరుతో క్లినిక్‌ను నిర్వహిస్తోంది. ఇందులో ముందు గదిలో క్లినిక్ ఉండగా.. వెనుక గది అంతా చీకటిగా ఉంది. ఇందులో శస్త్ర చికిత్సల కత్తెర్లు, క్లాంప్స్, బోన్ కట్టర్స్, సూదులు వంటి సర్జికల్ పరికరాలున్నాయి. డస్ట్ బిన్‌లో కనిపించకుండా దాచిపెట్టారు. శోభారాణి అక్రమంగా గర్భస్రావాలు, లింగ నిర్ధారణ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు అక్షర ఫౌండేషన్ విచారణలో తేలింది.

రాష్ట్ర సాధనలో బీఆర్‌ఎస్ పాత్ర
ప్రతిబింబించేలా

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వీలుగా కేసీఆర్ శుక్రవారం ఉదయం ఎర్రవల్లి నివాసం నుంచి హైదరాబాద్‌లోని నందినగర్ నివాసానికి చేరుకున్నారు. కార్యక్రమాలకు సన్నాహాలపై పార్టీ నేతలతో సమీక్షించారు. మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఏర్పాట్ల తీరుతెన్నులను ఆయనకు వివరించారు.

నేడు ర్యాలీ ప్రారంభించనున్న కేసీఆర్

ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం బీఆర్‌ఎస్ ముఖ్యనేతలతో పాటు, జిల్లాల నుంచి కూడా నాయకులు, క్రియాశీల కార్యకర్తలు పబ్లిక్ గార్డెన్స్‌కు చేరుకుంటారు. సాయంత్రం 6.30 గంటలకు కేసీఆర్ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని అమరుల స్తూపం వద్దకు చేరుకుని తెలంగాణ అమరవీరులకు నివాళి అర్పిస్తారు. అనంతరం గన్‌పార్కు నుంచి క్యాండిల్ ర్యాలీని ప్రారంభిస్తారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించేలా బతుకమ్మలు, బోనాలు, ఇతర తెలంగాణ కళారూపాలతో వేయి మందికి పైగా కళాకారులు ఈ ర్యాలీలో పాల్గొంటారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో పాటు పార్టీ కీలక నేతలు ఈ ర్యాలీకి నేతృత్వం వహిస్తారు. తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైన న్యాయవాదులు, డాక్టర్లతో పాటు వివిధ వర్గాలకు చెందిన వారు కూడా పాల్గొంటారు. శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న కేసీఆర్ కాలునొప్పి ఉన్నందున ఊరేగింపు ప్రారంభ కార్యక్రమంలో మాత్రమే పాల్గొంటారు. రవీంద్రభారతి, రిజర్వు బ్యాంకు కార్యాలయం మీదుగా సాగే ఈ ర్యాలీ ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం ఎదురుగా ఉన్న తెలంగాణ అమరజ్యోతి వద్దకు చేరుకుంటుంది. అక్కడ జరిగే ముగింపు కార్యక్రమంలో వందలాది మంది కవి గాయకులు అమరులకు నివాళి అర్పిస్తూ బృందగానం చేస్తారు.

రేపు తెలంగాణ భవన్‌లో జెండాల ఆవిష్కరణ

ఉత్సవాల రెండో రోజు ఆదివారం బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2వ తేదీ ఉదయం 9 గంటలకు కేసీఆర్ తెలంగాణ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తారు. 9.30కు తెలంగాణ భవన్ సమావేశ మందిరంలో 'తెలంగాణ యాది'పేరిట ఫొటో ఎగ్జిబిషన్‌ను అమరుల కుటుంబాల చేతుల మీదుగా ప్రారంభిస్తారు. అనంతరం 11 గంటలకు కార్యకర్తలతో జరిగే సమావేశంలో కేసీఆర్ ప్రసంగిస్తారు. ఈ సమావేశానికి వచ్చే నాయకులు, కేడర్ కోసం మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేస్తున్నా రు. 3వ తేదీన జిల్లా కేంద్రాల్లో కార్యక్రమా లు నిర్వహిస్తారు. జిల్లా కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాలు మినీ తెలంగాణ భవనలో పార్టీ జిల్లా అధ్యక్షులు జాతీయ పతాకం, పార్టీ జెండాను ఎగురవేస్తారు. పండ్ల పంపిణీ, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

చిన్నారుల అక్రమ రవాణాపై
కఠిన చర్యలు

- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- శిశువిహార్‌ను సందర్శించిన మంత్రి



సాక్షి, హైదరాబాద్: చిన్నారుల అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన పిల్లల అక్రమ రవాణా ఘటనపై ఆమె స్పందించారు. ఇలాంటి అకృత్యాలకు పాల్పడితే ప్రభుత్వం సహించదని, కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. శుక్రవారం మంత్రి శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలిసి యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌ను సందర్శించారు. అక్రమ రవాణా ముఠానుంచి పోలీసులు కాపాడిన 16 మంది చిన్నారులను శిశువిహార్‌లో ఉంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులతో కలిసి మంత్రి సీతక్క పిల్లలను పరామర్శించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితులకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి, వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని, ఆ తర్వాత చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశించారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకుంటే నిబంధనలకు అనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. చిన్నారులను రక్షించి శిశు విహార్‌కు తరలించినందుకు రాచకొండ పోలీస్ కమిషనర్, ఆయన బృందానికి మంత్రి సీతక్క అభినందనలు తెలిపారు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ నిర్మల కాంతి వెస్లీ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

ఎవరి వల్ల అమరులకు స్తూపాలు?

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ బిడ్డలను చంపిన బలిదేవత ఎవరు?



సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణలో వేలాది మంది ఎవరి వల్ల అమరులయ్యారు, అమరుల స్తూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో పలు ఘటనలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమంటూ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పేర్కొన్నారు. '1952లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ స్టేట్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది ఎవరు? 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డలను కాల్చి చంపింది ఎవరు? 1971 పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంతంలోని 14 సీట్లలో 11 చోట్ల తెలంగాణ ప్రజా సమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది ఎవరు? దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజాస్వామికంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే.. తెలంగాణను తుంగలో తొక్కింది ఎవరు? 2004లో మాట ఇచ్చి, పదేళ్లు తాత్సారం చేసి వందలాది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలిదానం చేసుకునే దుస్థితికి కారణం ఎవరు?'అని ప్రశ్నిస్తూ అన్నింటికీ కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పిన తెలంగాణ బిడ్డలను చంపిన బలిదేవత ఎవరు? అని కేటీఆర్ నిలదీశారు.

ఫోన్ ట్యాపింగ్‌లో కేసీఆర్‌ను ఎవరూ కాపాడలేరు: జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు నుంచి మాజీ సీఎం కేసీఆర్‌ను కాపాడటం ఎవరి తరమూ కాదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బీజేపీకి కొమ్ముకాసిందని విమర్శించారు. అందుకు ప్రతిఫలంగా కేసీఆర్‌ను కాపాడే వ్యూహంలో భాగంగానే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీ నిరసనలు చేసిందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం మీద జ్యుడీషియల్ కమిటీ వేశామన్నారు. బీఎల్ సంతోశ్‌ను ఎమ్మెల్యేల కొనుగోలు కుట్ర కేసులో ఇరికించారని చెబుతున్న బీజేపీ.. ఇప్పటి వరకు ఎందుకు నిరూపించలేకపోయిందని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాల్సిందే

రేవంత్ ఎందుకు తాత్సారం చేస్తున్నారు?

- పార్లమెంటరీ బోర్డుసభ్యుడు లక్ష్మణ్
- ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బీజేపీ నిరసన



ధర్నాలో మాట్లాడుతున్న లక్ష్మణ్. చిత్రంలో రాంచందర్‌రావు, బీబీ పాటిల్, పొంగులేటి, కొండా

సాక్షి, హైదరాబాద్. కవాడిగూడ: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ డిమాండ్ చేసింది. మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే ట్యాపింగ్ జరిగిందని, ఈ కేసులో కీలక వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా కాంగ్రెస్ సర్కార్ తాత్సారం చేస్తోందని ఆరోపించింది. ఈ కుంభకోణంలో దోషులకు శిక్ష పడేవరకు బీజేపీ పోరాటం చేస్తుందని, ఇందుకోసం న్యాయ పోరాటానికి సైతం సిద్ధంగా ఉందని ప్రకటించింది. కేసులో సూత్రధారులు, పాత్రధారులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... తెలంగాణ చరిత్రలో సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోకుండా ఉండాలంటే ఫోన్ ట్యాపింగ్ కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. తాను కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడినని చెప్పుకున్న రేవంత్ ఇప్పుడెందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రశ్నించారు.

కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం ఉందా?

ట్యాపింగ్ విషయంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా అని లక్ష్మణ్ ప్రశ్నించారు. ట్యాపింగ్ కేసులో అరెస్టయిన వాళ్లు వాంగ్మూలం ఇచ్చినా కేసీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ అవినీతిని అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి పదే పదే ప్రస్తావించారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరం, ధరణి పేరుతో దోచుకున్నదాన్ని కక్కిస్తామన్నారని గుర్తుచేశారు. తీరా అధికారంలోకి వచ్చాక కేసీఆర్ అవినీతి, కుంభకోణాల మీద రేవంత్‌రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. లిక్కర్ కేసు నుంచి తన కుమార్తె కవితను తప్పించడంకోసమే బీజేపీ నేతలపై కేసీఆర్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు.

బీఆర్‌ఎస్ రద్దు కోరుతూ లేఖ రాస్తా: కొండా

2017కంటే ముందు నుంచి ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, బీఆర్‌ఎస్ పార్టీని రద్దు చేయాలని ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల వ్యవహారాలతో పాటు రక్షణ పరమైన ఒప్పందాల్లోనూ కేసీఆర్ వేలు పెట్టాడని తెలుస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. గత ప్రభుత్వంలో నయాం తరహా పాలన సాగిందని, సొంత కుటుంబం పైన కూడా ఫోన్ ట్యాపింగ్ చేయించారని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు.

రేవంత్‌ను సోనియా బెదిరించారు: బూర

'బీఆర్‌ఎస్‌పై కేసులు పెడితే నీపని అవుతుంది అని సోనియా గాంధీ బెదిరించారు. అందుకే రేవంత్ రెడ్డి మొహం చిన్నగా చేసుకుని వచ్చాడు' అని బూర నర్సయ్యగౌడ్ వ్యాఖ్యానించారు. ధర్నాలో ఎంపీ బీబీపాటిల్, మాజీ మంత్రులు జి.విజయ రామారావు, ఇ.పెద్దిరెడ్డి, నేరెళ్ల ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్సీలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎన్. రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు ఎం.ధర్మా రావు, ప్రేమ్‌సింగ్ రాథోడ్, భేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పాటను ఆవిష్కరిస్తున్న మాజీ సీఎం కేసీఆర్. చిత్రంలో దేశపతి శ్రీనివాస్, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, రాకేశ్, జోర్దార్ సుజాత, విహ తదితరులు

'కేసీఆర్' పాట ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: సినీ నటుడు రాకింగ్ రాకేశ్ హీరోగా నటిస్తూ నిర్మించిన 'కేసీఆర్' (కేశవ చంద్ర రమావత్) చిత్రంలోని పాటను బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు ఆవిష్కరించారు. నందినగర్ నివాసంలో రాకేశ్ బృందం శుక్రవారం కేసీఆర్‌ను కలిసింది. ఈ సందర్భంగా చిత్రంలోని 'తెలంగాణ తేజం'పాటను కేసీఆర్ ఆవిష్కరించారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో 'కేసీఆర్' సినిమా సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, గీత రచయిత సంజయ్ మహేశ్, గాయని విహ, నటి జోర్దార్ సుజాత ఉన్నారు. పాట ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ దీవకొండ దామోదర్‌రావు, మాజీ ఎంపీలు బి.వినోద్ కుమార్, జోగినపల్లి సంతోశ్ కుమార్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాఘవ పాల్గొన్నారు.

కేసీఆర్‌పై ఏబీఎన్ తప్పుడు కథనాలు

ఆంధ్రజ్యోతి రాధాకృష్ణపై బీఆర్‌ఎస్ ఫిర్యాదు

- మద్యం కేసులో కేసీఆర్ అరెస్టు.. అంటూ ఏబీఎన్‌లో వార్తలు
- కేసీఆర్ పాత్రను ఈడీకి కవిత వివరించారంటూ వార్త ప్రసారం
- కోర్టు వాదనలను వక్రీకరించిన ఏబీఎన్
- ఈటీవీ సహా 16 చానళ్లపై వివిధ పోలీసుస్టేషన్లలోనూ ఫిర్యాదులు

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం కుంభకోణంలో సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్న కేసులో నిరాధార వార్తలతో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యక్తిత్వాన్ని దిగజార్చేందుకు పూనుకున్నారని ఆరోపిస్తూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు మరో ఎనిమిది మందిపై పార్టీ నేతలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో పాటు అవే తరహా వార్తలు ప్రసారం చేసిన ఈటీవీతో పాటు మొత్తం 16 టీవీ, యూట్యూబ్ చానళ్లపై కూడా వివిధ పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతిపై ఫిలింనగర్ పోలీసు స్టేషన్‌లో, ఇతర చానళ్లపై బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. ఢిల్లీ మద్యం కేసులో ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా మే 28న జరిగిన వాదనల్లో కేసీఆర్ పాత్రను ఆమె ఈడీకి వివరించారని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి స్క్రోలింగ్‌లు, వార్తలు ప్రసారం చేసిందని పేర్కొన్నారు. 'మార్గదర్శి మా నాన్న.. మద్యం కేసులో కేసీఆర్ అరెస్టు' అనే శీర్షికతో ప్రసారం చేసిన వార్తలో.. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నాన్న మార్గదర్శకత్వంలో కూతురు పనిచేస్తున్నట్లు ఈడీ తేల్చిందంటూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానల్ ప్రసారం చేసిందని వివరించారు. ఈ వార్తకు సంబంధించిన వీడియోలు, ఫిర్యాదును పెన్‌డ్రైవ్ ద్వారా బీఆర్‌ఎస్ నేతలు పోలీసులకు అందజేశారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రసారం చేసిన వార్త పూర్తి సారాంశాన్ని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. వార్తను ప్రసారం చేసే సమయంలో కేసీఆర్, కవిత ఫొటోలతో పాటు ఈడీ, మద్యం సీసాల క్లిప్పింగులను జత చేశారని తెలిపారు. వార్త ప్రసారం అవుతున్న విషయాన్ని తెలుసుకున్న కవిత న్యాయవాది మోహిత్‌రావు.. కోర్టులో జరిగిన వాస్తవ విషయాలపై ప్రకటన విడుదల చేశారన్నారు. ఈ కేసులో మరో నిందితుడు మాగుంట రాఘవ చేసిన వ్యాఖ్యలను కవిత, కేసీఆర్‌కు ఆపాదిస్తూ ఏబీఎన్ వార్తను ప్రసారం చేసిందన్నారు. కేసీఆర్, కవిత, బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలో భాగంగా ఉద్దేశపూర్వకంగా అసత్యాలతో కథనాన్ని సృష్టించారని ఆరోపించారు. న్యాయవిచారణ అంశాలను కూడా ఏబీఎన్ విలేకరులు తప్పుడు వ్యాఖ్యానాలతో తప్పుదోవ పట్టించారని తెలిపారు. తప్పుడు కథనాలతో కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబం, బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిష్టను దెబ్బతీశారని పేర్కొన్నారు. దీంతో ఏబీఎన్ ఎండీ రాధాకృష్ణ, డైరెక్టర్ భానుకృష్ణ, ఈడీ పి.వెంకటకృష్ణ, సంస్థ ఢిల్లీ ప్రతినిధి కృష్ణ, ఇతర సిబ్బంది సువర్ణ కుమార్, కస్తూరి శ్రీనివాస్, నవీన్‌తో పాటు మొత్తం 9 మందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసీఆర్ ఇమేజీని దెబ్బ తీసేందుకే..

వాస్తవాలను నిర్ధారణ చేసుకోకుండా కేసీఆర్ స్థాయి, ప్రతిష్టను దెబ్బ తీసేందుకు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వార్తలను ప్రసారం చేసిందని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ఆయన తెలంగాణ భవన్‌లో శుక్రవారం పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, ఈటీవీ, వీ 6, ఎన్‌టీవీ, ఐ న్యూస్, అమ్మ టీవీ, బీఆర్‌కే, డైలీ న్యూస్, జర్నలిస్టు సాయి చానల్, మైక్ టీవీ, నేషనలిస్ట్ హబ్, ప్రైమ్, ఆర్ టీవీ, రాజ్‌న్యూస్, రెడ్ టీవీ, వైల్డ్ ఓల్ఫ్.. తదితర 16 టీవీ, యూ ట్యూబ్ చానళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వివరించారు. కేసీఆర్ ఔన్నత్యాన్ని తక్కువ చేసి చూపడం సరికాదన్నారు. తప్పుడు వార్తలు, కథనాలు ప్రసారం చేసే మీడియా సంస్థలపై బీఆర్‌ఎస్ రాజ్యాంగబద్ధంగా న్యాయ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్, విప్లవ్ కుమార్ పాల్గొన్నారు.

టెస్కాబ్ చైర్మన్ కొండూరి రాజీనామా



మీడియాతో మాట్లాడుతున్న కొండూరి రవీందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ కొండూరి రవీందర్‌రావు శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తాను చైర్మన్‌గా ఉన్న తొమ్మిదేళ్లలో సహకార బ్యాంకులను దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అనేక సంస్కరణలు తీసుకొచ్చి బ్యాంకులను బలోపేతం చేశానన్నారు. ప్రభుత్వం మారడంతో తనపై అవిశ్వాసం పెట్టారని, కానీ అంతకన్నా ముందే తన పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో సహకార బ్యాంకులను బలోపేతం చేసి, రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. తాము వచ్చిన తర్వాత బ్యాంకుల్లో 7,165 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. గోదాముల నిర్మాణం, పెట్రోల్ బంకుల ఏర్పాటు, పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం వంటి వ్యాపారాలను నిర్వహించిన ట్లు చెప్పారు. సహకార బ్యాంకుల కంప్యూటరీకరణ, ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ విభాగాన్ని ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. బోర్డులోని డైరెక్టర్లు పార్టీ మారి తనపై అవిశ్వాసం పెట్టారన్నారు. అందుకే తాన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో టెస్కాబ్ వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి కూడా తన రాజీనామాను ప్రకటించారు.

'చేతి'కి చిక్కిన కొల్లాపూర్

- కాంగ్రెస్ వశమైన కొల్లాపూర్ మున్సిపాలిటీ
- నూతన చైర్‌పర్సన్‌గా రమ్యకుమారి ఏకగ్రీవం

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ వశమైంది. గతంలో ఇక్కడ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ విజయలక్ష్మి చైర్‌పర్సన్‌గా ఉండగా అవిశ్వాసం పెట్టారు. పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ బలం 15 మందికి చేరింది. దీంతో ఏప్రిల్ 16న నిర్వహించిన అవిశ్వాస పరీక్ష నెగ్గడంతో విజయలక్ష్మి పదవి నుంచి తప్పుకున్నారు. ఈమేరకు శుక్రవారం మున్సిపల్ మీటింగ్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించగా.. ఎన్నికల అధికారిగా కల్వకుర్తి ఆర్డీవో శ్రీను వ్యవహరించారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి మున్సిపల్ కార్యాలయానికి హాజరయ్యారు. చైర్‌పర్సన్‌గా రమ్యకుమారి పేరును 1వ వార్డు వార్డు కౌన్సిలర్ జ్యోతి ప్రతిపాదించగా.. 8వ వార్డు కౌన్సిలర్ శ్రీలక్ష్మి బలపరిచారు. చైర్‌పర్సన్ పదవికి ఒకటే నామినేషన్ రావడంతో.. రమ్యకుమారిని ఏకగ్రీ వంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ అవసరమా?

పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్‌పై రాష్ట్ర పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారని, అయినా బీజేపీ నేతలు మాత్రం సీబీఐ విచారణ చేయాలని రచ్చ చేస్తున్నారని పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...విచారణలో ట్యాపింగ్ దొంగలు బయటపడుతున్నారన్నారు. అసలు దొంగలు త్వరలోనే దొరుకుతారని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్‌ను కాపాడేందుకే రాష్ట్రంలో బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర పోలీసులు విచారణ జరుపుతున్నప్పుడు సీబీఐ అవసరం ఏముందని ప్రశ్నించారు. ట్యాపింగ్‌తో పాటు కాళేశ్వరం అవినీతిపై అప్పట్లో రేవంత్‌రెడ్డితో పాటు అనేకమంది కేంద్రానికి ఫిర్యాదులు చేశారని అయినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎందుకు పట్టించు కోలేదని ప్రశ్నించారు. బీజేపీ అగ్రనేతలు జేపీ నడ్డా, అమిత్ షా, బండి సంజయ్‌తో పాటు అనేకమంది నాయకులు కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని ప్రకటనలు గుప్పించి ఆ తర్వాత మాట్లాడక పోవడానికి కారణమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

అరచేతిలో ఎన్నికల ప్రపంచం

→ ఎన్నికల ఫలితాల తాజా అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు డిజిటల్ రూపంలో మీ ముందుకు తెస్తోంది సాక్షి.కామ్. క్షణక్షణం ఇచ్చే ఈ అప్‌డేట్స్‌తో పాటే విశ్లేషణాత్మక కథనాలు, ఏ నియోజకవర్గ సమాచారాన్ని అయినా చిటికెలో ఇట్టే తెలుసుకో గలిగేలా అందిస్తోంది. అంతే కాదు.. మీరు స్వయంగా నావిగేట్ చేసుకునే సౌకర్యం, జిల్లాల వారీగానూ ఎన్నికల ఫలితాలు, స్పష్టంగా అర్థమయ్యే గ్రాఫిక్స్.. ఇలా ఎన్నెన్నో విశేషాలున్న సాక్షి.కామ్‌ను అస్సలు మిస్ కావొద్దు. ఫాలో www.sakshi.com.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. సాక్షి ఎలక్షన్ స్పెషల్‌ను చూడండి..

రుణమాఫీకి మహారాష్ట్ర మోడల్!

ఆ రాష్ట్రంలో రుణమాఫీ చేసిన విధానంపై తెలంగాణ ఉన్నతాధికారులు అధ్యయనం

- రెండు రోజులు పర్యటించి వచ్చిన వ్యవసాయ, ఆర్థిక శాఖల బృందం
- మహారాష్ట్రలో ఒకేసారి రూ.20 వేల కోట్లు మాఫీ చేసినట్టు బృందం వెల్లడి
- బ్యాంకులకు కాకుండా నేరుగా రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ
- గతంలో రాజస్తాన్‌లోనూ ఒకేసారి విజయవంతంగా రుణమాఫీ అమలు
- ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన అధికారులు



సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన విధంగా తెలంగాణలోనూ రైతులకు పంటల రుణమాఫీ చేయాలని రాష్ట్ర సర్కారు యోచిస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఒకేసారి రూ.20 వేల కోట్లు మాఫీ చేశారు. సహకార శాఖను నోడల్ ఏజెన్సీగా పెట్టి.. రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాల మాఫీని అమలు చేశారు. దీనిపై రాష్ట్ర వ్యవసాయ, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు ఇటీవల మహారాష్ట్రలో రెండు రోజులు పర్యటించి అధ్యయనం చేశారు. ఒకేసారి రూ.20 వేల కోట్లు ఎలా సమకూర్చారన్న దానిపైనా ఆరా తీశారు. రాజస్తాన్‌లోనూ ఇదే పద్ధతిలో రుణమాఫీ చేశారని తెలుసుకున్నారు. ఆ వివరాలతో తాజాగా ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్టు తెలిసింది.

అసలు వడ్డీతో కలిపి మాఫీ..

మహారాష్ట్రలో పర్యటించి వచ్చిన అధికారులు తెలిపిన వివరాల మేరకు.. ఆ రాష్ట్రంలో దాదాపు 1.53 కోట్ల మంది రైతులు ఉన్నారు. వారిలో చాలా మంది జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. అయితే 2015 నుంచి 2019 వరకు కరువు పరిస్థితులతో రైతులు నష్టపోయారు. ఈ నేపథ్యంలో అప్పటి ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం రుణమాఫీ అమలు చేసింది. 2015 ఏప్రిల్ 1 నుంచి 2019 మార్చి 31వ తేదీ మధ్య రైతులు తీసుకున్న పంట రుణాల్లో రూ.2 లక్షల వరకు ఉన్నవాటిని మాఫీ చేసింది. ఇందుకోసం పెద్దగా షరతులేవీ పెట్టలేదు. రైతుకు ఎక్కువ భూమి ఉందా, తక్కువ ఉందా అన్న కొర్రీ ఏదీ పెట్టలేదు. నిర్ణీత గడువులో రుణం అసలుతోపాటు వడ్డీ మొత్తాన్ని కూడా మాఫీ చేశారు. రూ.2 లక్షల కంటే ఎక్కువగా పంట రుణాలు తీసుకున్న రైతులకు.. ఆ పరిమితి వరకే మాఫీ చేశారు. రూ.2 లక్షల కంటే ఎక్కువ ఉన్న రుణఖాతాలకు సంబంధించి ప్రత్యేకంగా బ్యాంకుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఆధార్‌తో లింక్ చేయని రుణ ఖాతాదారులను గుర్తించి లింక్ చేయించారు. రైతుల సమాచారాన్ని పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేశారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో గ్రామస్థాయి పాలనా యంత్రాంగం రుణమాఫీ బాధ్యతను స్వీకరించింది.

కటాఫ్ తేదీనే కీలకం..

తెలంగాణలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చాక దానిపై కొంత కసరత్తు జరిగింది. వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ క్రమంలో కసరత్తు చేపట్టిన అధికారులు.. మహారాష్ట్రలో అధ్యయనం చేశారు. తెలంగాణలో రైతుల రుణ బకాయిలు రూ.30 వేల కోట్లు ఉంటే.. వడ్డీతో కలిపి దాదాపు రూ. 35 వేల కోట్ల వరకు ఉంటాయని అంచనా వేశారు. కటాఫ్ తేదీని బట్టి ఈ మొత్తం మారొచ్చని అధికారులు అంటున్నారు. అయితే బంగారం కుదువబెట్టి తీసుకున్న పంట రుణాలకు కూడా మాఫీ వర్తింపచేయాలా, వద్దా అన్నదానిపై చర్చ జరుగుతోంది. మరోవైపు సంపన్నులకూ రైతుబంధు ఇచ్చి దుర్వినియోగం చేశారంటూ విమర్శలున్న నేపథ్యంలో.. రుణమాఫీని కూడా సమగ్రంగా పరిశీలించాకే ఇవ్వాలన్న ఆలోచన కూడా ఉన్నట్టు ప్రచారం అవుతోంది. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ పుట్టినతేదీ డిసెంబర్ 9ని పంట రుణమాఫీకి కటాఫ్ తేదీగా ప్రకటించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు వ్యవసాయ వర్గాలు చెప్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన డిసెంబర్ 7వ తేదీని కటాఫ్‌గా తీసుకోవాలన్న ప్రతిపాదన కూడా ఉన్నట్టు సమాచారం.

వ్యాపార విస్తరణలో 'సింగరేణి'

- పవన విద్యుత్, జల విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి
- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం
- రెండు సంస్థలకు బాధ్యతల అప్పగింత

గోదావరిఖని: వచ్చే ఐదేళ్లలో ఆరు కొత్త ఓసీపీలు ప్రారంభించి వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. 2029–30 నాటికి నిర్దేశిత లక్ష్యం సాధించి రికార్డు నమోదు చేయాలని చూస్తోంది. దేశంలో ఏటా వెయ్యి మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతోంది. కోలిండియాలో 700 మిలియన్ టన్నులు, ఎన్టీపీసీతో సహా మిగతా సంస్థలు 200 మిలియన్ టన్నులు, సింగరేణి వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించే స్థాయికి ఎదిగి దేశ ఉత్పత్తిలో పదిశాతం ఉండాలని లక్ష్యంగా పెట్టుకుంది. బొగ్గు ఉత్పత్తితోపాటు ఇతర రంగాలకు సింగరేణిని విస్తరించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. దీనిపై అధ్యయనం చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణరావు పలు దఫాలు భేటీ అయ్యారు. దీనిపై స్పష్టమైన సంకేతాలిచ్చినట్టు తెలుస్తోంది,

ఇదీ భవిష్యత్ కార్యాచరణ

- విదేశాల్లో కూడా బొగ్గు బ్లాకులు దక్కించుకునే ప్రయత్నాలు విస్తృతం
- కొత్త బొగ్గు బ్లాకులు దక్కించుకోవడానికి వేలం పాటలో పాల్గొనడం
- 2024–25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం
- 2029–30 నాటికి ఏటా వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధన
- తాజాగా జల, పవన విద్యుత్ ఉత్పత్తి దిశగా ప్రణాళిక
- ఇప్పటివరకు 1,700 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీయగా, ఇంకా 1,500 మిలియన్ టన్నుల నిల్వలు వెలికి తీసేందుకు నిర్ణయం
- ప్రస్తుతం 300 మీటర్ల – 600 మీటర్ల లోతులోని బొగ్గునే వెలికి తీస్తుండగా, భవిష్యత్‌లో మరింత లోతులోని బొగ్గు వెలికితీసే దిశగా కసరత్తు
- రామగుండం రీజియన్‌లోని ఓసీపీ-1తోపాటు శ్రీరాంపూర్‌లోని రామకృష్ణాపూర్ ఓసీపీల్లో బొగ్గు నిక్షేపాలు అడుగంటడంతో వాటిని మూసివేయాలని నిర్ణయం.

రామగుండంలో మెగా ఓసీపీ

రామగుండం ప్రాంతంలో మూసివేసిన కొన్ని భూగర్భ గనులు, ఓసీపీ-వన్‌ను కలుపుకొని మెగా ఓసీపీ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు పూర్తయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఓసీపీ, మంచిర్యాల జిల్లాలోని రామకృష్ణాపూర్ ఓసీపీ, ఎంవీకే, గోలేటి ఓసీపీ, కొత్తగూడెంలోని వీకే ఓసీపీ, జేకే ఓసీపీలను విస్తరించాలని చూస్తోంది.

కోడ్ ముగిశాక నైనీ బ్లాక్ ప్రారంభం

ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేలా యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. అక్కడ ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తీయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

పవన, జలవిద్యుత్ ఉత్పత్తిపై నజర్..

మూసివేసిన ఓసీపీల్లో హైడల్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని యోచిస్తోంది. ప్రస్తుతం క్వారీల్లో నిల్వ నీటిని తమకున్న సోలార్ విద్యుత్ ద్వారా పైకి పంపింగ్ చేసి రాత్రిపూట దిగువకు వదిలి హైడల్ పవర్ ఉత్పత్తి చేయాలని ప్రణాళిక రూపొందించింది. సోలార్ విద్యుత్ నిల్వ చేసుకోవడానికి భారీ బ్యాటరీలు ఏర్పాటు చేయాలని చూస్తోంది. దీనిపై అధ్యయనం చేసేందుకు టాటా కన్సల్టెంట్స్ సంస్థకు బాధ్యతలు అప్పగించింది. పవన విద్యుత్ ఉత్పత్తికి సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీస్తున్నారు. ఇందుకోసం తిరుమల తిరుపతి గుట్ట తరహాలో భారీ రెక్కలున్న టవర్లు ఏర్పాటు చేసి గాలిమరల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. దీనిపై అధ్యయనానికి పవర్ అండ్ ఎనర్జీ కన్సల్టేషన్ ఆఫ్ ఇండియా(పీఈసీ)కి బాధ్యతలు అప్పగించారు.

ఈఆర్‌సీ, బేవరేజెస్ కార్పొరేషన్ పేర్లు మార్పు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్, ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ పేర్లు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(టీఎస్‌బీసీఎల్) పేరును తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(టీజీబీసీఎల్)గా మార్చింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) పేరును ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఫర్ తెలంగాణగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్‌ఏఎం రిజ్వీ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

7, 8 తేదీల్లో ప్రపంచ వరి సదస్సు: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో ప్రపంచ వరి సదస్సు నిర్వహిస్తోంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన అంతర్జాతీయ పంటల సంస్థ ఈ సదస్సు నిర్వహిస్తున్నది. ఆ సంస్థ డైరెక్టర్ మెర్సిడెజ్ జోన్స్‌తోపాటు స్థానిక నిర్వాహకులు ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య శుక్రవారం సచివాలయంలో మంత్రి తుమ్మలను కలిసి సదస్సు విశేషాలు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వరి ఎగుమతిదారులకు ఇది సువర్ణావకాశమన్నారు. ఈ సదస్సులో మన దేశీయ వరి ఎగుమతిదారులు, ఇతర దేశాల నుంచి వచ్చే ధాన్యం దిగుమతిదారులతో నేరుగా సంప్రదింపులు జరుపుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు.

ప్రపంచ వరి సదస్సు ఇలా

50 మంది విదేశీ వరిధాన్యం ఎగుమతిదారులు, దిగుమతిదారులతోపాటు అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఫిలిప్పైన్స్) నుంచి ప్రముఖ వరి శాస్త్రవేత్తలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు మరో 150 మంది వరి ఎగుమతిదారులు, వరి విత్తన కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వీరితోపాటు రాష్ట్రంలోని 30 మంది అభ్యుదయ రైతులు, 30 మంది రైస్‌మిల్లర్లు కూడా పాల్గొంటున్నారు. ఈ సదస్సులో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ – ఇండస్ట్రీస్ కూడా భాగస్వామ్యం పంచుకుంటుంది. సదస్సులో భాగంగా దాదాపు 20 మంది విదేశీ, దేశీయ పరిశ్రమలు వారివారి ఉత్పత్తులు, ఎగుమతులకు అనుగుణమైన వరిరకాలను ప్రదర్శిస్తారు.

రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం మార్పును స్వాగతిస్తున్నాం

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్
- మరిన్ని సూచనలు చేస్తూ బహిరంగ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం మార్పు అంశాన్ని స్వాగతిస్తున్నట్లు ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ తెలిపారు. ప్రభుత్వ చిహ్నం మార్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేస్తూ శుక్రవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఉస్మానియా యూనివర్సిటీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అణగారినవర్గాల రాజ్యం కోసం, హక్కుల కోసం యుద్ధం చేసిన పండగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న, సమ్మక్క, సారక్క చిత్రాలతో కూడిన చిహ్నాన్ని రూపొందించినట్లు తెలిపారు. డీఎస్పీ రూపొందించిన చిహ్నం నమూనాలో సమానత్వ భావన, పీడిత వర్గాల యోధుల పోరాట స్ఫూర్తి కనిపిస్తుందని, భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ ప్రతిపాదిత చిహ్నం నమూనాను తెలంగాణవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్లకు ఈనెల 3న అందించనున్నట్లు వివరించారు. అదేవిధంగా జూన్ 4న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్‌లకు విజ్ఞాపన పత్రాన్ని ఇవ్వనున్నట్లు చెప్పారు.



డీఎస్పీ రూపొందించిన ప్రభుత్వ చిహ్నం నమూనా

'గ్రూప్' పోస్టులు భర్తీ చేయాలి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్–1, 2, 3, 4 ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొందరు అధికారులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా పోస్టులను సరైన పద్ధతిలో లెక్కించలేదని తెలిపారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా కింద గ్రూప్ సర్వీసుల్లో 50 శాతం పోస్టులను ప్రతి శాఖలో భర్తీ చేయాలని కోరారు. కొత్త జిల్లాలకు పోస్టులు మంజూరు చేసి ఆప్షన్, వెయిటింగ్ లిస్ట్ పద్ధతులను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.



టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణయ్య తదితరులు

జూన్ 5 నుంచి నీట్ ఉచిత అవగాహన తరగతులు

సాక్షి, హైదరాబాద్: నీట్–2025కు సన్నద్ధమయ్యే విద్యార్థులకు జూన్ 5 నుంచి 9వ తేదీ వరకూ ఉచిత అవగాహన తరగతులు నిర్వహించనున్నట్టు మెటమైండ్ అకాడమీ చైర్మన్ మనోజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అయిదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఉచిత హాస్టల్ సదుపాయం కూడా ఉంటుందని పేర్కొన్నారు. సీనియర్ అధ్యాపకులు, మెడికోలు అవగాహన కల్పిస్తారని, నీట్ సాధనలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు మెలకువలు నేర్పుతారని వివరించారు. బైపీసీ చేసిన రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఈ అవకాశం కోసం 9090898902 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆ పరమాత్మ సకల ప్రాణుల హృదయ కమలాల్లో స్థితమైవుండి, అన్నమయమైన స్థూలశరీరంలో ప్రతిష్ఠితుడై ఉంటాడు.

– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 1 జూన్ 2024

మహాపరాధి ట్రంప్!

అధికారంలోకొచ్చింది మొదలు అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను నేరస్తుడిగా నిరూపించాలని తపిస్తున్న డెమాక్రాటిక్ పార్టీ వాంఛ చివరి అంకంలో నెరవేరింది. నీలి చిత్రాల తార స్టార్మీ డేనియల్స్ నోరు మూయించడానికి భారీగా సొమ్ము ముట్టజెప్పి, ఆ మొత్తాన్ని ట్రంప్ తన కంపెనీ ఖాతాల్లో వేరేగా చూపారన్న ఆరోపణ రుజువు కావటంతో మన్‌హట్టన్ న్యాయస్థానం ఆయన్ను మహాపరాధిగా తేల్చింది. భిన్న రంగాలకు చెందిన అయిదుగురు మహిళలతో సహా 12 మందితో కూడిన జ్యూరీ... ఈ వ్యవహారంలో ట్రంప్‌కు విధించబోయే శిక్ష ఏమిటన్నది ఇంకా ప్రకటించలేదు. వచ్చే నెల 11న వెల్లడించే ఆ శిక్ష తప్పనిసరిగా కారాగారవాసమే కానవసరం లేదని, అది జరిమానా మొదలుకొని ప్రొబేషన్‌లో ఉంచటం వరకూ ఏదైనా కావొచ్చన్నది న్యాయనిపుణులు చెబుతున్న మాట. ఇది క్రిమినల్ కేసే అయినా వ్యక్తిని హతమార్చటం వంటిది కాదు గనుక జైలు శిక్ష ఉండకపోవచ్చంటున్నారు. జైలుకు పోయినా పోకపోయినా దేశాధ్యక్ష పదవికి జరగబోయే ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీపడటానికి అదేమీ అవరోధం కాదు. తీర్పు వెలువరించే ముందు జ్యూరీకి నాయకత్వం వహించిన న్యాయమూర్తి జువాన్ మెర్కన్ తన సహచరులను లాంఛనంగా 'తీర్పుతో మీరు ఏకభవిస్తున్నట్టేనా...' అని అడగటం, వారు అంగీకారాన్ని తెలపటం పూర్తయ్యాక ట్రంప్ అక్కడినుంచి నిష్క్రమించారు. వెళ్లేముందు 'ఇది మోసపూరితమైన, సిగ్గుమాలిన తీర్పు. అసలు తీర్పును నవంబర్ 5న అమెరికా ప్రజలివ్వబోతున్నారు' అని ఆయన చేసిన వ్యాఖ్య గమనించదగ్గది. వచ్చే అయిదారు నెలల్లో ఆ దేశ రాజకీయ పోకడలెలా ఉండబోతున్నాయో ట్రంప్ వ్యాఖ్య చెబుతోంది. ట్రంప్ నేరం రుజువై అపరాధిగా తేలిన తొలి కేసు ఇదే.

దేశాధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ 2016లో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలోనే ట్రంప్‌ను అనేకానేక కుంభకోణాలు చుట్టుముట్టాయి. తమపై లైంగిక నేరానికి పాల్పడ్డాడని, అసభ్యకర చేష్టలతో వేధించాడని కొందరు మహిళలు ఏకరువు పెట్టగా, ఆయన ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడంటూ మరికొందరు ఆరోపించారు. ఇవిగాక 2021లో పదవినుంచి దిగిపోయేనాటికి రెండు క్రిమినల్ కేసులు కూడా వచ్చిపడ్డాయి. తన గెలుపును డెమాక్రాటిక్ పార్టీ కొల్లగొట్టిందంటూ పార్టీ శ్రేణుల్ని రెచ్చగొట్టడం, అధికార బదలాయింపు కోసం సెనేట్, ప్రతినిధుల సభ కొలువుదీరిన వేళ కాపిటల్ హిల్ భవనంపైకి జనాన్ని మారణాయుధాలతో ఉసిగొల్పటం తదితర ఆరోపణలున్న కేసు కొలంబియా కోర్టులో సాగుతోంది. బైడెన్ విజయాన్ని మార్చడానికి ప్రయత్నించారన్న అభియోగంపై జార్జియాలో విచారణ కొనసాగుతోంది. పదవి నుంచి దిగిపోతూ రహస్య పత్రాలు వెంటతీసుకెళ్లడం తదితర నేరాభియోగాలు ఫ్లారిడాలో విచారిస్తున్నారు. వీటికి అనుగుణంగా రెండు అభిశంసన కేసులు నమోదయ్యాయి. వీటిల్లో ఒక అభిశంసనపై కింది కోర్టు తీర్పిచ్చినా అమెరికా సుప్రీంకోర్టు దాన్ని కొట్టేసింది. ఆ అధికారం అమెరికన్ కాంగ్రెస్‌కే ఉంటుందని తేల్చింది. లైంగిక నేరాలకు సంబంధించి మహిళలు చేసిన ఆరోపణలు వీగిపోయాయి. 2006 నాటి తన రాసలీలల సంగతి బయటపెట్టొద్దని అభ్యర్థిస్తూ న్యాయవాది ద్వారా స్టార్మీకి పంపిన 1,30,000 డాలర్ల డబ్బే ఇప్పుడు ట్రంప్‌ను నిండా ముంచింది. ఈ కేసులో వచ్చిన మొత్తం 34 అభియోగాలూ రుజువయ్యాయని న్యాయస్థానం తేల్చింది. ట్రంప్ గద్దెనెక్కకుండా నిరోధించేది ప్రజా తీర్పేనని అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించినా ఆ విషయంలో డెమాక్రాటిక్ పార్టీకి పెద్దగా ఆశలున్నట్టు కనబడదు. తటస్థులైన ఓటర్లలో ఒకటి రెండు శాతంమంది తాజా తీర్పు వెలువడ్డాక ట్రంప్‌కు వోటేయాలన్న తమ నిర్ణయాన్ని మార్చుకున్నట్టు చెప్పినా అదేమంత ఉపయోగపడేలా కనబడటం లేదు. తొక్కేయాలని చూస్తున్నకొద్దీ ఆయన మరింత బలశాలిగా మారుతున్నాడంటూ రిపబ్లికన్ వ్యూహకర్త స్కాట్ రీడ్ చేసిన వ్యాఖ్య అవాస్తవం కాదు. గత ఆరు వారాలుగా ట్రంప్ రేటింగ్ పెరగటం, ఆయనకొచ్చే విరాళాల వెల్లువ ఇందుకు తార్కాణం. అయిదారేళ్లుగా రిపబ్లికన్ పార్టీ తన సామాజిక మాధ్యమాల ద్వారా, ఫాక్స్ న్యూస్ వంటి పార్టీ అనుకూల మీడియా ద్వారా సాగిస్తున్న ప్రచారం దీనికి కారణం. పార్టీ మొత్తం ట్రంప్ వెనక దృఢంగా నిలబడి ఆయన మాటలనూ, చేష్టలనూ సమర్థిస్తూ వచ్చింది. తమ నాయకుడిది తప్పంటున్న డెమాక్రాటిక్ నేతలే నేరగాళ్లంటూ ఊదరగొట్టింది. వీటి మాటెలావున్నా న్యాయస్థానం మహాపరాధిగా తేల్చిన వ్యక్తి దేశాధ్యక్షుడిగా వ్యవహరించటం సరైందేనా అన్న మీమాంస నడుస్తోంది. నాలుగు వందల ఏళ్లనాటి దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి సందేహాలు ఎప్పుడూ రాలేదు. నేర నిరూపణ అయిన వ్యక్తి వందేళ్ల క్రితం జైలునుంచి పోటీచేసిన చరిత్రవున్నా మాజీ అధ్యక్షుడు మహాపరాధిగా తేలటం, ఆయనే మరోసారి బరిలో దిగటం కనీవినీ ఎరుగనిది. ఈ విషయంలో రాజ్యాంగంలో నిర్దిష్టమైన నిబంధనేదీ లేదు.

ట్రంప్ ఈ నాలుగేళ్లలో మారిందేమీ లేదు. ఎన్నికల్లో గెలిచిన ప్రత్యర్థికి రాజ్యాంగబద్ధంగా అధికారాన్ని బదలాయించటానికి బదులు అనుచరులను రెచ్చగొట్టి అవరోధాలు సృష్టించాలని చూసిన ట్రంప్‌కు ఇప్పటికీ వ్యవస్థలంటే గౌరవం లేదు. తిరిగి నెగ్గితే ఆయన చేయబోయే పనుల్లో వలసలను కట్టడి చేయటం మొదలుకొని అంతర్జాతీయ సాయానికి కత్తెరేయటం వరకూ చాలావున్నాయి. ప్రభుత్వ సిబ్బంది సర్వీసు భద్రతను తొలగించే ప్రయత్నం కూడా చేస్తానని ఇప్పటికే చెప్పారు. గెలిచి అందలమెక్కితే ట్రంప్‌పై కేసులు వ్యక్తిగతంగా ఆయనకు మాత్రమే కాదు... అమెరికాకు సైతం సమస్యగా మారడం ఖాయం.

జనం తీర్పు ఏం చెప్పనుంది?

విశ్లేషణ


ప్రశాంత్ ఝా

జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. నాయకత్వం, గుర్తింపు, ఆర్థిక వ్యవస్థ గురించి భారతీయ ఓటర్లు ఏమి చెబుతున్నారనే అంశంపై దృష్టి పెట్టి ఈ ఫలితాలను చూడాల్సి ఉంటుంది. ప్రస్తుత బీజేపీ పాలన తన వంతు ఉత్తమంగా కృషి చేసిందా? భవిష్యత్తులో ఆదాయాలను మెరుగు పరచడానికి, ఉద్యోగాలు వస్తాయని విశ్వసించడానికి మోదీ ఆర్థిక సంక్షేమ నమూనా సరిపోతుందా? అధికార ప్రతిపక్షాలు రెండూ తమవైన వివరణలను జోడించి చేసిన 85 శాతం–15 శాతం ప్రచారాన్ని ఓటర్లు ఎలా తీసుకున్నారు? ద్రవ్యోల్బణం, మరింత ఉచిత రేషన్‌పై వాగ్దానం వంటివి మార్పు జరగాలనే ఆకాంక్షకు దారితీశాయా? ఇలాంటి ప్రశ్నలకు ఓ రెండ్రోజుల్లో సమాధానం లభిస్తుంది.

జూన్ 4న వెల్లడి కానున్న సార్వత్రిక ఎన్నికల లెక్కల్లో బీజేపీ 303 స్థానాలకు పైగా గెలుచుకోవచ్చు. లేదా దాని స్థానాలు 272 నుంచి 303 మధ్య ఉండవచ్చు. లేదా మెజారిటీ మార్కు కంటే తక్కువగా ఉండవచ్చు. వీటి గురించి ఇప్పటికైతే ఎవ్వరికీ తెలియదు. అయితే నాయకత్వం, గుర్తింపు, ఆర్థిక వ్యవస్థ గురించి భారతీయ ఓటర్లు మనకు ఏమి చెబుతున్నారనే అంశంపై దృష్టి పెట్టి ఆ ఫలితాలను పరిశీలించండి.

గత దశాబ్దం గురించిన స్పష్టమైన మొదటి పరికల్పనను ఇక్కడ చూద్దాం. నరేంద్ర మోదీ రాజకీయాలను పునర్నిర్వచించారు. ప్రతి ఎన్నికా స్థానిక, జాతీయ సమతూకంతో ఉంటుంది. అయితే సంక్షేమ పథకాల పంపిణీ, ఎడతెగని జాతీయ సందేశపు ప్రదర్శనతో మోదీ జాతీయతను, స్థానికతను అనుసంధానించారు. దీంతో 2014, 2019 ఎన్నికల్లో భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన ప్రాంతాల్లో కూడా బీజేపీ అభ్యర్థులు ఎదుర్కొన్న ప్రతికూలతలను పూడ్చడానికి మోదీ ప్రజాదరణ సరిపోయింది. మరోవైపున ఓటర్లు కూడా తమ శాసన సభా కార్యకలాపానికి ఎవరు ప్రాతినిధ్యం వహిస్తారు అనే అంశాని కన్నా, ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వాన్ని ఎవరు నడుపుతారు అనేదానికి ప్రాధాన్యతను ఇచ్చారు.

2024 తీర్పు ఈ ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది. బీజేపీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలలో, కొత్త భౌగోళిక ప్రాంతాలలో ఇంకా ఎక్కువ మంది ఓటర్లను మోదీ ఆకర్షిస్తున్నారా, లేదా? బీజేపీ అభ్యర్థి స్వభావం లేదా కుల సమీకరణలు లేదా ఆర్థిక ఆందోళన నుండి ఉత్పన్నమయ్యే స్థానిక బలహీనతలను పూడ్చడానికి మోదీ ఇమేజ్ సరిపోతుందా? ఓటర్లు భారత ప్రభుత్వ అధికారంలో ఒక బలమైన నాయకుడిని కోరుకుంటున్నారా లేక బలమైన తనిఖీలతో 1989–2014 మధ్యకాలపు తరహా ఏర్పాటు తిరిగి రావాలని కోరుకుంటున్నారా?

ఇక రెండో పరికల్పన హిందూ మత–రాజకీయ గుర్తింపునకు పెరుగుతున్న భావన గురించి. దీన్ని బీజేపీ స్పష్టమైన అవగాహనతోనే పెంచి పోషించింది. హిందూ మత గుర్తింపునకు సంబంధించిన రాజకీయ ప్రకటనకు ప్రభుత్వ మద్దతు ఉంది. కల్పిత మనోవేదనల సమాహారం ద్వారా ముస్లింలను ఇతరులుగా మార్చే భావన మరొకటి. వెనుకబడిన, దళిత ఉప సమూహాలకు సాంస్కృతిక, రాజకీయ ప్రాతినిధ్యాన్ని అందించడం ద్వారా సమ్మిళిత హిందూ గుర్తింపును నిర్మించడం కూడా దీని వెనుక ఉంది. అయోధ్యలో లేదా కశ్మీర్‌లో లేదా దేశ విభజన సమయంలో జరిగిన చారిత్రక అన్యాయాల 'సవరణ' ఉంది. హిందువులు ఐక్యంగా ఉంటే, వారు ముస్లిం ఓట్లను అసంగతం చేయగలరనీ, ముస్లిం ప్రాతినిధ్యాన్ని చాలావరకు తగ్గించగలరనీ చూపించడానికి ఒక ఎన్నికల నమూనా కూడా దీని వెనుక ఉంది.



కులాలకు అతీతంగా హిందుత్వ సామాజిక గాఢత కనబడటం, 'లౌకికవాదం' ప్రతిధ్వనులు ఎక్కడా వినిపించకపోవడం, ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీలు) మద్దతు వంటివి తనకు లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ నీరుగారిపోయింది. బీజేపీ తరహా రాజకీయ మతపరమైన గుర్తింపును సవాలు చేసే కథనం తన దగ్గర లేకపోవడంతో కుల గణన, మరిన్ని రిజర్వేషన్లు, అన్ని రంగాలలో అన్ని కుల సమూహాలకు దామాషా ప్రాతినిధ్యాన్ని వాగ్దానం చేసింది. ఇది చారిత్రాత్మకం! జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్... దేశాన్ని కుల సమూహాలు, మతాలు, జాతుల మొత్తంగా కాకుండా హక్కులతో కూడిన, వ్యక్తిగత పౌరులతో కూడిన ఒక పెద్ద సమూహంగా భావించింది. మౌలికమైన అస్తిత్వ ఆధారిత విధానాల కంటే సామాజిక ప్రయోజనాలను సమతుల్యం చేసే క్రమానుగతమైన మార్పును విశ్వసించింది. ఈ రెండు అంశాలకు సంబంధించినంతవరకూ నెహ్రూ పార్టీని రాహుల్ గాంధీ భారత రాజకీయాలను సామ్యవాద స్రవంతి వైపు తిరిగి మళ్లించారు. పైగా కమ్యూనిస్ట్ స్రవంతి నుండి అరువు తెచ్చుకున్న బలమైన పెట్టుబడిదారీ వ్యతిరేక వైఖరిని దానికి జోడించారు.

హిందూ గొడుగులోని సంకీర్ణ కూటమిని విచ్ఛిన్నం చేయడానికి, ప్రతిపక్షాలు ఎన్నికలను 85%–15% యుద్ధంగా మలిచాయి. ఇక్కడ బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న 15 శాతం అంటే 'ఇతరులైన' ఉన్నత కులాలు. దళితులు, ఓబీసీలు, గిరిజనుల రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ ఉద్దేశించినట్లు అది తప్పుగా పేర్కొంది. మరోవైపున తన సొంత హిందూ సామాజిక సంకీర్ణాన్ని కొనసాగించడానికి, బీజేపీ ఈ ఎన్నికలను 85% వర్సెస్ 15% యుద్ధంగా రూపొందించింది. ఇక్కడ 15 శాతం అంటే 'ఇతరులైన' ముస్లింలు ఇండియా కూటమికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆరోపించింది. అట్టడుగు హిందువుల రిజర్వేషన్లను రద్దు చేసి, వాటిని ముస్లింలకు ఇవ్వడానికి కాంగ్రెస్ ఉద్దేశించినట్లు బీజేపీ తప్పుగా ఆరోపించింది. అన్ని ప్రశ్నల పరంపరకు ఈ ఎన్నికల తీర్పు సమాధానం ఇస్తుంది. ఏకీకృత హిందూ రాజకీయ గుర్తింపునకు చెందిన ఆలోచన భౌగోళికంగా దక్షిణాదిలో కూడా విస్తరించి, సామాజికంగా దళితులు, గిరిజనులలో లోతుగా పాతుకుపోయిందా? రిజర్వేషన్ నిర్మాణాన్ని మరింత విస్తరించడానికి ఈ తీర్పు పార్టీలను ఎంతవరకు ఒత్తిడికి గురి చేస్తుంది?

మూడవ పరికల్పన రాజకీయ ఆర్థిక వ్యవస్థ గురించి. మోదీ నమూనా మౌలిక సదుపాయాలలో తయారీపై, పెట్టుబడులు పెంచడంపై ఆధారపడినది. ప్రైవేట్ వ్యవస్థాపకతను ముందుకు తీసుకుపోవడానికి డిజిటల్ ప్రభుత్వ మౌలిక వసతులను ఉపయోగించడం; ఆర్థిక మార్కెట్లను విస్తరించడం; పరపతిని సరళీకరించడం; ఆర్థిక వ్యవస్థను లాంఛనప్రాయంగా మార్చడం; సేవలలో భారతదేశ బలాన్ని పెంచడం; నగదు, గృహాలు, నీరు, ఆహారం, విద్యుత్, వంట గ్యాస్ వంటి వాటిని అందుకునే కోట్లాది మంది ప్రజలతో కూడిన సంక్షేమ వలయాన్ని సృష్టించడం ఈ నమూనాలో భాగం. సంక్షేమం ఒక తరగతి లబ్ధిదారులను సృష్టించింది, గుర్తింపులు, ప్రాంతాల వ్యాప్తంగా మహిళా ఓటర్ల మద్దతును గెలవడానికి ఇవి మోదీకి సహాయపడ్డాయి. కానీ ప్రభుత్వ ఉద్యోగాలు లేకపోవడంపై ప్రజల్లో కోపం, బాధ పెరుగుతున్నాయని కూడా స్పష్టమైంది. గరిష్ఠంగా నగదు బదిలీలు, ప్రభుత్వ రంగ ఉపాధి, ఒక సంవత్సరం అప్రెంటిస్‌షిప్ ప్రణాళికతో సహా మరింత సంక్షేమానికి ప్రతిపక్షాలు వాగ్దానం చేశాయి.

ప్రస్తుత పాలన తన వంతు ఉత్తమంగా కృషి చేసిందా? భవిష్యత్తులో ఆదాయాలను మెరుగుపరచడానికి, ఉద్యోగాలు వస్తాయని విశ్వసించడానికి మోదీ ఆర్థిక సంక్షేమ నమూనా సరిపోతుందా? ఓటర్లను, ముఖ్యంగా మహిళలను, యథాతథ స్థితికి కట్టుబడి ఉండటానికి లేదా బీజేపీ రాజకీయ ప్రయోజనాలు నెరవేరడానికి సంక్షేమం ప్రేరేపణ కలిగించిందా? రాజకీయ–క్యాపిటల్ నెట్‌వర్క్‌పై ప్రజలకు ఆగ్రహం ఉందా? మహమ్మారి అనంతరం వివిధ రూపాల్లో దేశం కోలుకోవడం జరిగిందా? ద్రవ్యోల్బణం, మరింత ఉచిత రేషన్‌పై వాగ్దానం వంటివి మార్పు జరగాలనే ఆకాంక్షకు దారితీశాయా?

తమను ఎవరు నడిపించాలనుకుంటున్నారు, తమను ఎలా నిర్వచించాలనుకుంటున్నారు, తమ ఆర్థిక భవిష్యత్తుకు సంబంధించి వారు ఎవరిని విశ్వసిస్తారు అనే కీలకాంశాలను రెండ్రోజుల్లో ఓటర్లు ప్రకటిస్తారు. ఇది 2024కి సంబంధించిన అసలైన కథ.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పోయిన ఛాన్స్



ఎటూ అన్ని కోణాల్లో కెమెరాలు ఉంచారు కాబట్టి, మోదీ ధ్యానాన్ని ఒక ఇంటెరాక్టివ్ ఈవెంట్‌గా మలిచే విషయంలో బీజేపీ ఒక గొప్ప మార్కెటింగ్ అవకాశాన్ని కోల్పోయింది. 'మోదీతో ధ్యానం చేయండి' అని ప్రకటించి, దాన్ని లైవ్ స్ట్రీమ్ చేస్తూ, అందరినీ తమ తమ స్థానాల్లోంచే చేయమని చెబితే పోయేది.

– కార్తీక్, మార్కెటింగ్ స్ట్రాటెజీ కన్సల్టెంట్

బంగారు భారత్



రిజర్వ్ బ్యాంకు తన 100 టన్నుల బంగారం నిల్వలను యూకే నుంచి ఇండియాకు తరలించింది. చాలా దేశాలు తమ బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ లేదా అలాంటి ప్రదేశాల్లో ఉంచి, దానికోసం ఫీజు చెల్లిస్తాయి. 1991లో రాత్రికి రాత్రి మన బంగారాన్ని తరలించిన స్థితి నుంచి ఇండియా చాలాదూరం ప్రయాణించింది.

– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

వద్దు పొగాకు



నా అంతర్జాతీయ కెరీర్ ప్రారంభంలో మా నాన్న నాకు సాధారణమే అయినా ముఖ్యమైన సలహా ఇచ్చారు: పొగాకును ప్రమోట్ చేయొద్దు. నేను దాన్ని పాటించాను. మీరు కూడా పాటించొచ్చు. మెరుగైన భవిష్యత్ కోసం మనం పొగాకు మీద ఆరోగ్యాన్ని ఎంపిక చేసుకుందాం (మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం)

– సచిన్ టెండూల్కర్, క్రికెటర్

వ్యవస్థ తీరు



ఒక మాజీ యూఎస్ అధ్యక్షుడి మీద తీవ్రమైన నేర నిర్ధారణ జరిగింది... ఇరాక్ లేదా అఫ్గానిస్తాన్ యుద్ధాలు, అక్రమమైన సీఐఏ కుట్రలు, డ్రోన్ దాడులు లేదా అమెరికన్ల మీద నిఘా పెట్టడం విషయంలో కాదు; కేవలం ఒక పోర్న్ స్టార్‌కు 1,30,000 యూఎస్ డాలర్ల చెల్లింపును ట్రంప్ తప్పుగా వర్గీకరించడంపై!

– గీగర్ క్యాపిటల్, వ్యాఖ్యాత

ఒప్పుకొన్నట్టేనా?



కశ్మీరీ కవి అహ్మద్ ఫర్హాద్ కేసు విషయంలో, పాకిస్తాన్‌కు సంబంధించి కశ్మీర్ 'విదేశీ ప్రదేశం' అని ఆ దేశ అదనపు అడ్వకేట్ జనరల్(దేశ ప్రతినిధి) ఇస్లామాబాద్ హైకోర్టులో అంగీకరించారు. (ఫర్హాద్‌ను ఐఎస్ఐ అపహరించింది.)

– ఆదిత్యా రాజ్ కౌల్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

కళ విశ్వజనీనం

గత కొన్ని రోజులుగా తెలంగాణ రాష్ట్ర గీతంపై ఒక తీవ్రమైన చర్చ నడుస్తోంది. ఈ గీతానికి కీరవాణి సంగీతం అందిస్తున్నారు అనగానే చాలామందికి ఇది ఆత్మ గౌరవంతో ముడిపడిన వ్యవహారంగా కనబడింది. తెలంగాణ గీతానికి తెలంగాణేతర సంగీత దర్శకులు వుండ కూడదా? ఉంటే వచ్చే నష్టం ఏమిటి?

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున జరుగుతున్న తరుణంలో ఎక్కడ చూసినా 'జయ జయహే తెలంగాణ' అన్న గీతాన్నే నాలుగున్నర కోట్ల గొంతుకలు ఒక్కటై నినదించాయి. పది జిల్లాల గొప్పతనం గురించి అత్యద్భుతంగా అల్లిన అక్షర మాలను అందెశ్రీ ఎంతో ప్రేమతో, తెలంగాణపై భక్తితో జాతికి అంకితం చేశారు. ఇంత వరకు బాగానే వుంది. కాని, తెలంగాణ సిద్ధించిన తర్వాత మాత్రం ఆ గేయానికి ప్రభుత్వం మాత్రం ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదన్నది అందరికీ తెలిసిన విషయమే.

మరి అప్పటి ప్రభుత్వానికి ఆత్మ గౌరవం అంటే తెలియలేదేమో. లేక అందెశ్రీ అక్షరాలపై వివక్ష వున్నదో తెలియదు కాని, దాన్ని రాష్ట్ర గీతంగా పెట్టటానికి మనసు రాలేదు. ఇన్నాళ్ళకు మొత్తానికి ప్రస్తుత ప్రభుత్వం దాన్ని రాష్ట్రగీతంగా ప్రకటించింది. కాని, ఇప్పుడే అసలైన సమస్య మొదలైంది. తెలంగాణ జాతికి అంకితం చేసే గీతానికి మరింత వన్నె తెచ్చి యావత్ తెలంగాణకు ఒక గొప్ప రాష్ట్ర గీతం అందివ్వాలని ప్రముఖ సంగీత దర్శకులు కీరవాణికి దానికి సంగీతం అందించే బాధ్యతను అప్పగించింది ప్రభుత్వం. వెంటనే మేధావులు, నాయకులు, కళాకారులు అందరూ ఒక్కసారిగా ఆంధ్ర వాళ్ల చేతిలో ఆత్మ గౌరవం ఎలా పెడతారు అని అడుగుతున్నారు.

పాటకి అక్షరమే ప్రాణం. సంగీతం కేవలం పాటకి హంగు మాత్రమే. తెలంగాణేతరులు సంగీతం అందిస్తే తెలంగాణ ఆత్మ గౌరవం దెబ్బతింటుందా? కళకు ప్రాంత, లింగ, వర్ణ విభేదాలు ఉండవు. అది విశ్వజనీనం. మరి ఈ విషయం అర్థమయ్యేలా ఈ విమర్శకులకు ఎలా చెప్పాలి?

– రామ్ ఠాకూర్ । విశ్లేషకులు, రచయిత

చిహ్నం విషయంలో చర్చ జరగాలి!

అభిప్రాయం


మాడభూషి శ్రీధర్

ఐదు దశాబ్దాల పైగా అస్తిత్వం కోసం పోరాడిన తెలంగాణకు జన గీతం ఏది? పదేళ్ల క్రితం 'మా రాష్ట్రం' అని చెప్పుకునే అవకాశం తెలంగాణ ప్రజలకు దక్కింది. ఒక రాష్ట్రంగా చిహ్నం, విగ్రహం రూపుదిద్దుకున్నాయి. తెలంగాణ అవతరణ పదేళ్ల తరువాత, కాంగ్రెస్ పార్టీవారి ప్రభుత్వం ఏర్పడింది. ఇప్పుడు ఈ ప్రభుత్వం అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని 'తెలంగాణ రాష్ట్ర గీతం'గా ప్రకటించింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని కూడా మార్చి కొత్త చిహ్నాన్ని రూపొందిస్తోంది. ఈ సందర్భంగా రకరకాల చర్చలు మొదలయ్యాయి.

దేశానికి ఒక జాతీయ గీతం ఉన్నట్లే రాష్ట్రానికి ఓ రాష్ట్ర గీతం ఉండాలని కోరుకోవడం సహజమే. రాష్ట్రం ఏర్పడ్డ పదేళ్ల తరువాత ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే... దానిపై వాడి వేడి చర్చలు జరుగుతున్నాయి.

జాతీయ గీతంలాగే రాష్ట్ర గీతం...

జాతీయ గీతం 'జన గణ మన', జాతీయ గేయం 'వందేమాతరం'... రెండింటినీ సమానంగా గౌరవించాలని మన రాజ్యాంగ సభ అధ్యక్షులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ రాజ్యాంగ సభలో ప్రకటించారు. అప్పటి నుంచి భారతీయులు ఆ యా గీతాలను అత్యంత గౌరవంతో ఆలపిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ పర్వదినాలను నిర్వహించే సమయంలో చిన్నా పెద్ద, అధికారి, అనధికారి అనే భేదం లేకుండా అందరూ గౌరవంగా నిలబడాలనేది ఒక నియమం. కనీసం జాతీయ గీతాలాపన సమయంలో మౌనంగా ఉండి తమ గౌరవాన్ని వ్యక్తం చేయాలి. అయితే అలా గౌరవించనివారూ ఉంటారు. అందుకు శిక్షలు ఉండవు. కాని, అవమానిస్తే మాత్రం నేరమే. రెండు జాతీయ గీతాలకూ, జాతీయ చిహ్నానికీ, జాతీయ పతాకానికీ సంబంధించి ఒక చట్టం కూడా చేసుకున్నాం.

దేశ సౌభాగ్యాన్నీ, సంస్కృతీ వారసత్వాలూ, గొప్పదనాన్నీ ప్రతిబింబించే మన జాతీయ గీతాలను గర్వంగా భారతీయులమంతా ఎలా ఆలపిస్తున్నామో... అంతే గర్వంగా రాష్ట్రాల ప్రజలు తమ తమ రాష్ట్ర గీతాలను ఆలపించడం సహజం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి పదేళ్లయినా ఇంతవరకూ రాష్ట్ర గీతం అంటూ ఏదీ లేకపోవడాన్ని కొందరు చర్చిస్తూ వచ్చారు. చరిత్ర, సంస్కృతి, వారసత్వాల పేర సాగిన ఉద్యమ ఫలితంగా ఏర్పడిన రాష్ట్రం కావడంతో ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వం అందెశ్రీ రాసిన గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడంతో చాలామంది స్వాగతించారు. ఎందుకంటే ఈ గీతం తెలంగాణలో ఉన్న పాత జిల్లాల అన్నింటి ప్రత్యేకతలనూ, వైశిష్ట్యాన్నీ అద్భుతంగా ఆవిష్కరించింది కనుక. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలందరినీ ఒక ఊపు ఊపింది కనుక. అలాగే దీని రచయిత అందెశ్రీ తెలంగాణ మట్టిమనిషి, ఉద్యమకారుడు. తన కలం, గళం ద్వారా ప్రజా బాహుళ్యంలోకి చొచ్చుకుపోయినవారు. అందుకే చాలా మంది రాష్ట్ర గీత ప్రకటనను స్వాగతిస్తున్నారు.


తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ

రాష్ట్ర ప్రభుత్వ కొత్త చిహ్నం

గత తెలంగాణ ప్రభుత్వం ఆమోదించి అమలులో పెట్టిన ప్రభుత్వ చిహ్నాన్ని పక్కన పెట్టి, ప్రస్తుత ప్రభుత్వం మరో నమూనాను రూపొందిస్తున్నది. ఇప్పటికే దానిపై సీపీఐ, సీపీఎం, తెలంగాణ జనసమితి వంటి రాజకీయ పార్టీల నేతలతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. ఈ నమూనా చాలా బాగుందని కొందరూ, బాగులేదనీ మరికొందరూ అంటున్నారు.

అసలు ఇప్పుడు రాష్ట్ర చిహ్నాన్ని మార్చడం, రాష్ట్ర గీతం అంటూ ఒక గీతాన్ని ప్రకటించడం అవసరమా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. పోనీ వాటిని నిర్ణయించేటప్పుడు ప్రధాన ప్రతిపక్షాన్ని సంప్రదించాలి కదా? దాన్నీ ఈ ప్రక్రియలో భాగం చేయలేదనేది ప్రధానమైన విమర్శ. ఇది సమస్యల నుంచి ప్రజలను పక్కదారి పట్టించి ఏమార్చడానికే అని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.

విధానం, సంవిధానం?

దేశానికి కానీ, రాష్ట్ర స్థాయిలో ప్రతి రాష్ట్రానికి కానీ ఒక ప్రత్యేక నిర్ణయ విధానం (పాలసీ) అంటూ ఒకటి ఉండాలి. ప్రజలందరికీ సంబంధించిన కొన్ని అంశాలపై నిర్ణయాలను కేవలం 'మంత్రివర్గం' తీసుకుంటే సరిపోదు. విస్తృతంగా ప్రజాభిప్రాయాన్ని సేకరించాల్సి ఉంటుంది. సభలు, సదస్సులు, జిల్లా స్థాయి చర్చలు, సంప్రదింపులు జరపాలి. సోషల్ మీడియా, ఇంటర్నెట్ ద్వారా వివిధ వర్గాల వారి అభిప్రాయాలను సేకరించిన తర్వాతే కొన్ని నిర్ణయాలు ప్రభుత్వం తీసుకోవాలి. మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలూ, అసెంబ్లీ సమావేశాల్లో చేసిన చర్చలూ, నిర్ణయాలను అందరికీ అందుబాటులో ఉండేలా వెబ్‌సైట్‌లో పెట్టాలి. మొత్తంమీద రాష్ట్ర గీత ప్రకటన, ప్రభుత్వ చిహ్నం మార్పు వంటి అంశాల్లో అధికార పక్షం ఏకపక్షంగా వ్యవహరించడం అన్యాయం.

వ్యాసకర్త డీన్, స్కూల్ ఆఫ్ లా,
మహీంద్రా యూనివర్సిటీ

ఆదర్శ హనుమాన్

భారత దేశంలో అత్యధిక భక్తుల చేత నిత్యం ఆరాధించబడుతున్న దైవం ఆంజనేయ స్వామి. పురాణాల్లో ఏ దేవునికీ లేని ప్రత్యేకత హనుమంతుని సొంతం. హనుమంతుడు గొప్ప వ్యాకరణశాస్త్ర పండితుడు. బాల్యంలో కఠోర దీక్షతో, శ్రద్ధగా సూర్యుని దగ్గర విద్య నేర్చుకున్నాడు. ధర్మాధర్మ విచక్షణ జ్ఞానాలు తెలిసిన వ్యక్తి. ఎదుటివారిని ఆకట్టుకునేలా ప్రసంగించే వాక్చాతుర్యం ఆయన సొంతం. ఈ అద్భుత తెలివితేటలే శ్రీరామ–సుగ్రీవ మైత్రిని కలిసేలా చేసింది. శ్రీరాముణ్ణి యజమానిగా, సుగ్రీవుణ్ణి మహారాజుగా ఇద్దరికీ సమ ప్రాధాన్యత నిచ్చాడు. లంకలో రావణునికి నీతి వచనాలతో హిత బోధ చేశాడు. మనం హనుమంతుని జీవిత చరిత్ర నుండి కమ్యూనికేషన్ స్కిల్స్, ఎదుటి వారిని మెప్పించే నైపుణ్యం, యజమాని (మనం పని చేసే డిపార్ట్‌మెంట్/కంపెనీ) పట్ల పూర్తి విధేయత, నమ్మకం, సంపూర్ణ విశ్వసనీయతతో ఎలా ఉండాలి వంటివి నేర్చుకోవచ్చు.

ఇంతేనా... ఆయన నుంచి నేర్చుకోవలసిన సుగుణాలు చాలానే ఉన్నాయి. ఎదుటివారిపట్ల సముచిత గౌరవం, నమ్మిన వారి కోసం ఏమైనా చేసే త్యాగనిరతి, శత్రువుల పట్ల సమ న్యాయబద్ధంగా వ్యవహరించే మాటతీరు, గురువు పట్ల నిస్వార్థ భక్తి భావన, రాజ్యం పట్ల సైనికుడిగా విద్యుక్త ధర్మం, నిరాడంబర జీవనం, అన్ని తెలిసినా ఇంకా తెలుసుకోవాలనే జిజ్ఞాస, ధర్మరక్షణ కోసం శ్రమించే వీరత్వం, ఆపద సమయంలో ప్రదర్శించే ఆత్మ విశ్వాసం లాంటివి ముఖ్యమైనవి.

తాను ఎంత బలవంతుడైనప్పటికీ అతి సాధారణంగా జీవించడం హనుమంతుడు మనకు నేర్పాడు. సముద్రాన్ని దాటినా, లంకను సగం కాల్చినా, సీతమ్మను తీసుకువచ్చే బలం ఉన్నా... ఎప్పుడూ పొంగిపోలేదు. సుగ్రీవుని వేలాది సైన్యంలో తానూ ఒక సైనికుడిగా రాచకార్యంలో భాగంగానే ఈ పనులు నిర్వర్తించానని భావించాడు. ఇంత చేసి అంత చెప్పుకునే చాలామందికి హనుమాన్ కనువిప్పు. ఆధునిక భావి తరానికి చక్కని మార్గదర్శి. హనుమంతుని జీవనాన్ని అధ్యయనం చేసిన వారికే ఆ గొప్పతనం తెలుస్తుంది.

– బైతి దుర్గయ్య
(నేడు హనుమాన్ జయంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.నవమి ఉ.6.21 వరకు, తదుపరి దశమి తె.3.50 వరకు(తెల్లవారితే ఆదివారం), **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.2.28 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ప.1.04 నుండి 2.33 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.35 నుండి 7.12 వరకు, **అమృతఘడియలు:** రా.10.01 నుండి 11.31 వరకు ; **రాహుకాలం :** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం :** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం :** 5.28, **సూర్యాస్తమయం :** 6.27.


DMart®
Daily Discounts Daily Savings
కొత్త క్లాస్,
కొత్త ఆరంభం
కనీసం 6% డిస్కౌంట్
స్టేషనరీ
ఎంఆర్‌పిపై 10%-30% తగ్గింపు
బ్రాండెడ్ లాంగ్‌బుక్ మరియు నోట్‌బుక్‌లు
ఎంఆర్‌పిపై కనీసం 20% తగ్గింపు
పెన్నులు
ఎంఆర్‌పిపై కనీసం 20% తగ్గింపు
పెన్సిల్స్
₹15*# నుంచి
ప్లాస్టిక్ పెన్సిల్ బాక్స్‌లు
₹275* మాత్రమే
జెకె కాపీయర్ పేపర్
ఎ4 (21 సెం.మీ x 29.7 సెం.మీ)
70 జీఎస్ఎమ్
500 షీట్‌లు
ఎంఆర్‌పి ₹ 355
ఎంఆర్‌పిపై కనీసం 20% తగ్గింపు
అన్ని పిడిలైట్ ఉత్పత్తులపై
ఎంఆర్‌పిపై కనీసం 15% తగ్గింపు
డ్రాయింగ్ ఉపకరణాలు
₹39*# నుంచి
పెన్సిల్ పర్సులు
₹139*# నుంచి
మెటల్ మరియు మాగ్నెటిక్ పెన్సిల్ బాక్స్‌లు
₹179*# మాత్రమే
12 ఫోల్డర్ ఎగ్జిక్యూటివ్ ఫైల్
ఎంఆర్‌పి ₹ 250
₹21*# నుంచి
బుక్ లేబుల్ స్టిక్కర్
₹55*# మాత్రమే
బ్రౌన్ బుక్ కవర్
ఎంఆర్‌పి ₹ 70
₹219*# మాత్రమే
కాలిక్యులేటర్
ఎంఆర్‌పి ₹ 400
₹49*# నుంచి
కత్తెర
₹199*# మాత్రమే
ఎగ్జిక్యూటివ్ ఫోల్డర్
12 పాకెట్ ఫైల్
ఎంఆర్‌పి ₹ 310
ఎంఆర్‌పిపై 20% తగ్గింపు
అన్ని కంగారు ఉత్పత్తులపై
ఎంఆర్‌పిపై 20% తగ్గింపు
అప్సర ఎరేజర్ మరియు షార్పెనర్
₹995*# నుంచి
స్టడీ టేబుల్
ఎంఆర్‌పి ₹ 1,110
బ్యాగ్‌లు, బాక్స్‌లు మరియు మరిన్ని
₹299*# నుంచి
© 2024 MARVEL
స్కూల్ సంచి
₹299*# నుంచి
© Disney
స్కూల్ సంచి
₹199*# నుంచి
స్కూల్/కాలేజ్ బ్యాగులు
₹79*# నుంచి
లంచ్ బాక్స్
₹99*# మాత్రమే
స్టీల్ ఫ్లెక్సీ 2 లేయర్ లంచ్ బాక్స్
ఎంఆర్‌పి ₹ 399
₹299*# నుంచి
స్టీల్ లంచ్ బాక్స్
₹39*# నుంచి
© Disney/Pixar
లంచ్ బాక్స్
₹49*# నుంచి
© Disney
బాటిల్
₹199*# నుంచి
స్టీల్ బాటిల్
₹249*# మాత్రమే
కిడ్స్ గొడుగు
ఎంఆర్‌పి ₹ 280
₹149*# నుంచి
బిల్డింగ్ బ్లాక్స్
₹129*# నుంచి
ఎవా పజిల్
₹169*# నుంచి
స్కూల్ షూస్
టిఫిన స్నాక్స్ మరియు గ్రోసరీ
₹589* మాత్రమే
ప్రొ వి సెలెక్ట్ కాలిఫోర్నియా బాదంపప్పు
1 కిలో
ఎంఆర్‌పి ₹ 1,349
₹135* మాత్రమే
బ్రిటానియా న్యూట్రి చాయిస్ డైజెస్టివ్ బిస్కెట్స్
1 కిలో
ఎంఆర్‌పి ₹ 169
కొనండి 1 పొందండి 1 ఉచితంగా
సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ చోకో ఫిల్స్
562.5 గ్రాములు
ఎంఆర్‌పి ₹ 350*
₹99* మాత్రమే
లోట్టె చాకోపై బిస్కెట్
336 గ్రాములు
ఎంఆర్‌పి ₹ 170
కొనండి 1 పొందండి 1 ఉచితంగా
పార్లే రియల్ ఎలాచి రస్క్
1 కిలో
ఎంఆర్‌పి ₹ 200*
₹99* మాత్రమే
క్యాడ్‌బరీ డెయిరీ మిల్క్ చాక్లెట్
123 గ్రాములు
ఎంఆర్‌పి ₹ 130
₹23* మాత్రమే
బ్రిటానియా గుడ్ డే గోబెల్స్ ఫ్రూట్/చాకో చిల్ కేక్
110 గ్రాములు
ఎంఆర్‌పి ₹ 30
₹75* మాత్రమే
సన్‌ఫీస్ట్ యిప్పీ మ్యాజిక్ మసాలా నూడుల్స్
480 గ్రాములు
ఎంఆర్‌పి ₹ 112
₹99* మాత్రమే
కిసాన్ ఫ్రెష్ టమాటా కెచ్‌అప్ పౌచ్
850 గ్రాములు
ఎంఆర్‌పి ₹ 120
₹175* మాత్రమే
సఫోలా మసాలా మరియు కోరియాండర్ ఓట్స్
500 గ్రాములు
ఎంఆర్‌పి ₹ 235
₹350* మాత్రమే
డాబర్ నో షుగర్ అడల్ట్రేషన్ హనీ
1.3 కిలో
ఎంఆర్‌పి ₹ 610
₹235* మాత్రమే
డాబర్ రెడ్ టూత్ పేస్ట్ వ్యాల్యూ ప్యాక్
600 గ్రాములు
ఎంఆర్‌పి ₹ 348
కొనండి 1 పొందండి 1 ఉచితంగా
హిమాలయ ప్యూరిఫైయింగ్ నీమ్ ఫేస్ వాష్
200 మి.లీ
ఎంఆర్‌పి ₹ 299*
₹599*/₹539* మాత్రమే
సర్ఫ్ ఎక్సెల్ మాటిక్ ఫ్రంట్/ టాప్ లోడ్ లిక్విడ్ డిటర్జెంట్ పౌచ్
4 లీ
ఎంఆర్‌పి ₹ 950 / ₹ 850
₹599* మాత్రమే
రిన్ డిటర్జెంట్ పౌడర్
7 కిలో
ఎంఆర్‌పి ₹ 755
₹180* మాత్రమే
కంఫర్ట్ మార్నింగ్ ఫ్రెష్ ఫ్యాబ్రిక్ కండిషనర్
800 మి.లీ
ఎంఆర్‌పి ₹ 235
₹230* మాత్రమే
ఓడోనిల్ ఎయిర్ ఫ్రెషనర్ మిస్టిక్ రోజ్ 3+1 ఉచితం
75x3 గ్రాములు
ఎంఆర్‌పి ₹ 310
₹299* మాత్రమే
సోఫీ యాంటీ బ్యాక్టీరియా ఎక్స్ఎల్
48 U
ఎంఆర్‌పి ₹ 449
₹42* మాత్రమే
లూస్ చక్కెర
1 కిలో
₹55* మాత్రమే
లూస్ సోనా మసూరి కర్నూలు రైస్
1 కిలో
₹89* మాత్రమే
లూస్ బిర్యానీ రైస్
1 కిలో
₹33* మాత్రమే
లూస్ గోధుమ పిండి
1 కిలో
₹127* మాత్రమే
లూస్ ఉరద్ గోట
1 కిలో
₹172* మాత్రమే
లూస్ తాండూర్ కంది పప్పు
1 కిలో
₹37* మాత్రమే
లూస్ ఇడ్లీ రవ్వ
1 కిలో
₹63* మాత్రమే
లూస్ శనగపిండి
1 కిలో
₹125* మాత్రమే
లూస్ వేరుశనగ
1 కిలో
₹49* మాత్రమే
లూస్ అటుకులు
1 కిలో
₹40* మాత్రమే
లూస్ లాప్సీ రవా
1 కిలో
₹349* మాత్రమే
లూస్ జీరా
1 కిలో
₹125* మాత్రమే
లూస్ ఎమ్లీ
1 కిలో
₹369* మాత్రమే
జీడిపప్పు
500 గ్రాములు
ఎంఆర్‌పి ₹ 577
₹329* మాత్రమే
బాదంపప్పు
500 గ్రాములు
ఎంఆర్‌పి ₹ 511
₹115* మాత్రమే
ఇండియన్ కిస్మిస్
500 గ్రాములు
ఎంఆర్‌పి ₹ 187
రామంతాపూర్: 040-27032906 • ఉప్పల్ భాగ్: 9154846426 • మేడిపల్లి: 7337325489 • ఉప్పల్ రంగారెడ్డి, తెలంగాణ డీమార్ట్: 040-29331007 • బంజారాగూడ: 040-29556703 • సనత్‌నగర్ (మైహోమ్): 040-69014700 • బాలానగర్: 040-23075362 • మూసాపేట (పివిసిఆర్): 040-29568367/65 • కొంపల్లి: 040-27165371 • అంబర్‌పేట్: 040-27428335
హైదర్‌గూడ (హిమాయత్‌నగర్): 040-23298560 • కాచీగూడ: 040-29550956 • మదీనాగూడ (మియాపూర్): 040-23047281 • ఆర్‌సి పురం: 0845-5297917 • నల్లగండ్ల: 040-29568265 • హాఫీజ్‌పేట్: 040-49024270 • కూకట్‌పల్లి (ఎన్ఎస్ఎల్): 040-29568182 • షేక్‌పేట్ (టోలి చౌక్): 7207851375 • కావూరి హిల్స్: 040- 43730255
ఉప్పర్‌పల్లి (అత్తాపూర్): 040-29705890 • బోయినపల్లి: 040-46014924 • ఎస్.డి. రోడ్డు (సికింద్రాబాద్): 040 27718041 • కుషాయిగూడ: 040-49884386 • సాఫిల్‌గూడ: 040-27130123 • వనస్థలిపురం: 040-29882485 • చంపాపేట: 7207268492 • మలక్‌పేట: 040-68234900 • ఎల్.బి నగర్: 040-69019809 • ఘట్కేసర్: 7382054232
సూర్యాపేట: 8684-293301 • వరంగల్: 9440013896/944016185 • కడిపికొండ (కాజీపేట): 0870-4055954 • లక్ష్మీపురం, వరంగల్-2: 0870-2959001 • మంచిర్యాల్ ఆదిలాబాద్: 0878-2959300 • మంచిర్యాల్ ఆదిలాబాద్: 08736-295800 • నిజాంపేట: 040-29370013 • నార్సింగి: 8333905810 • మిర్యాలగూడ: 8500259852
నిర్మల్: 9440666557 • రాంపూర్ కరీంనగర్-2: 8333901746
చిత్రాలు ప్రాతినిధ్య ప్రయోజనాల కోసం మాత్రమే • ఉత్పత్తి ఆఫర్‌లు స్టాక్‌లు ఉండే వరకు చెల్లుబాటు అవుతాయి • స్థానాలకు బట్టి ధరలు మరియు ఆఫర్‌లు మారవచ్చు
ప్రదర్శించబడే బ్రాండ్‌లు సంబంధిత బ్రాండ్ యజమానుల స్వంతం • ^ నిర్వాహణ తన అభీష్టానుసారం ధరలను మార్చడానికి మరియు ఉత్పత్తులను విక్రయించే హక్కును కలిగి ఉంది. • నియమ నిబంధనలు వర్తిస్తాయి • *రిటైల్ విక్రయ ధర • #
1N
Impulse/06/24



మోదీ ధ్యాన ముద్ర

సాక్షి, చెన్నై: కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్‌లో ధ్యానం చేస్తున్న ప్రధాని మోదీ శుక్రవారం సూర్యోదయ వేళ సూర్యునికి అర్ఘ్యం సమర్పించారు. కాషాయ వస్త్రాలను ధరించిన ప్రధాని మోదీ జపమాల చేబూని, కమండలంలోని జలాన్ని సముద్రంలోకి వదులుతూ ప్రార్థన చేశారు. అనంతరం సర్వశక్తిమంతుడైన ఆ సూర్యభగవానునికి ముకుళిత హస్తాలతో నమస్కరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను, సంక్షిప్త వీడియోను బీజేపీ 'ఎక్స్'లో షేర్ చేసింది. ధ్యాన మంటపంలో ప్రధాని ధ్యానంలో ఉన్న ఫొటోలను, జపమాలతో ధ్యాన మంటపం చుట్టూ ఆయన ప్రదక్షిణలు చేస్తున్న ఫొటోలను కూడా బీజేపీ విడుదల చేసింది. మే 30వ తేదీ సాయంత్రం మొదలైన మోదీ ధ్యానం జూన్ ఒకటో తేదీ సాయంత్రంతో ముగియాల్సి ఉంది. అయితే, ప్రధాని మోదీ పర్యటన కారణంగా వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద పర్యాటకులు ఇబ్బందులు పడ్డారని తమిళనాడు మంత్రి దురైమురుగన్ ఆరోపించారు. ఆ పరిసర ప్రాంతాల్లోకి ప్రజలతోపాటు ఓడలు, విమానాలను కూడా అనుమతించలేదని చెప్పారు. 'ఎన్ని భంగిమలు! ఎంతమంది ఫొటోగ్రాఫర్లు! స్వామి వివేకానంద మౌనంగా ఉన్నారు'అంటూ తమిళనాడు కాంగ్రెస్ ప్రధాని మోదీ ధ్యానంపై వ్యాఖ్యానించింది.

అమెరికా స్పెల్ బీ విజేత బృహత్ సోమ

బృహత్ తండ్రి శ్రీనివాస్ సోమ నల్లగొండ వాసి

ఫ్లోరిడాలో స్థిరపడిన శ్రీనివాస్ కుటుంబం

వాషింగ్టన్: అమెరికా స్పెల్లింగ్ పోటీలో తెలుగు సంతతి విద్యార్థి గెలుపొందారు. ఏడో గ్రేడ్ చదువుతున్న 12 ఏళ్ల బృహత్ సోమ.. ప్రతిష్టాత్మక స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ–2024లో విజేతగా నిలిచాడు. 90 సెకన్లలో 29 పదాలకు సరైన సమాధానం ఇచ్చి బహుమతిగా 50వేల డాలర్లు అంటే దాదాపు రూ.41.64లక్షలు గెలుచుకున్నాడు. వాషింగ్టన్‌లో మూడు రోజుల పాటు జాతీయ స్పెల్‌బీ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. 50 రాష్ట్రాల నుంచి 245 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. 14 రౌండ్ల తర్వాత గురువారం జరిగిన ఫైనల్‌కు 8 మంది చేరుకున్నారు. ఫైనల్‌లో మొదట 30 పదాలకు 29కి సరైన సమాధానం చెప్పిన బృహత్ టై బ్రేకర్‌గా నిలిచాడు. 25 పదాల్లో 21 పదాలకు సరైన సమాధానం ఇచ్చిన ఫైజన్ జాకీ మిగిలిన ఆరుగురిని అధిగమించాడు. లైటెనింగ్ రౌండ్‌లో బృహత్‌తో పోటీ పడలేకపోయాడు. 90 సెకన్లలో 30 పదాల్లో 29 పదాలకు స్పెల్లింగ్‌ను కరెక్టుగా చెప్పి బృహత్ రికార్డు నెలకొల్పాడు. అబ్సీల్ అనే పదం బృహత్‌కు చాంపియన్‌షిప్‌ను అందించింది. 90 సెకన్లలో 20 పదాలకు మాత్రమే సరైన సమాధానం ఇచ్చిన ఫైజన్ రెండో స్థానంలో నిలిచాడు. 25వేల డాలర్లను గెలుచుకున్నాడు. ఇక కాలిఫోర్నియాకు చెందిన శ్రేయ్ పారిఖ్, నార్త్ కరోలినాలోని అపెక్స్‌కు చెందిన అనన్య ప్రసన్న మూడో స్థానంలో నిలిచారు. చెరో 12,500 డాలర్లను బహుమతిగా అందుకున్నారు. ఫైనల్‌కు చేరిన ఎనిమిది మంది విద్యార్థుల్లో ఐదుగురు భారతీయ సంతతికి చెందినవారు. కాలిఫోర్నియాకు చెందిన 14 ఏళ్ల రిషబ్ సాహా, కొలరాడోకు చెందిన 13 ఏళ్ల అదితి ముత్తుకుమార్ కూడా ఫైనల్‌కు చేరినవారిలో ఉన్నారు.

అమోఘమైన జ్ఞాపకశక్తి..

బృహత్ తండ్రి శ్రీనివాస్ సోమ నల్లగొండ జిల్లాకు చెందిన వ్యక్తి. ఫ్లోరిడాలో స్థిరపడ్డారు. బృహత్‌కు జ్ఞాపకశక్తి ఎక్కువని, భగవద్గీతలో 80 శాతం కంఠతా వస్తుందని అతని తల్లిదండ్రులు తెలిపారు. ''గెలిచానని ప్రకటించగానే కొన్ని క్షణాలపాటు నమ్మలేకపోయాను. నా గుండె వేగం పెరిగింది. ఆ తరువాత గొప్ప అనుభూతినిచ్చింది'' అని బృహత్ వెల్లడించాడు. కేవలం 12 ఏళ్ల వయసులో బృహత్ తన ప్రశాంతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడని స్క్రిప్స్ నిర్వాహకులు తెలిపారు. బృహత్‌కు గొప్ప జ్ఞాపకశక్తి ఉందని, అన్ని రౌండ్లలో ఏ ఒక్క పదాన్ని కోల్పోకుండా సమాధానం చెప్పి పదాలను శాసించాడని కొనియాడారు. గతంలోనూ స్పెల్ బీలో పాల్గొన్న బృహత్ 2023లో 74వ స్థానంలో, 2022లో 163 స్థానంలో నిలిచారు. వివిధ అంశాల్లో ఆసక్తి, అభిరుచి ఉన్న బృహత్ అంతకుముందు వర్డ్స్ ఆఫ్ విస్డమ్ బీ, స్పెల్ పండిట్ బీలను కూడా గెలుచుకున్నాడు.

భారత సంతతి విద్యార్థుల హవా...

కాగా, స్పెల్ బీలో భారత సంతతి విద్యార్థుల హవా కొనసాగుతోంది. గత ఏడాది స్పెల్ బీని సైతం భారత సంతతికి చెందిన విద్యార్థి దేవ్ షా గెలుచుకున్నాడు. 2022లో హరిణి లోగాన్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. దేశంలోనే అతిపెద్ద, ఎక్కువ రోజులు జరిగే కార్యక్రమం అయిన స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీని 1925లో ప్రారంభించారు. 1999 నుంచి ఇప్పటివరకు ఇరవై తొమ్మిది మంది భారతీయ సంతతికి చెందిన విద్యార్థులే చాంపియన్లుగా నిలిచారు.



తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి స్పెల్ బీ ట్రోఫీతో బృహత్ సోమ

నేడు ఎగ్జిట్‌పోల్స్

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ తుది దశ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ శనివారంతో ముగియనుండటంతో అందరి దృష్టి ఎగ్జిట్ పోల్స్‌పై పడింది. శనివారం చివరి దశలో ఎన్నికలు జరుగుతున్న 57 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే పోలింగ్ ఏజెన్సీలు, న్యూస్ ఛానెళ్లు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయనున్నాయి. జూన్ ఒకటి సాయంత్రం 6 గంటల వరకు ఎగ్జిట్ పోల్ ఫలితాలను ప్రచురించకుండా న్యూస్ ఛానెల్‌లను ఎన్నికల సంఘం నిషేధించిన నేపథ్యంలో సాయంత్రం 6.30 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ విడుదల కానున్నాయి. దేశంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏ కూటమి ఏర్పాటు చేస్తుందన్న దానిపై అంచనాలను వెల్లడించనున్నాయి. రాజకీయ పండితులు బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ) విజయం సాధిస్తుందని అంచనా వేస్తుండగా, ఇండియా కూటమి చివరివరకు గట్టిగా పోరాడటంతో ఎగ్జిట్ పోల్స్‌పై అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2019 ఎన్నికల సమయంలో బీజేపీ సొంతంగా 303 స్థానాలు, ఎన్డీఏ కూటమితో కలిసి 352 స్థానాలు గెలుచుకున్నాయి.





హిమాచల్ ప్రదేశ్‌లోని తషిగంగ్ గ్రామంలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ ఇది ● ఈ పోలింగ్ స్టేషన్ వద్ద సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నేడే తుదిపోరు

చండీగఢ్ సహా ఏడు రాష్ట్రాల్లోని 57 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్

ఒడిశాలో 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు సైతం పోలింగ్

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగింపు దశకు చేరింది. ఎన్నికల్లో భాగంగా ఆఖరి విడత పోలింగ్ శనివారం జరుగనుంది. కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్‌పాటు బిహార్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని 57 లోక్‌సభ స్థానాలకు ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుంది. వీటితో పాటు ఒడిశా శాసనసభ ఎన్నికల్లో మిగిలిన 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు సైతం పోలింగ్ నిర్వహిస్తారు. అంతేకాకుండా బిహార్ ఒకటి, ఉత్తరప్రదేశ్‌లో ఒకటి, పశ్చిమబెంగాల్‌లో ఒకటి, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు కూడా ఉపఎన్నిక జరుగనుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆఖరి దశలో పోలింగ్ జరిగే స్థానాల్లో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, అభిషేక్ బెనర్జీ, మీసా భారతి, కంగనా రనౌత్ వంటి ప్రముఖులు బరిలో నిలిచారు. చివరి విడతలోని 57 లోక్‌సభ స్థానాల్లో 2019 ఎన్నికల్లో ఎన్డీఏ 32, యూపీఏ 9 సీట్లు దక్కించుకున్నాయి. మిగతా స్థానాలను ఇతర పార్టీలు గెలుచుకున్నాయి. అంటే సగానికి పైగా ఎన్డీయే సిట్టింగ్ స్థానాలు ఉన్నాయి. ఏప్రిల్ 19న ప్రారంభమైన సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటిదాకా జరిగిన ఆరు దశల్లో 486 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. కాగా మొత్తం ఏడు దశల్లోని 543 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీ ఎన్నికలు, 13 రాష్ట్రాల్లోని 26 అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న ప్రారంభం కానుంది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ జూన్ 2న ప్రారంభమవుతుంది.

పోలింగ్ జరిగే లోక్‌సభ స్థానాలు

రాష్ట్రం	స్థానాలు
పంజాబ్	13
ఉత్తరప్రదేశ్	13
పశ్చిమ బెంగాల్	9
బిహార్	8
ఒడిశా	6
హిమాచల్‌ప్రదేశ్	4
జార్ఖండ్	3
చండీగఢ్	1

మొత్తం స్థానాలు 57

జనరల్ 41
ఎస్టీ 03
ఎస్సీ 13

మొత్తం ఓటర్లు	10.06 కోట్లు
పురుషులు	5.24 కోట్లు
మహిళలు	4.82 కోట్లు

ఇప్పటిదాకా 6 దశల్లో నమోదైన పోలింగ్

దశ	లోక్‌సభ స్థానాలు	పోలింగ్ శాతం
1	102	66.14
2	88	66.71
3	93	65.68
4	96	69.16
5	49	62.2
6	58	63.36



ఏమిటీ కేసు?

శృంగార తార స్టార్మీ డేనియల్‌తో ట్రంప్ సన్నిహితంగా గడిపినట్లు వార్తలొచ్చాయి. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో ఆమె నోరు విప్పితే తనకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండడంతో ట్రంప్ అడ్డదారి ఎంచుకున్నారు. ఆమె నోరు మూయించేందుకు 1.30 లక్షల డాలర్లు తన లాయర్ ద్వారా చెల్లించారు. ఎన్నికల ప్రచారం కోసం పార్టీకి అందిన విరాళాల నుంచే ఈ సొమ్మును స్టార్మీ డేనియల్‌కు చేరవేశారు. అక్రమ చెల్లింపులను కప్పిపుచ్చడానికి బిజినెస్ రికార్డులను తారుమారు చేశారు. ఈ వ్యవహారమంతా బహిర్గతం కావడంతో అమెరికాలో గగ్గోలు మొదలైంది. ట్రంప్‌పై విచారణ అధికారులు 34 అభియోగాలు నమోదు చేశారు. ఈ కేసులో న్యూయార్క్ కోర్టులో సుదీర్ఘంగా విచారణ జరిగింది. 22 మంది సాక్షులను న్యాయస్థానం ప్రశ్నించింది. ఎన్నికల చట్టాన్ని ట్రంప్ ఉల్లంఘించారని, పోర్న్ స్టార్‌కు చెల్లించిన సొమ్మును కోర్టు ఖర్చుల కింద చూపించారని ప్రాసిక్యూటర్లు వాదించారు. ట్రంప్ తనతో ఏకాంతంగా గడిపిన మాట నిజమేనని స్టార్మీ డేనియల్ కోర్టుకు ఇచ్చిన వాంగ్మూలంలో అంగీకరించారు. గురువారం 12 మంది న్యాయమూర్తుల ప్యానెల్ చరిత్రాత్మక తీర్పు వెలువరించింది.

డొనాల్డ్ ట్రంప్ దోషి

హష్ మనీ కేసులో న్యూయార్క్ కోర్టు తీర్పు

- ట్రంప్‌పై 34 అభియోగాలు రుజువయ్యాయని వెల్లడి
- జూలై 11న శిక్ష ఖరారు చేయనున్న న్యాయస్థానం
- జైలు శిక్ష లేదా జరిమానా విధించే అవకాశం
- అవినీతికి పాల్పడి తప్పుడు తీర్పు ఇచ్చారని ట్రంప్ ఆగ్రహం
- ఒక కేసులో దోషిగా తేలిన అమెరికా తొలి మాజీ అధ్యక్షుడిగా రికార్డుకెక్కిన ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్: ఒక కేసులో దోషిగా తేలిన అమెరికా తొలి మాజీ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్(77) అప్రతిష్ట మూటగట్టుకున్నారు. పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌కు 1.30 లక్షల డాలర్లు అక్రమంగా చెల్లించి, బిజినెస్ రికార్డులు తారుమారు చేసిన కేసులో న్యూయార్క్ కోర్టు ఆయనను దోషిగా తేల్చింది. ట్రంప్‌పై నమోదైన 34 తీవ్ర అభియోగాలన్నీ రుజువయ్యాయని వెల్లడించింది. జూలై 11న న్యాయస్థానం తుది తీర్పు ఇవ్వడంతోపాటు శిక్ష ఖరారు చేయనుంది. ఈ వ్యవహారంలో ట్రంప్‌కు జైలు శిక్ష లేదా జరిమానా విధించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. శిక్ష పడినప్పటికీ.. మరో ఆరు నెలల్లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా ట్రంప్ పోటీ చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు కాబోవని అంచనా వేస్తున్నారు. న్యూయార్క్ కోర్టు తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. కోర్టు బయట ఆయన మీడియాతో మాట్లాడారు. ఓ న్యాయమూర్తి అవినీతికి పాల్పడి తప్పుడు తీర్పు ఇచ్చారని విమర్శించారు. ఇక్కడేం జరిగిందో ప్రజలకు తెలుసని చెప్పారు. అసలైన తీర్పును నవంబర్ 5న అధ్యక్ష ఎన్నికల్లో అమెరికా ప్రజలు ఇవ్వబోతున్నారని స్పష్టం చేశారు. తాను నిజాయతీపరుడినని, ఎలాంటి తప్పూ చేయలేదని పేర్కొన్నారు. అమెరికా కోసం, అమెరికా రాజ్యాంగం కోసం పోరాటం కొనసాగిస్తానని వెల్లడించారు. ఈ పోరాటంలో అంతిమ విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు.

హష్ మనీ కేసులో దోషిగా తేలిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ నిబ్బరంగానే కనిపించారు. కోర్టులో నిశ్శబ్దంగా ఉండిపోయారు. తుది తీర్పు వచ్చేదాకా బెయిల్‌పై బయటే ఉంటారు. జూలై 11న శిక్ష ఖరారు కానుంది. నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున ట్రంప్ అభ్యర్థిత్వం ఇప్పటికే ఖరారైంది. జూలై 15న మిల్వాకీలో రిపబ్లికన్ జాతీయ సదస్సులో ట్రంప్ అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించబోతున్నారు. అంతా అనుకున్నట్లు జరిగితే అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్(81)తో డొనాల్డ్ ట్రంప్ తలపడతారు. కోర్టు తీర్పుపై బైడెన్–కమలా హారిస్ ప్రచార విభాగం ప్రతినిధి, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ మైఖేల్ టైలర్ హర్షం వ్యక్తం చేశారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని న్యూయార్క్ కోర్టు తేల్చిచెప్పిందని అన్నారు

> రాజకీయ దురుద్దేశాలతోనే నాకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. ఇది హష్‌మనీ వ్యవహారం కాదు. ఇది బహిర్గతం చేయకూడదనే ఒక ఒప్పందం మాత్రమే. పూర్తిగా చట్టబద్ధంగానే జరిగింది. ఇలాంటివి అమెరికాలో సర్వసాధారణమే. ప్రత్యర్థులు నన్ను ఇలా ఇరికించారంటే వారు ఇక ఎవరినైనా ఇరికించగలరు. నాపై తప్పుడు కేసు పెట్టి, ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్నారు. వారి ఆటలు సాగవు
>
> – డొనాల్డ్ ట్రంప్

ఎన్నికల్లో ట్రంప్ పోటీ చేయొచ్చా?

న్యూయార్క్ కోర్టు తీర్పు నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి ట్రంప్ భవితవ్యంపై పడింది. కోర్టు ఆయనకు జైలు శిక్ష గానీ, జరిమానా గానీ విధిస్తే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తారా? చట్టపరంగా అది సాధ్యమేనా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. అమెరికా రాజ్యాంగం ప్రకారం చూస్తే నేరస్థులు ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకొనే నిబంధన ఏదీ లేదని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన న్యాయశాస్త్ర ప్రొఫెసర్ రిచర్డ్ ఎల్.హాసెన్ చెప్పారు. చట్టపరంగా ఇప్పుడు ట్రంప్ అభ్యర్థిత్వానికి వచ్చే ముప్పేమీ లేదని అన్నారు.

కారాగారమా? గృహ నిర్బంధమా?

- ట్రంప్‌పై 34 అభియోగాలు రుజువయ్యాయి. ఒక్కో అభియోగానికి గరిష్టంగా నాలుగేళ్ల చొప్పున జైలుశిక్ష, 5 వేల డాలర్ల దాకా జరిమానా విధించే అవకాశం ఉంది.
- జైలు శిక్ష కాకుండా జరిమానా, ప్రొబేషన్/సామాజిక సేవను శిక్షగా విధించవచ్చు. ప్రొబేషన్ శిక్ష విధిస్తే ప్రొబేషన్ అధికారి ఎదుట ట్రంప్ తరచుగా హాజరు కావాల్సి ఉంటుంది. కండీషనల్ డిశ్చార్జి అనే శిక్ష వేస్తే ప్రొబేషన్ అధికారి ఎదుట హాజరు కావాల్సిన అవసరం ఉండదు.
- గృహ నిర్బంధం విధించే అవకాశం సైతం లేకపోలేదు. అప్పుడు ట్రంప్ తన ఇంటికే పరిమితం కావాల్సి ఉంటుంది. ఆయన చుట్టూ ఎలక్ట్రానిక్ నిఘా పెడతారు. హౌజ్ అరెస్టు అయితే ట్రంప్ నాలుగు గోడల మధ్య నుంచే ఎన్నికల ప్రచారం చేయాలి.
- ట్రంప్ జైలుకెళ్తారా? అంటే కచ్చితంగా చెప్పలేమని న్యాయ నిపుణులు అంటున్నారు. రాబోయే అధ్యక్ష ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కోర్టు ఆయనకు జైలుశిక్ష విధించకుండా కేవలం జరిమానాతో సరిపెట్టే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

ఆదివారం లొంగిపోతా!

- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రకటన
- తన తల్లిదండ్రుల ఆరోగ్యం కోసం ప్రార్థించాలంటూ ప్రజలకు వినతి



సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్‌పై తిహార్ జైలు నుంచి బయటకు వచ్చిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం (జూన్ 2న) తిరిగి లొంగిపోనున్నారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేజ్రీవాల్ ఉద్వేగంతో మాట్లాడారు. ఈసారి తాను ఎన్ని రోజులు జైల్లో ఉంటానో తెలియదన్న కేజ్రీవాల్.. అనారోగ్యంతో ఉన్న తన తల్లిదండ్రుల కోసం ప్రార్థనలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా జైల్లో వేధింపులకు గురిచేస్తారని, అయినా తలవంచేది లేదని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. దేశాన్ని కాపాడే క్రమంలో తన ప్రాణాలు పోయినా ఎవరూ ఆవేదన చెందవద్దన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఆప్ అధినేత కూడా అయిన కేజ్రీవాల్‌ను ఈడీ మార్చిలో అరెస్టు చేసింది. కేజ్రీవాల్ వినతి మేరకు.. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వీలుగా సుప్రీంకోర్టు మే 10 నుంచి 21 రోజులపాటు అంటే జూన్ ఒకటో తేదీ వరకు మధ్యంతర బెయిలిచ్చిన విషయం తెల్సిందే. తిహార్ జైలు నుంచి బయటకు వచ్చిన యూపీ, పంజాబ్, ఢిల్లీ, మహారాష్ట్రల్లో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన 21 రోజుల గడువు జూన్ ఒకటో తేదీతో ముగియనుంది. అందుకే జూన్ 2న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిహార్ జైలులో అధికారుల ఎదుట లొంగిపోనున్నట్లు కేజ్రీవాల్ తెలిపారు.

ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అరెస్ట్

ఎయిర్‌పోర్టులోనే అదుపులోకి తీసుకున్న సిట్



సాక్షి, బెంగళూరు: దేశంలో సంచలనం సృష్టించిన లైంగిక దాడుల కేసు నిందితుడు, జేడీఎస్ ఎంపీ (హాసన్) ప్రజ్వల్ రేవణ్ణ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. నెల రోజులుగా విదేశాల్లో తలదాచుకున్న ప్రజ్వల్ గురువారం అర్ధరాత్రి బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన వెంటనే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మహిళా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లైంగిక దాడుల వీడియోలు బహిర్గతమైన వెంటనే, ఏప్రిల్ 26 రాత్రి జర్మనీకి పలాయనం చిత్తగించిన ప్రజ్వల్ 34 రోజుల తర్వాత తిరిగి బెంగళూరు చేరుకున్నారు. పోలీసుల సమన్లకు సైతం అతడు స్పందించలేదు. వెంటనే స్వదేశానికి వచ్చి విచారణ ఎదుర్కోకపోతే తన ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందంటూ మాజీ ప్రధాని దేవెగౌడ తన మనవడు ప్రజ్వల్‌కు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. దీంతో మే 31న కర్ణాటకకు తిరిగి వస్తున్నానని, సిట్ అధికారుల విచారణకు హాజరవుతానని ప్రజ్వల్ సోమవారం వీడియో విడుదల చేశారు. చెప్పినట్టుగానే మ్యూనిక్ నుంచి లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానం (ఎల్‌హెచ్ 764)లో ప్రజ్వల్ బెంగళూరుకు చేరుకున్నారు. అరెస్ట్ వారెంట్ చూపించి అతడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు సీఐడీ కార్యాలయానికి తరలించారు. ప్రాథమిక విచారణ పూర్తి చేసి, బౌరింగ్ అండ్ లేడీ కర్జాన్ హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం 42వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కేఎన్ శివకుమార్ ముందు హాజరు పరిచి, 14 రోజుల కస్టడీకి అభ్యర్థించారు. జూన్ 6వరకు (ఏడు రోజుల పాటు) పోలీసు కస్టడీకి అనుమతిస్తూ మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. ఎన్‌డీఏ అభ్యర్థిగా హాసన్ లోక్‌సభ స్థానం నుంచి ప్రజ్వల్ రేవణ్ణ మరోసారి పోటీ చేయడం తెలిసిందే.

ఉత్తరాదిన ఎండ ప్రచండం

- 43 మంది మృత్యువాత
- మృతుల్లో 25 మంది పోలింగ్ సిబ్బంది



లక్నో/పట్నా/భువనేశ్వర్/రాంచీ: ఉత్తరాదిన భానుడి భగభగలు, వడగాడ్పుల తీవ్రత కొనసాగుతోంది. 24 గంటల వ్యవధిలో మరో 43 మంది ఎండ తీవ్రతకు అనారోగ్యం పాలై చనిపోయినట్లు సమాచారం. వీరిలో ఎన్నికల విధుల్లో పాల్గొనే 25 మంది సిబ్బంది కూడా ఉండటం గమనార్హం. ఉత్తర ప్రదేశ్, బిహార్, ఒడిశా, జార్ఖండ్, రాజస్తాన్, పంజాబ్, హరియాణాల్లో ఎండలు అత్యంత తీవ్రంగా ఉన్నాయి. హరియాణాలోని ఫరీదాబాద్, నుహ్‌లలో శుక్రవారం 48.2, చండీగఢ్‌లో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజస్తాన్‌లోని కరౌలీలో అత్యధికంగా 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కొనసాగింది. ఉత్తరాది రాష్ట్రాల్లో జూన్ 3వ తేదీ వరకు ఎండల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. బిహార్‌లో శుక్రవారం కూడా 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలకు వడగాలులు తోడయ్యాయి. రాష్ట్రంలో 24 గంటల వ్యవధిలో 10 మంది పోలింగ్ సిబ్బంది సహా 14 మంది వడగాలులకు తాళలేక మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో 15 మంది పోలింగ్ సిబ్బంది సహా 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒడిశాలో వడదెబ్బతో ఐదుగురు చనిపోయారు. జార్ఖండ్‌లో చాలా చోట్ల 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. డాల్టన్‌గంజ్, గర్హ్వాల్లో శుక్రవారం 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రతతో నలుగురు మృతి చెందగా అనారోగ్యం పాలై 1,326 మంది ఆస్పత్రుల్లో చేరారు.

ఎన్నికలపై విదేశీ కుట్ర

ఇజ్రాయెల్ కేంద్రంగా ఆపరేషన్ ● అడ్డుకున్న ఓపెన్‌ఏఐ

న్యూఢిల్లీ: భారత్‌లో లోక్‌సభ ఎన్నికల చివరి దశ ముందు ఓపెన్ ఏఐ సంచలనాత్మక విషయాన్ని బయటపెట్టింది. ప్రజల అభిప్రాయాలను కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో కృత్రిమంగా ప్రభావితం చేసేందుకు ఇజ్రాయెల్ కేంద్రంగా జరిగిన కోవర్ట్ ఆపరేషన్‌ను అడ్డుకున్నట్లు చాట్ జీపీటీ సృష్టికర్త ఓపెన్ ఏఐ ప్రకటించింది. అధికార బీజేపీని విమర్శిస్తూ, ప్రతిపక్ష కాంగ్రెస్‌ను ప్రశంసిస్తూ 'ఎస్‌టీఓఐసీ' అనే రాజకీయ ప్రచార నిర్వహణ సంస్థ భారత ఎన్నికలపై కంటెంట్‌ను రూపొందించినట్లు తెలిపింది. ''భారత్‌ను లక్ష్యంగా చేసుకుని అధికార బీజేపీని విమర్శిస్తూ, కాంగ్రెస్‌ను పొగుడుతూ అభిప్రాయాలను ఎస్‌టీఓఐసీ మే నెలలో వ్యాప్తిలోకి తెచ్చింది. 24 గంటల్లోనే దీన్ని అడ్డుకున్నాం''అని ఓపెన్‌ఏఐ వెల్లడించింది. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ ప్లాట్‌ఫామ్‌లు, వెబ్‌సైట్లు, యూట్యూబ్ వేదికలపై ఓ సమూహంతో కూడిన అకౌంట్ల ద్వారా కంటెంట్ ఎడిట్, ప్రసారం చేసినట్టు, అలాంటి ఖాతాలను నిషేధించినట్టు ఓపెన్ ఏఐ ఓ నివేదిక రూపంలో బయటపెట్టింది. తమ ఏఐ టూల్స్ సాయంతో కథనాలు, అభిప్రాయాలను రూపొందించి వాటిని ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్లలో పోస్ట్ చేసినట్టు పేర్కొంది. ఈ ఆపరేషన్‌కు 'జీరో జెనో' అని పేరు పెట్టింది. ఏఐని సురక్షిత అవసరాలకే వినియోగించాలన్న లక్ష్యంలో భాగంగానే ఈ ఆపరేషన్‌ను విచ్ఛిన్నం చేసినట్టు తెలిపింది.

క్లుప్తంగా...

75 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: విత్తనాల సరఫరాను పర్యవేక్షించడానికి జిల్లా కలెక్టర్లు విస్తృతంగా పర్యటించాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. గత ఏడాది పచ్చిరొట్ట విత్తన విక్రయాలు 26,997 క్వింటాళ్లు ఉండగా.. ఈ ఏడాది 58,565 క్వింటాళ్లు పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. ఈ ఏడాది 75 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అందు బాటులో ఉంచామని స్పష్టం చేశారు. శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లతో మంత్రి మాట్లాడి విత్తన పంపిణీపై ఆరా తీశారు. గతేడాది 1,000 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు పంపిణీ అయితే.. ఈ ఏడాది 1,800 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మంత్రికి అధికారులు వివరించారు. రైతులు కోరుతున్న ఓ కంపెనీ పత్తి విత్తనాల విషయంలో 30 వేల ప్యాకెట్లు అదనంగా ఇవ్వడానికి ఆ కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసిందని తెలిపారు. ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేసి రైతులకు సకాలంలో విత్తనాలు అందేలా చూస్తామని మంత్రికి వివరించారు.

సీఎం రేవంత్‌రెడ్డికి బార్ కౌన్సిల్ చైర్మన్ కృతజ్ఞతలు

బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి

సాక్షి, హైదరాబాద్: న్యాయవాదులు ఆరోగ్య బీమా కోసం సీఎం రేవంత్‌రెడ్డి రూ.7 కోట్లు మంజూరు చేసినందుకు గాను ఆయనకు బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం నిర్ణయం పేద, మధ్య తరగతి న్యాయవాదులకు ఎంతో ఉపయుక్తమని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

హెచ్‌సీఏఏ తరఫున రవీందర్‌రెడ్డి...

ముఖ్యమంత్రి నిర్ణయంపై హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. తెలంగాణ ఏర్పడి పదేళ్లయిన సందర్భంగా న్యాయవాదులకు రేవంత్ ఇచ్చిన బహుమతి ఇది అని హెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఏ.రవీందర్‌రెడ్డి ప్రశంసించారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్‌ను కలసి హైకోర్టు న్యాయవాదులు తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

అవి తప్పుడు కేసులు.. కొట్టివేయండి

హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తనపై తప్పుడు కేసులు నమోదు చేశారని, వాటిని కొట్టివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్ వేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం టంగుటూరులో, చేవెళ్ల మండలం ఎర్రపల్లిలో భూవివాదానికి సంబంధించి స్థానిక పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులను కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ నేత జీవన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు హైకోర్టులో పిటిషన్ వేశారు. 170 ఎకరాల్లో 33 ఎకరాలను మాత్రమే విక్రయించామని.. మిగిలిన భూమి తమదేనంటూ మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు బెదిరిస్తున్నారంటూ చైతన్య రిసార్ట్స్‌కు చెందిన సామ దామోదర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసులు నమోదయ్యాయి. జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులు దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారు నుంచి తాము భూమి కొనుగోలు చేశామని, ఆ భూమిపై తమకు హక్కులున్నాయని పిటిషనర్లు పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తే దర్యాప్తునకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. వాదనలను విన్న న్యాయ మూర్తి, దర్యాప్తును నిలిపివేయడానికి నిరాకరిస్తూ, పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు.

వచ్చిందే సగం 'బ్లాక్'తో ఆగం!

▶ మొదటి పేజీ తరువాయి

వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

నిషేధిత విత్తనాలు అంటగడుతూ..

కొందరు వ్యాపారులు, దళారులు నిషేధిత బీటీ–3 విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. బీటీ–2 కంటే తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటాయని.. కలుపును తట్టుకుంటాయని చెప్తున్నారు. పత్తి చేన్లలో కలుపు నివారణ కోసం కూలీలు సకాలంలో దొరక్క ఇబ్బందిపడుతున్న రైతులు ఈ ప్రచారానికి ఆకర్షితులవుతున్నారు. ఇలా డిమాండ్ సృష్టిస్తున్న వ్యాపారులు బీటీ–2 విత్తనాల కంటే బీటీ–3 విత్తనాలను రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, జాల్నా ప్రాంతాలతోపాటు గుజరాత్‌లోని వివిధ పట్టణాల నుంచి ఈ బీటీ–3 విత్తనాలు రాష్ట్రంలోకి వస్తున్నాయి. నకిలీలు, నిషేధిత విత్తనాలను నియంత్రించడం, బ్లాక్ మార్కెటింగ్‌ను అడ్డుకోవడం వంటి చర్యలు చేపట్టాల్సిన అధికారులు.. కొందరు దళారులు, వ్యాపారులతో కుమ్మక్కై చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. తూతూమంత్రంగా దాడులు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

ఇప్పటివరకు సగం వరకు సరఫరా..

నైరుతి రుతుపవనాలతో కురిసే తొలకరి వానలతోనే రైతులు పత్తి విత్తనాలు చల్లుతారు. ఈసారి రాష్ట్రంలో 55 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేశారు. అందుకోసం 1.26 కోట్ల విత్తన ప్యాకెట్లు సిద్ధం చేయాలని నిర్ణయించారు. కానీ ఇప్పటివరకు 68.16 లక్షల ప్యాకెట్లు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయశాఖ వెల్లడించిన వివరాలే ఇవి. దీనిపై రైతులు, వ్యవసాయ నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ''ఇప్పటివరకు మొత్తం విత్తనాలను ఎందుకు జిల్లాలకు సరఫరా చేయలేదు? కొరతే లేదని చెప్తున్నప్పుడు రైతులు ఎందుకు క్యూలైన్లలో ఎందుకు ఉండాల్సి వస్తోంది? ఎందుకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారో అధికారులే చెప్పాలి. రైతులు కోరుకునే కంపెనీల విత్తనాలను అందుబాటులో ఉంచకపోవడమే ఇందుకు ప్రధాన కారణం..'' అని వారు పేర్కొంటున్నారు. మరోవైపు ఇతర కంపెనీల విత్తనాలు కూడా కొనుగోలు చేసుకోవాలని అధికారులు చెప్తున్నారని.. మరి వారు దిగుబడికి గ్యారంటీ ఇవ్వగలరా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఇంకా సేకరణలోనే యంత్రాంగం..

రాష్ట్రంలో నిర్ణయించుకున్న లక్ష్యంలో సగం వరకే పత్తి విత్తనాలు సరఫరా అయ్యాయి. సీజన్ కూడా మొదలైపోతోంది. కానీ అధికారులు ఇంకా విత్తనాలను సేకరించే పనిలోనే ఉన్నారు. కంపెనీలతో ఇప్పటికీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఒక రకం బ్రాండ్ విత్తనాలకు డిమాండ్ ఉందని తెలిసి.. ఇప్పుడు తమిళనాడు నుంచి ఆ రకం విత్తనాలు తెప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు.

ఉన్నతాధికారుల సమన్వయ లోపంతో

వ్యవసాయ శాఖలోని ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోందని.. దిగువ స్థాయికి ఆదేశాలివ్వడంలో సరిగా వ్యవహరించలేక పోతున్నారని విమర్శలు వస్తున్నాయి. ఎరువుల దుకాణాలను రోజూ పరిశీలించాలని ఏఈవోను ఒక ఉన్నతాధికారి ఆదేశిస్తుంటే.. మరో ఉన్నతాధికారి మాత్రం అలా చేయొద్దని, తాను చెప్పినట్టుగా రైతుల వద్దకు వెళ్లి వారి కి సలహాలు సూచనలు ఇవ్వాలని చెప్తున్నట్టు తెలిసింది. ఇలాగైతే ఏఈవోలు ఎవరి మాట వినాలి, ఏం చేయాలన్న ప్రశ్నలు వస్తున్నాయి. పత్తి విత్తనాల సరఫరా విషయంలోనూ ఈ ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య సమన్వయం లేక పోవడం సమస్యగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



వరంగల్ స్టేషన్ రోడ్డులోని విత్తన షాపుల్లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

యూఎస్ 7067 రకం లేవంటున్నారు

యూఎస్ 7067 రకం పత్తి విత్తనాలు వేస్తే దిగుబడి బాగా వస్తుంది. ఈ కాయల నుంచి పత్తి తీయడం సులువు. గులాబీ రంగు పురుగు ఉధృతి ఉండదు. ఎకరాకు కనీసం 10 క్వింటాళ్లపైన దిగుబడి వస్తుంది. తక్కువ సమయంలో దిగుబడి వస్తుంది. దీన్ని తీసేశాక రెండో పంటగా మొక్కజొన్న వేసుకోవచ్చు. కానీ మార్కెట్లో ఈ రకం విత్తనాలు లేవంటున్నారు.

– నునావత్ కిషోర్, రైతు, పీజీ తండా, దుగ్గొండి మండలం, వరంగల్ జిల్లా

పోయినేడు దిగుబడి బాగా వచ్చింది..

నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. గత ఏడాది రాశి 659 రకం పత్తి విత్తనాలు సాగు చేస్తే.. ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అందుకే ఆ రకం విత్తనాలు వచ్చే వరకు వేచి చూసిన. స్టేషన్‌ఘన్‌పూర్ ఎరువుల దుకాణంలో ఒక్కో ప్యాకెట్ రూ.864 చొప్పున 4 ప్యాకెట్లు కొన్నా. దిగుబడి ఎక్కువ రావడంతో పాటు చీడపీడల నుంచి తట్టుకునే శక్తి ఈ విత్తనాలకు ఉంది.

– కత్తుల కొమురయ్య, రైతు, ఇప్పగూడెం, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం, జనగాం జిల్లా

రాష్ట్రవ్యాప్తంగా ఇదీ పరిస్థితి..

- → ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏటా వానాకాలంలో 14 లక్షల ఎకరాల వరకు వివిధ పంటలు సాగు చేస్తారు. అందులో వరి తర్వాత పత్తిసాగు రెండో స్థానంలో ఉంటుంది. దీంతో వ్యాపారులు ఇక్కడ రైతులకు కాలం చెల్లిన విత్తనాలను అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. బీటీ–3 విత్తనాలను కూడా విక్రయిస్తున్నారు.
- → సంగారెడ్డి జిల్లాలో ఆద్య రకం పత్తి విత్తనాలకు అధిక డిమాండ్ ఉంది. రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని విత్తన డీలర్లు అందిన కాడికి దండుకుంటున్నారు. ఈ విత్తన ప్యాకెట్‌ను రూ.1,800 వరకు విక్రయిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో 3.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని.. ఇందుకోసం 7.20 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా వేశారు. ఈ నెల 29వ తేదీ వరకు అందుబాటులోకి వచ్చిన విత్తన ప్యాకెట్లు 3.76 లక్షలు మాత్రమే. తమకు అవసరమైన రకం లేకపోవడంతో రైతులు ఇతర విత్తనాలు కొనడం లేదు.
- → యాదాద్రి భువనగిరి జిల్లాలో చాలా చోట్ల బ్రాండెడ్ పత్తి విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలాయి. వ్యాపారులు లైసెన్స్ లేకుండా లూజ్ విత్తనాలు అమ్ముతున్నారు. ఈ జిల్లాలో 1.35 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని.. 2.70 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు 1.45 లక్షల ప్యాకెట్లు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. అందులోనూ తమకు అవసరమైన రకాలు, కంపెనీల విత్తనాలను అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.
- → జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1.10లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని, 2.20 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా. కానీ ఇప్పటివరకు 1.20 లక్షల ప్యాకెట్లు మాత్రమే జిల్లాకు వచ్చాయి.
- → నల్లగొండ జిల్లాలో 5.40 లక్షల ఎకరాలకుపైగా పత్తి సాగవుతుందని అంచనా వేశారు. 15 లక్షలకుపైగా విత్తన ప్యాకెట్లు అవసరమంటూ వ్యాపారులు ఇండెంట్లు పెట్టారు. అందులో ఇప్పటివరకు 4 లక్షల ప్యాకెట్లు విత్తన దుకాణాల్లో అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. అందులో రైతులు కోరుకునే రకాలు, బ్రాండ్లు మాత్రం కనిపించడం లేదు.
- → ఖమ్మం జిల్లాలో 2 లక్షలకుపైగా ఎకరాల్లో పత్తి సాగుకు వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించింది. 4.50 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా వేసింది. అయితే రైతులు కోరుకుంటున్న విత్తనాలు మాత్రం కనిపించడం లేదు. ఇక్కడి రైతులు యూఎస్ 7067 రకం విత్తనాలు కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ రకం విత్తనాలు గత ఏడాది మంచి దిగుబడులు ఇచ్చాయని అంటున్నారు. కానీ దుకాణాల్లో ఆ రకం విత్తనాలు దొరకడం లేదు.
- → ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈసారి 5.67 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయాధికారుల అంచనా. ఇందుకోసం 11.34 లక్షలకుపైగా విత్తన ప్యాకెట్లు కావాలి. ఇప్పటివరకు డీలర్లు, వ్యాపారులకు చేరినది 8 లక్షల ప్యాకెట్లు మాత్రమే. చాలా చోట్ల రైతులకు అవసరమున్న రకాల విత్తనాలు అందుబాటులో ఉండటం లేదు. ఉన్నా ఒక్కో ప్యాకెట్‌ను రూ.864కు బదులుగా రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు.
- → ఆదిలాబాద్ జిల్లాలో 4.16 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని, 10 లక్షలకుపైగా విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా వేశారు. కానీ సగం మేర కూడా విత్తనాలు రాని పరిస్థితి.

లోగుట్టు... ల్యాప్‌టాప్‌లో!

- ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు కస్టడీలో కీలకాంశాలు వెలుగులోకి
- పెద్ద మొత్తంలో ఆర్థిక లావాదేవీలు.. బినామీ పేర్లతో ఆస్తులు
- ముగిసిన 3 రోజుల ఏసీబీ కస్టడీ

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు ఏసీబీ కస్టడీలో మరికొన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆర్థిక లావాదేవీలు, అవినీతి సొమ్ము వివరాలు, బినామీలుగా ఎవరెవరినిపెట్టి ఆస్తులు కూడబెట్టారన్న సమస్త వివరాలు అతడి ల్యాప్‌టాప్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. కోర్టు అనుమతితో ఉమామహేశ్వర్‌రావును బుధవారం నుంచి మూడు రోజులపాటు ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకుని ప్రశ్నించారు. బుధ, గురువారాల్లో ఆయనకు సంబంధించిన వ్యక్తిగత, వృత్తిగత వివరాలు సేకరించిన ఏసీబీ అధికారులు శుక్రవారం మరింత కీలక సమాచారం రాబట్టినట్టు తెలిసింది. ఈ వివరాలన్నీ ఏసీబీ అధికారులు ఉమామహేశ్వర్‌రావు స్టేట్‌మెంట్‌లో రికార్డు చేశారు. అదేవిధంగా ఏసీబీ అధికారులు తెలంగాణ, ఏపీలో కలిపి 11 ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో సేకరించిన సమాచారం, పలు కీలక పత్రాలను సైతం ఆయన ముందుంచి ప్రశ్నించినట్టు సమాచారం.

ఆ అధికారులను కూడా విచారణకు?: సోదాల సమయంలో స్వాధీనం చేసుకున్న ల్యాండ్ డాక్యుమెంట్లు, ల్యాప్‌టాప్, డైరీలను విశ్లేషిస్తున్న ఏసీబీ అధికారులు ఆయన దగ్గర మరికొందరు డీసీపీ స్థాయి అధికారులకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా లభించడంపైనా ఆరా తీస్తున్నారు. ఈ అధికారులతో ఉమామహేశ్వర్‌రావుకు ఉన్న సంబంధాలపైనా కీలక సమాచారాన్ని ఏసీబీ సేకరించినట్టు తెలిసింది. లభించిన ఆధారాలు, ఉమామహేశ్వర్‌రావు స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ కేసులో మరికొందరి పాత్ర బయటికి వచ్చే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. సదరు అధికారులను సైతం ఏసీబీ అధికారులు విచారించే అవకాశం ఉంది.

నకిలీ విత్తనాలు.. దాడులు..

పలు చోట్ల తనిఖీలు చేపట్టిన అధికారులు.. ఒక ఏఈఓ సస్పెన్షన్.. ఏఓ బదిలీ

సాక్షి నెట్‌వర్క్: పత్తి విత్తనాల కోసం రైతుల ఆందోళనల నేపథ్యంలో.. రాష్ట్రంలోని పలుచోట్ల అధికార యంత్రాంగం దాడులు, తనిఖీలు చేపట్టింది. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో ఓ దుకాణంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. లూజ్ విత్తనాలను వివిధ కంపెనీల పేరిట ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. దాని యజమాని రామకృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ విత్తనాల గోదాంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

- → ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు విత్తన గోదాముల్లో వేర్వేరుగా తనిఖీలు చేశారు. మరోవైపు ఇక్కడి తాంసి బస్టాండ్ సమీపంలోని నిఖిల్ ఫర్టిలైజర్ షాపులో స్టాక్ ఉన్నా డీలర్ నోస్టాక్ బోర్డు పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేయడంపై అధికారులు చర్యలు చేపట్టారు. నిఖిల్ ఫర్టిలైజర్ షాపు వద్ద ఇన్‌చార్జ్‌గా ఉన్న ఏఈఓ శివచరణ్‌ను సస్పెండ్ చేశారు. ఆదిలాబాద్ అర్బన్ ఏఓ భగత్ రమేశ్‌ను బదిలీ చేశారు. ఇక విత్తనాలు గోదాంలో అందుబాటులో ఉన్నా, డీలర్లకు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన రాశీ–659 డిస్ట్రిబ్యూటర్ వామన్‌రావుపై కేసు నమోదు చేశారు.
- → ఖమ్మంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను కలెక్టర్ గౌతమ్ శుక్రవారం తనిఖీ చేశా రు. ఆ సమయంలో దుకాణాల వద్దకు వచ్చిన రైతు లతో మాట్లాడారు. అన్ని రకాల పత్తి విత్తనాలు ఒకటేనని, ఏవైనా దిగుబడి బాగానే వస్తాయని చెప్పారు.
- → మరోవైపు జనుము, జీలుగ విత్తనాల కోసం కూడా రైతులు ఇబ్బందిపడుతున్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో జీలుగ విత్తనాల కోసం బారులుతీరారు.

ఇరిగేషన్ ఓ అండ్ ఎం ఈఎన్‌సీగా నాగేంద్రరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం), క్వాలిటీ కంట్రోల్(క్యూసీ) విభాగం ఇంజనీర్ ఇన్ చీఫ్ బి.నాగేంద్రరావు శుక్రవారం పదవీ విరమణ చేయాల్సి ఉండగా, ఆయన్ను మరో ఆరు నెలల కాలానికి అదే పదవిలో పునర్నియమిస్తూ ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 1 నుంచి నవంబర్ 30 వరకు ఆయన కాంట్రాక్టు ప్రాతిపదికన ఈ పోస్టులో కొనసాగుతారని పేర్కొన్నారు. ఒకవేళ ఆయన సేవల అవసరాలు అంతకుముందే ముగిస్తే వెంటనే పదవీ కాలం కూడా ముగుస్తుందని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. విజిలెన్స్ విభాగంలోని కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్‌లో చీఫ్ ఎగ్జామినర్‌గా ఉన్న అంజద్ హుస్సేన్‌ను ఓ అండ్ ఎం విభాగం ఇన్‌చార్జి ఈఎన్‌సీగా నియమించాలని ప్రతిపాదనలు వచ్చినా.. ప్రభుత్వం మాత్రం నాగేంద్రరావును కొనసాగించడం గమనార్హం. నాగేంద్రరావు ఆధ్వర్యంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలకు అత్యవసర మరమ్మతులు కొనసాగుతున్న నేపథ్యంలో ఆ పనులు పూర్తయ్యే వరకు ఆయన సేవలను పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

రిటైర్డ్ ఇంజనీర్లను పునర్నియమించొద్దు

నీటిపారుదల శాఖలో రిటైర్డ్ ఇంజనీర్లను అవే పోస్టుల్లో పునర్నియామకం జరపరాదని, వారి సేవలు అత్యవసరమైతే సలహాదారులుగా నియమించుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్, తెలంగాణ గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్ అసోసియేషన్, తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసోసియేషన్ శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశాయి. రిటైర్డ్ ఇంజనీర్లను రెగ్యులర్ పోస్టుల్లో పునర్నియామకం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించాయి.

చోరీకి యత్నించి.. గ్రామస్తుల చేతిలో హతం

వర్ని(బాన్సువాడ): నిజామాబాద్ జిల్లా వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో దొంగతనానికి ప్రయత్నించిన వ్యక్తిని గ్రామస్తులు పట్టుకుని దేహ శుద్ధి చేయడంతో తీవ్ర గాయాలతో మరణించా డు. తగి లేపల్లి గ్రామానికి చెందిన మైదం నారాయణ శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో అదే గ్రామంలోని ఓ ఇంట్లో దొంగతనానికి యత్నించాడు. దీనిని గమనించిన ఆ ఇంటి వారు కాలనీవాసులకు సమాచారం ఇచ్చారు. వారంతా నారాయణను చుట్టుముట్టి తీవ్రంగా కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న నారాయణ కుటుంబ సభ్యులు అతన్ని ఇంటికి తీసుకెళ్లే సరికే.. చనిపోయి ఉన్నాడు. రుద్రూర్ సీఐ జెయేశ్‌రెడ్డి, వర్ని ఎస్‌ఐ కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఏసీపీ ఆఫీసు ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- ప్రైవేటు ఆసుపత్రికి తరలించిన పోలీసులు... పోలీసుల వేధింపులే కారణమని ఆరోపణ



మోహన్

మంచిర్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయం ఎదుట మోహన్ అనే వ్యక్తి కత్తి తో గొంతు కోసుకుని శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి కథనం ప్రకారం.. గర్మిళ్ల శివా రు హమాలీవాడ పోచ మ్మ చెరువు సమీపంలోని 370 సర్వే నంబర్‌లోని భూమి విషయమై తూము మోహన్, దాసరి నరేశ్ మధ్య వివాదం నడుస్తోంది నరేశ్ ఫిర్యాదు మేరకు మోహన్‌పై ఈ నెల 10న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ కేసు విషయమై తరచూ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వేధిస్తున్నారని, కానిస్టేబుల్ రాచర్ల శ్రీనివాస్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని మోహన్ ఆరోపించారు. శుక్రవారం మరోసారి స్టేషన్‌కు పిలిపించడంతో మనస్తాపం చెంది కత్తితో గొంతు కోసుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, అతన్ని పోలీసులు వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించారు. ప్రస్తుతానికి మోహన్ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ విషయమై ఏసీపీ ప్రకాశ్‌ను సంప్రదించగా.. మోహన్‌పై అట్రాసిటీ కేసు ఉండడంతో విచారణ కోసం పిలిపించామని, ఈ క్రమంలో బయటకు వెళ్లిన అతను కత్తితో ఆత్మహత్యాయత్నం చేశాడని తెలిపారు.

'లోన్ యాప్' వేధింపులకు మరొకరి బలి

నిజాంపేట్: లోన్ యాప్ వేధింపులు మరో ప్రాణాన్ని బలిగొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి కౌసల్య కాలనీలో నివాసం ఉంటున్న వీరవర్ధన్ (33) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇతని భార్య విమల 6 నెలల క్రితం డెలివరీకి పుట్టింటికి వెళ్లగా బాబు పుట్టాడు. ఫ్లాట్‌లో వీరవర్ధన్ ఒక్కడే ఉంటున్నాడు. లోన్‌యాప్‌లో అప్పు తీసుకున్న వీరవర్ధన్ చెల్లించకపోవడంతో యాప్ నిర్వాహకులు ఫోన్లు చేస్తున్నారు. ఈ క్రమంలో వారి ఒత్తిడి తట్టుకోలేక ఫోన్ పోయిందని అతను ఇంట్లో వారికి చెప్పాడు. 2 రోజుల క్రితం అమీర్‌పేట్‌లో ఉంటున్న అతని పెద్దమ్మకు లోన్‌యాప్ నిర్వాహకులు కాల్ చేసి లోన్ విషయమై అడిగారు. కాగా వారు హిందీలో మాట్లాడటంతో భాష సరిగా అర్థం కాని ఆమె ఈ విషయమై వీరవర్ధన్‌ను అడిగితే మాట దాటవేశాడు. భార్య ఇంట్లో లేకపోవడంతో అప్పుడప్పుడు అమీన్‌పూర్‌లో ఉండే పిన్ని దగ్గరకు వెళ్లేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఫ్లాట్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాకుళంలో ఉండే తల్లిదండ్రులు ఇంట్లోని ల్యాండ్ ఫోన్‌కు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో కార్యాలయానికి కాల్ చేయగా రాలేదని సమాధానం చెప్పారు. దీంతో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌కు కాల్ చేయగా సెల్లార్ గుండా వెళ్లి చూడగా తలుపు తెరిచి ఉంది. లోనికి వెళ్లి చూడగా వీరవర్ధన్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

గొర్రెల స్కీం కుంభకోణంలో కీలక అరెస్టులు



రాంచందర్



కల్యాణ్

అప్పటి మంత్రి ఓఎస్డీ కల్యాణ్, పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ రాంచందర్‌లను కోర్టులో హాజరుపర్చిన ఏసీబీ అధికారులు..

రూ.2.10 కోట్ల నిధుల గోల్‌మాల్‌పై ఏసీబీ ఆరా

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకం కుంభకోణం కేసులో ఏసీబీ అధికారులు కీలక నిందితులను అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ మాజీ ఎండీ సబావత్ రాంచందర్, అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఓఎస్డీగా పనిచేసిన గుండమరాజు కల్యాణ్ కుమార్‌లను శుక్రవారం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. సబావత్ రాంచందర్‌ను ఏ–9గా, కల్యాణ్‌గా ఏ–10గా ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. నిందితులను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని ఆదేశాలు

నిందితులిద్దరూ నిబంధనలు తుంగలో తొక్కి, గొర్రెల సేకరణ ప్రక్రియ ప్రైవేటు వ్యక్తులు, బ్రోకర్లకు అప్పగిస్తూ అన్ని జిల్లాల పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్లు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గొర్రెల కొనుగోలు పేరిట ప్రభుత్వ సొమ్మును ప్రైవేట్ వ్యక్తులకు చేరేలా చేశారని ఏసీబీ అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు. గొర్రెల కొనుగోలుకు సంబంధించి ఏపీ రైతులకు ఇవ్వాల్సిన మొత్తం రూ.2.10 కోట్ల మేర నిధులు కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి దారి మళ్లించినట్టు ఏసీబీ అధికారులు ఇప్పటికే ఆధారాలు సేకరించారు. ఈ కుంభకోణంతో సంబంధమున్నట్టు లభించిన ఆధారాల మేరకు ఏసీబీ అధికారులు ఫిబ్రవరిలో కామారెడ్డి జిల్లా ఏరియా వెటర్నరీ హాస్పిటల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రవి, మేడ్చల్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవసాయి, రంగారెడ్డి జిల్లా గ్రౌండ్‌వాటర్ ఆఫీసర్ పసుల రఘుపతిరెడ్డి, నల్లగొండ వయోజనవిద్య డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేష్‌లను అరెస్ట్ చేశారు. ఆ తర్వాత మార్చిలో పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ అంజిలప్ప, అసిస్టెంట్ డైరెక్టర్ పి కృష్ణయ్యలను అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న కాంట్రాక్టర్లు మొయినుద్దీన్, అతడి కుమారుడు ఇక్రమ్ పరారీలో ఉన్నారు.

గొర్రెల కుంభకోణం అసలు కథ ఇదీ

బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం పెద్ద ఎత్తున చేపట్టింది. అయితే ఈ పథకం అమలులో నిధులు దారి మళ్లించడంపై అందిన ఫిర్యాదులతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏసీబీని రంగంలోకి దింపింది. వాస్తవానికి ఏపీ రైతులు ఫిర్యాదుతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డిజిల్లా మంచాల ప్రాంత లబ్ధిదారు లకు గొర్రెలు పంపిణీ చేసేందుకు ఏపీలోని పల్నాడు జిల్లా అంగలూరుకు చెందిన 18 మంది గొర్రెల సరఫరాదారులను సంప్రదించారు. ఆ తర్వాత పశువైద్యశాఖ అధికారులు రవి, ఆదిత్యకేశవసాయితోపాటు కాంట్రాక్టర్లు మొయినుద్దీన్, ఇక్రమ్ కలిసి 133 మంది లబ్ధిదారులను తీసుకెళ్లి 133 యూనిట్లను ఒక్కో యూనిట్ రూ.1.58 లక్షల చొప్పున కొనుగోలు చేశారు. అయితే ఇందుకు సంబంధించిన డబ్బులు గొర్రెలు విక్రయించిన రైతులకు ఇవ్వకుండా ఇక్కడే అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై కుంభకోణానికి తెరలేపారు. మొత్తం రూ. 2.10 కోట్లను గొర్రెల సరఫరా రైతుల పేరిట కాకుండా బినామీల పేరిట చెక్కులు మంజూరు చేశారు. అనంతరం ఆ సొమ్మును కొట్టేశారు. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో కోడ్ కారణంగానే తమకు డబ్బులు రావడం లేదని ఏపీ గొర్రెల సరఫరా రైతులు అనుకున్నారు. కోడ్ ముగిసిన తర్వాత కూడా డబ్బులు రాకపోవడంతో మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధక శాఖ ఆఫీసులో ఆరా తీశారు. తమకు రావాల్సిన రూ.2.10 కోట్లు ఏపీలోని వివిధ జిల్లాల్లోని ఇతర అకౌంట్స్‌లో డిపాజిట్ అయినట్టు గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారంపై డిసెంబర్‌లో గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకుంది. కేసును ఏసీబీకి బదిలీ చేసింది. దీంతో ఏసీబీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆధారాలు సేకరిస్తూ, వరుస అరెస్టులు చేస్తూ వస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు.

సహాయ నటిపై లైంగికదాడి

నటుడి కారు డ్రైవర్ సహా ఆరుగురి అరెస్ట్

అన్నానగర్ (చెన్నై): చెన్నైలోని వలసరవాక్కంలో ఇంట్లోకి చొరబడి ఓ సహాయ నటిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ నటుడి కారు డ్రైవర్ సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌కు చెందిన 30 ఏళ్ల యువతి టీవీ సీరియల్స్‌లో సహాయ నటిగా నటిస్తోంది. భర్తతో మనస్పర్థలు రావడంతో ఆమె చెన్నై వలసరవాక్కంలోని బంధువుల ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఆమె బంధువు పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. దీంతో సహాయనటి ఇంట్లో ఒంటరిగా ఉంది. గురువారం రాత్రి తన ఇంట్లోకి ఆరుగురు వ్యక్తులు ప్రవేశించారు. వీరిలో మురుగేశన్ అనే వ్యక్తి ఇద్దరిని ఇంటి బయట కాపలా పెట్టి ఇంట్లోకి చొరబడి సహాయ నటిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో సహాయ నటి స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మురుగేషన్, కల్యాణకుమార్, అరుణ్‌పాండి, మారియప్ప, పెరియనంబిరాజ్, ముప్పిడాదిని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

వ్యవ'సాయం' పెరిగింది.. ఖర్చులూ పెరిగాయి

'సాక్షి'ఇంటర్వ్యూలో ప్రముఖ ఆర్థిక, సామాజిక విశ్లేషకుడు డాక్టర్ అందె సత్యం



సాక్షి, హైదరాబాద్: గత పదేళ్ల కాలంలో తెలంగాణలో వ్యవ'సాయం'పెరిగిందని, దీనికి సమాంతరంగా ఆధునిక భూస్వామ్యం కూడా శరవేగంగా పెరుగుతోందని అంటున్నారు ప్రముఖ ఆర్థిక, సామాజిక విశ్లేషకుడు డాక్టర్ అందె సత్యం. కార్పొరేట్ వర్గాలు, ధనిక రైతులు, బడా అధికారుల చేతుల్లో భూమి కేంద్రీకృతమవుతుంటే 80 శాతం ఉండే సన్న, చిన్నకారు, ఉపాంత రైతుల పరిస్థితి కూలీల స్థాయిలోనే ఉండిపోయిందన్నారు. పాలకులు, కార్పొరేట్ వర్గాల ఐక్యతకు తెలంగాణ రాష్ట్రం నిదర్శనంగా నిలుస్తోందని, ఈ వర్గాల ఐకమత్యం కారణంగా రాజకీయ అవినీతి పెచ్చరిల్లుతోందని చెప్పారు. ఈ రెండు అంశాలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం జరిగిన దుష్పరిణామాలని, వీటికి వీలున్నంత త్వరగా చెక్ పెట్టకపోతే భవిష్యత్ తెలంగాణ మనుగడ ఊహించలేమని ఆయన అభిప్రాయపడ్డారు. నిపుణులను తయారు చేసే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని చెప్పిన అందె సత్యం గుజరాత్, పంజాబ్, హరియాణ, కేరళ రాష్ట్రాల అనుభవాలకు అనుగుణంగా తెలంగాణ ముందుకెళ్లాల్సి ఉంటుందన్నారు. పదేళ్ల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఆర్థిక, సామాజిక పరిణామాలపై ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన ఏం చెప్పారంటే... !

భూములు పంచాలి... ఉద్యోగాలివ్వాలి

పదేళ్లలో వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయి. ఉమ్మడి రాష్ట్రంలో 14 మిలియన్ టన్నులుగా ఉన్న ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇప్పుడు తెలంగాణలోనే 25 మిలియన్ టన్నులు దాటింది. సాగునీటి ప్రాజెక్టుల వినియోగం, వర్షాలు, కాళేశ్వరం లిఫ్టు కారణంగా పెరిగిన భూగర్భజలాలు, మిషన్‌కాకతీయ లాంటి కార్యక్రమాలు ఇందుకు దోహదపడ్డాయి. సుస్థిర పంటల సాగు వైపునకు రైతులను మళ్లించాల్సి ఉంది. పంటల మార్పిడి విషయంలో దశాబ్దకాలంగా ముందడుగు పడలేదు. వ్యవసాయ ఉత్పత్తులే కాదు సాగు ఖర్చు కూడా అంతే పెరిగింది. పెరిగిన సంపద క్షేత్రస్థాయికి వెళ్లడం లేదు. సంక్షేమ కార్యక్రమాలు లబ్ధిదారులను తయారు చేస్తున్నాయి తప్ప వారిని ఆర్థిక వ్యవస్థలో పాత్రధారులను తయారు చేయడం లేదు. ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో పేదల పాత్ర ఉన్నప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇందుకోసం భూపంపిణీ, ఉద్యోగాల కల్పన జరగాలి.

మెట్రోపాలిటన్‌లో మనమే ముందున్నాం

గత పదేళ్లలో హైదరాబాద్‌కు అంతర్జాతీయ లక్షణాలు బాగా పెరిగాయి. రియల్ ఎస్టేట్, ఇతర అభివృద్ధి రంగాలన్నీ సానుకూల దిశలోనే ప్రభావితమయ్యాయి. ఐటీ పరిశ్రమ కారణంగా రాష్ట్ర ఆదాయం పెరగడమే కాదు ఆధునికత సంతరించుకుంది. ఉపాధి పెరిగింది. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరపతి కూడా పెరిగింది. సంఘటిత ఉపాధి కల్పనలో ఐటీ పాత్ర అమోఘం. నిర్మాణరంగంలో దేశంలోని ఇతర మెట్రోపాలిటన్ నగరాలతో పోలిస్తే మనమే ముందున్నాం. విద్యాసంస్థల సంఖ్య పెరగడం, నైపుణ్యాల అభివృద్ధి, విద్యార్థుల ఆసక్తి, తల్లిదండ్రుల ఆపేక్ష పెరగడంతో నిపుణులను తయారు చేసే కేంద్రంగా హైదరాబాద్ మారింది. విద్యుచ్ఛక్తి సామర్థ్యం పెరిగిన ఫలితాలు మరో ఏడాదిలో అందుతాయి. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు చోదకశక్తిగా మారనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రోడ్ల లాంటి మౌలిక సౌకర్యాల కల్పన జరిగింది. శాంతిభద్రతలు గత పదేళ్లుగా బాగున్నాయి.

మూలధన ఖర్చు పెరగాలి

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య బాగా ఉంది. ఈ సమస్య పరిష్కారానికి చైనా ఒక ఉదాహరణ. పారిశ్రామిక రంగ అభివృద్ధి జరిగితేనే సంఘటిత ఉద్యోగాలు పెరుగుతాయి. తయారీ రంగానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేసుకోవాలి. ఏటా రూ. 2–3లక్షల కోట్ల ప్రతిపాదించి ఖర్చు చేస్తున్నా, మూలధన వ్యయం (ఆస్తుల కల్పనకు ఖర్చు) రూ.20–30వేల కోట్ల మధ్యనే ఉంటోంది. దీర్ఘకాలిక అభివృద్ధి నెమ్మదించడానికి ఈ ఖర్చు కారణమవుతుంది. విద్య కార్పొరేటీకరణ రోజురోజుకూ పెరిగిపోతోంది. వైద్య రంగం కూడా శరవేగంగా కార్పొరేట్ బాట పడుతోంది. నికర అప్పులతో పాటు పూచీకత్తులు కలిపి తెలంగాణ జీడీపీ, అప్పుల నిష్పత్తి 30 శాతం దాటుతోంది. రానున్న కాలంలో బడ్జెట్‌లో 20 శాతం అప్పులు, వడ్డీల చెల్లింపులకే కేటాయించాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ మేరకు పెట్టుబడుల కల్పన జరిగిందా లేదా అన్నది ప్రశ్నార్థకం. అలాగే అవినీతిని అడ్డుకోవడం రాష్ట్ర ప్రగతికి ఇతోధికంగా తోడ్పడుతుంది.

భవిష్యత్ తెలంగాణకు బాటలు వేయాలి

దేశంలోని వివిధ రాష్ట్రాల అనుభవం మన ముందుంది. గుజరాత్ స్వదేశీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తూ అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉంది. పంజాబ్, హరియాణలలో 85 శాతం భూమికి నీటిపారుదల సౌకర్యం ఉంది. పేద రాష్ట్రమైనా కేరళ మానవ వనరుల అభివృద్ధి ద్వారా పురోగమనంలో పయనిస్తోంది. ఈ మూడు రాష్ట్రాల అనుభవాలకు మన స్థానికతను జోడించుకొని అభివృద్ధి చెందాలి. పరిశ్రమలను ఆకర్షించడంలో తమిళనాడు, మహారాష్ట్రలు కూడా విజయవంతమయ్యాయి. ఈ దిశగా పాలకులు ఆలోచించి భవిష్యత్ తెలంగాణకు బాటలు వేయాలి. 'అని ఆయన వెల్లడించారు.

10 వసంతాల తెలంగాణ


2 కోట్ల ఎకరాలకు సాగు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కనిపించిన అతి పెద్ద మార్పు భారీగా ధాన్యం ఉత్పత్తి. 2014లో తెలంగాణలో 99.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తికాగా.. పదేళ్ల తర్వాత అది 2.48 కోట్ల టన్నులకు చేరింది రాష్ట్రంలో మొత్తం సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుంచి.. 2022–23 నాటికి 2.38 కోట్ల ఎకరాలకు చేరింది. వరి సాగు విస్తీర్ణం 49.63 లక్షల ఎకరాల నుంచి 97.97 లక్షల ఎకరాలకు పెరిగింది. గతంలో నిర్మించిన ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ వంటి పథకాలు, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా దాదాపు 15లక్షల ఎకరాల్లో పెరిగిన భూగర్భజలాలు వంటివి ఇందుకు దోహదపడ్డాయని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. దేశంలో తెలంగాణ మార్క్‌ను చూపిన రైతుబంధు పథకం.. రైతులు పంటలు వేసేందుకు పెట్టుబడి సాయంగా ఇతోధికంగా దోహదపడుతోంది. ఇప్పటివరకు ఎకరాకు ఏటా రూ.10 వేలు ఇస్తుండగా.. కొత్త ప్రభుత్వం దాన్ని రూ.15 వేలకు పెంచుతామని ప్రకటించింది. ఇక వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బీమా, రైతు రుణ మాఫీ, రైతు వేదికలు, సమీకృత మార్కెట్ల నిర్మాణం, గోదాముల సామర్థ్యం పెంపు, ధాన్యం సేకరణ వంటివి కూడా వ్యవసాయానికి అండగా నిలిచాయి. తెలంగాణ ఏర్పాటయ్యాక చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన, భూముల రిజిస్ట్రేషన్లలో తెచ్చిన మార్పులు, భూరికార్డుల నిర్వహణ కోసం అమల్లోకి తెచ్చిన ధరణి పోర్టల్ పలు వివాదాలకు కారణమైనా.. వ్యవసాయ, రెవెన్యూ వర్గాలను అనుసంధానం చేసే దిశలో సాగాయని నిపుణులు అంటున్నారు.



కంటి వెలుగులు.. ఫ్రీ డయాలసిస్‌లు

తెలంగాణ ఏర్పాటయ్యాక వైద్య రంగం అభివృద్ధి వైపు పయనించింది. పల్లె దవాఖానాలు, పట్టణ దవాఖానాల ఏర్పాటుతో వైద్యం పేదల ముంగిటకు చేరింది. కంటి వెలుగు పథకం పేదల చూపునకు అండగా నిలిచింది. తెలంగాణ డయాగ్నస్టిక్స్ పేరుతో పేదలకు ఉచితంగా రక్త పరీక్షల కార్యక్రమం వివిధ వ్యాధుల బాధితులను గుర్తించింది. నిమ్స్ విస్తరణ, టిమ్స్ ఆస్పత్రుల్లో 4 వేల పడకలు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ దవాఖానాలో 2 వేల పడకలు, కొత్త ఏరియా, జిల్లా ఆస్పత్రుల ఏర్పాటు, విస్తరణ, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల ఆధునీకరణ వంటి కార్యక్రమాలు రాష్ట్ర వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పడ్డాయి. తెలంగాణ ఏర్పాటయ్యాక వచ్చిన విప్లవాత్మక మార్పుల్లో ఒకటి ఉచిత డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం మూడు డయాలసిస్ కేంద్రాలుండగా.. ఇప్పుడు వాటి సంఖ్య 102కు చేరింది. ఇక పెద్ద సంఖ్యలో ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటు కూడా గత పదేళ్లలో అభివృద్ధికి సూచిక. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఐదే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉండగా.. ఇప్పుడు తెలంగాణలోని 33 జిల్లాల్లో కలిపి 34 వైద్య కళాశాలలు ఏర్పాటయ్యాయి. 2014కు ముందు రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 2,850 ఎంబీబీఎస్ సీట్లు ఉంటే.. ఇప్పుడు 8,515 సీట్లు అందుబాటులోకి వచ్చాయి.



అభివృద్ధి.. అప్పులు.. ఆరోపణలు

పయనం పదేళ్లు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కల నెరవేరి దశాబ్ద కాలం గడిచింది. అరవై ఏళ్ల పట్టుదలకు, పోరాటాలకు ప్రతిరూపంగా.. ముక్కోటి మంది మనోభావాలకు నిలువుటద్దంగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం.. ఈ పదేళ్లలో బుడిబుడి అడుగులనుంచి సాధికారత వైపు పయనించింది. బాలారిష్టాలను దాటుకుని ప్రగతి నమూనాను ఆవిష్కరించే దిశగా ముందడుగు వేసింది. అనతి కాలంలోనే అగ్రరాష్ట్రాలతో పోటీపడే స్థాయికి ఎదిగింది. అప్పులు పెరుగుతున్నాయనే ఆందోళన ఉన్నా.. కొన్ని అంశాల్లో వివాదాలు, ఆరోపణలు ఉన్నా.. ప్రగతిపథంలో దూసుకెళ్లింది. తెలంగాణ రాష్ట్రానికి పదేళ్లు నిండుతున్న నేపథ్యంలో.. ఇన్నేళ్లలో మారిన ముఖచిత్రం, కీలక రంగాల్లో జరిగిన పరిణామాలపై ప్రత్యేక కథనం..

- సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

'ఆసరా'కు యత్నాలు

తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచీ ఆపన్నులకు మరింత 'ఆసరా' అందుతోంది. సంక్షేమ కార్యక్రమాల అమలు పెరిగింది. దళితబంధు, బీసీ బంధు వంటి పథకాలు పెద్దగా విజయవంతం కాకపోయినా.. మిగతా ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా తెలంగాణ ఖజానా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తోంది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు.. ఇలా అవసరమున్న వారందరికీ ప్రతి నెలా ఠంచన్‌గా పింఛన్ అందుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 12 వర్గాలకు ఆసరా పథకం కింద పింఛన్లు అందుతున్నాయి. ఇవి వారి ఆర్థిక అవసరాలకే కాకుండా సామాజిక భద్రతకు ఆలంబనగా నిలుస్తున్నాయి. ఆసరా పింఛన్ల కోసం ఏటా తెలంగాణ ఖజానా నుంచి దాదాపు రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతున్నాయి. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో పేద వర్గాలకు చెందిన ఆడపిల్లల వివాహాలకు ఇప్పటివరకు రూ.12వేల కోట్ల వరకు అందజేశారు. కులాంతర వివాహాలకు ప్రోత్సాహకాలు, అంబేడ్కర్ భవనాలు, హాస్టళ్లు, గురుకులాలు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రాయితీలు, మద్యం దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లు, స్టడీ సర్కిళ్లు, రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ కళాశాలలు, అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు, అధికారికంగా ఆదివాసీల పండుగలు, గొల్లకుర్మలకు సబ్సిడీ గొర్రెలు, ఉచిత చేప పిల్లలు, రొయ్య పిల్లల పంపిణీ, నేతన్నలకు బీమా, సెలూన్లకు ఉచిత విద్యుత్, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలు, వేద పండితులకు గౌరవ భృతి, మౌజమ్, ఇమాంలకు గౌరవ వేతనం.. ఇలా అనేక పథకాలను అమలు చేస్తూ సంక్షేమ రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందింది.

వెలుగు.. చీకట్లు

తెలంగాణ ఏర్పడితే చీకట్లో బతకాల్సిందేనన్న కొందరు నేతల విమర్శలను తిప్పికొట్టేలా రాష్ట్ర విద్యుత్ రంగం ఎదిగింది. సంప్రదాయేతర విద్యుత్‌కు పెద్దపీట వేయడంతో వేల మెగావాట్ల సౌర విద్యుత్, పవన విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. అలాగే భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. అయితే తెలంగాణ విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి సాధించే దిశలో పొరపాట్లు జరిగాయన్న విమర్శలు, ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి. మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల విషయంలోనూ ఇలాంటి విమర్శలు వచ్చాయి. అదే సమయంలో అతి తక్కువ కాలంలో ప్రాజెక్టులు పూర్తయి నీటిని అందించారన్న అభిప్రాయాలూ ఉన్నాయి.







అత్యధిక గురుకులాలు

తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన మొదలైంది. దేశంలోనే అత్యధిక గురుకులాలున్న రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందింది. అన్ని రకాల విద్యా సంస్థలు, హాస్టళ్లకు సన్న బియ్యం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫారాలు అందుతున్నాయి. మన ఊరు– మన బడి వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ విద్య పట్ల ప్రజలను ఆకర్షితులను చేసే ప్రయత్నాలు జరిగాయి. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుదీకరణ, తాగునీరు, ఫర్నీచర్, కాంపౌండ్ వాల్స్, కిచెన్‌షెడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పన కోసం గత పదేళ్లలో మంచి ప్రయత్నమే జరిగింది.

'ఐటీ'లో దాటేసి..

తెలంగాణ పారిశ్రామిక ప్రగతిలో, అందులోనూ ప్రధానంగా ఐటీ రంగంలో వేగంగా అభివృద్ధి జరిగింది. దేశంలో సిలికాన్ వ్యాలీగా పేరున్న బెంగళూరును దాటేసి.. హైదరాబాద్ ఐటీ రంగం ముందుకు వెళ్తోంది. ఐటీ ఉద్యోగాల కల్పనలో బెంగళూరును దాటిపోయిందని రికార్డులు చెప్తున్నాయి. ఐటీ ఎగుమతులకు సంబంధించి 2030 సంవత్సరానికి పెట్టుకున్న లక్ష్యాలు కూడా ఇప్పటికే దాటిపోవడం గమనార్హం. ఎన్నో అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. మరిన్ని రానున్నాయి.

వివాదాల మధ్య తనదైన ముద్ర

కీలక రంగాల్లోనే కాదు.. మరెన్నో అంశాల్లో తెలంగాణ తనదైన ముద్రను వేసింది. 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహం, కొత్త సచివాలయ నిర్మాణం, గ్రామ పంచాయతీలుగా గిరిజన తండాలు, పోడు పట్టాల పంపిణీ, పామాయిల్ సాగుకు ప్రోత్సాహం, మిషన్ భగీరథ, సమీకృత జిల్లా కలెక్టరేట్లు, నూతన జోనల్ వ్యవస్థ, కమాండ్ కంట్రోల్ సెంటర్, భరోసా కేంద్రాలు, మోడల్ శ్మశాన వాటికలు, సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా, పల్లె–పట్టణ ప్రగతి, యాదాద్రి ఆలయ అభివృద్ధి, బతుకమ్మ చీరలు, మెట్రో రైలు, హరితహారం లాంటి కార్యక్రమాలతో వేగంగా ముందుకు కదిలింది. రాజకీయాలు, వివాదాలు, విమర్శలు, ఆరోపణలు ఎలా ఉన్నా.. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం, రాజకీయ పార్టీలు ముందుకెళ్లాలని... సామాజిక, ఆర్థిక అసమానతలు లేని 'సమున్నత తెలంగాణ' అతి త్వరలోనే ఆవిష్కృతం కావాలని ఆకాంక్షిద్దాం.

ఇక ఇక్కడ టీడీపీ నామ్‌కే వాస్తేనే!

- దుకాణం సర్దేయడమే బెటర్ అనే యోచనలో?
- తెలంగాణ టీడీపీ నేతలతో భేటీలో పార్టీ బలోపేతంపై నోరు మెదపని అధినేత
- ఏపీలో అధికారం పైనా క్లారిటీ ఇవ్వని చంద్రబాబు
- ఇక్కడి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నట్టుగానే!

సాక్షి, హైదరాబాద్: తన శిష్యుడు రేవంత్ రెడ్డి అధికారంలో ఉన్న తెలంగాణలో తెలుగుదేశం పార్టీని మూసేయడమే మంచిదనే అభిప్రాయంతో ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఉన్నట్లు టీటీడీపీ వర్గాలే భావిస్తున్నాయి. ఏపీలో అధికారంలోకి వస్తున్నాం అనే మాటలే తప్ప ... తెలంగాణలో పార్టీకి అధ్యక్షుడిని నియమిద్దామనే మాట కూడా బాబు నోట వెలువడలేదు. విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ వచ్చిన చంద్రబాబు శుక్రవారం సాయంత్రం తన నివాసంలో తెలంగాణ నాయకులతో సమావేశమయ్యారు. తెలంగాణలో శాసనసభ ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసే నిర్ణయాలు తీసుకుంటారని భావించి వివిధ జిల్లాల నుంచి వచ్చిన టీడీపీ అభిమానులకు నిరాశే ఎదురైంది. అసెంబ్లీ ఎన్నికల ముందు టీటీడీపీ అధ్యక్షుడిగా పార్టీకి రాజీనామా చేసిన కాసాని జ్ఞానేశ్వర్ బీఆర్‌ఎస్‌లో చేరగా, అప్పటి నుంచి తెలంగాణ పార్టీకి దిక్కూ దివాణా లేకుండా పోయింది.

పార్టీ రద్దయ్యే ప్రమాదం పొంచి ఉన్నా..

ఎన్నికల్లో కనీసం పోటీ చేయకపోవడంతో ప్రాంతీయ పార్టీగా తెలంగాణలో గుర్తింపు కూడా రద్దయ్యే పరిస్థితి నెలకొంది. శాసనసభ ఎన్నికలలో తన శిష్యుడు రేవంత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరించిన చంద్రబాబు పార్లమెంటు ఎన్నికల్లో కూడా అభ్యర్థులను పోటీకి పెట్టలేదు. ఇప్పుడు కూడా రేవంత్ సర్కార్‌కు అండగా నిలవాలనే విధంగానే పార్టీ యంత్రాంగానికి ఉద్బోధ చేశారు. జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల్లో పాల్గొనాలని, అదే రోజు పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగరేసి, ప్రభుత్వానికి మద్దతు తెలపాలని శుక్రవారం తనను కలిసిన పార్టీ వర్గాలకు హితబోధ చేశారు.

అక్కడ ఫలితాలొచ్చాక చూద్దాం..

ఏపీలో జరిగిన ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు వేచి చూడాలని చెప్పిన ఆయన అక్కడ తెలుగుదేశం అధికారంలోకి వస్తుందనే ధీమాను కూడా పార్టీ యంత్రాంగం ముందు వ్యక్తం చేయకపోవడం నాయకులను ఆశ్చర్యానికి గురి చేసింది. జూన్ 4 తరువాత వెలువడే ఏపీ ఎన్నికల ఫలితాల తరువాత తెలంగాణలో పార్టీ గురించి ఆలోచిస్తామని చంద్రబాబు పరోక్షంగా పార్టీ నాయకులకు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో ఫొటోలు దిగారు. సమావేశంలో పార్టీ నాయకులు బక్కని నర్సింములు, అర్వింద్ కుమార్ గౌడ్, కాట్రగడ్డ ప్రసూన, పి. సాయిబాబా, సాంబశివరావు, కోటేశ్వర్ రావు, నల్లెల్ల కిషోర్ పాల్గొన్నారు.

తుమ్మబాల సేవలు ఎనలేనివి

- సీఎం రేవంత్ సహా ప్రముఖుల నివాళులు
- హైదరాబాద్ ఆర్చి బిషప్ ఎమిరిటస్‌కు ఘనంగా తుది వీడ్కోలు
- సెయింట్ మేరీస్ బసిలికాలో అంత్యక్రియలు



తుమ్మబాలకు నివాళి అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి చిత్రంలో హైదరాబాద్ ఆర్చి బిషప్ పూల అంథోనీ

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): హైదరాబాద్ ఆర్చి బిషప్ ఎమిరిటస్, ది మోస్ట్ రెవరెండ్ ఫాదర్ తుమ్మ బాలకు పలువురు ప్రముఖులు, క్రైస్తవ పెద్దల సమక్షంలో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, మాజీ ఐపీఎస్ అధికారి ఏకే ఖాన్, పలువురు క్రైస్తవ ప్రముఖులు తుమ్మ బాల పార్థివ దేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. సమాజానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. గురువారం తుమ్మ బాల హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురంలోని దివ్యజ్యోతి నిలయంలో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. కాగా, గురువారం రాత్రి తుమ్మ బాల పార్థివ దేహాన్ని సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ బసిలికాకు తీసుకు వచ్చారు. రాత్రంతా క్యాథలిక్ ప్రముఖులు, క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం ఉదయం రెజిమెంటల్ బజార్‌లోని సెయింట్ మేరీస్ స్కూల్ ఆవరణకు ఆయన పార్థివ దేహాన్ని తీసుకుని వచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచారు. కార్డినల్, హైదరాబాద్ ఆర్చి బిషప్ పూల ఆంథోనీ ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. వివిధ డయాసిస్‌లకు చెందిన బిషప్‌లు పాల్గొని తుమ్మ బాలతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ప్రార్థనలు ముగిసిన అనంతరం సెయింట్ మేరీస్ హైస్కూలు నుంచి సెయింట్ మేరీస్ బసిలికా చర్చికి పార్థివ దేహాన్ని తరలించి చర్చి ఆవరణలో ఖననం చేశారు. తుమ్మ బాల వీలునామాలో తన మరణాంతరం ఈ చర్చి ఆవరణలోనే ఖననం చేయాలని కోరడంతో ఇక్కడే అంత్యక్రియలు పూర్తి చేశారు. వందలాది మంది క్రైస్తవులతో పాటు తుమ్మ బాల బంధువులు, ఆయా డయాసిస్‌లకు చెందిన బిషప్‌లు రెవరెండ్ దమన్ కుమార్, రెవరెండ్ ప్రకాశం, రెవరెండ్ బాల, డాక్టర్ జయరావులతో పాటు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరావు, నాయకులు రాయ్‌డిన్ రోచ్, జంపన ప్రతాప్, పలువురు ఫాదర్లు, మత పెద్దలు, నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

కేసీఆర్ సంతాపం

హైదరాబాద్ అర్చి బిషప్ ఎమిరిటస్ తుమ్మ బాల మరణం పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. తుమ్మ బాల క్రీస్తు సేవకోసం తన జీవితాన్ని అర్పించారన్నారు. తుమ్మబాల తాను విశ్వసించిన ఆధ్యాత్మిక సేవలో అత్యున్నత స్థాయికి ఎదిగారని కొనియా డారు. తుమ్మ బాల కుటుంబ సభ్యులు, బంధు మిత్రులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సమాజ నిర్మాణంలో ఎనలేని సేవలు: సీఎం రేవంత్‌రెడ్డి

ది మోస్ట్ రెవరెండ్ ఫాదర్ తుమ్మ బాలకు నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఆయన ఎనలేని సేవలు అందించారని కొనియా డారు. శాంతి, మత సామరస్యం, విద్యను ప్రజలకు అందించారని అన్నారు. వ్యక్తిగతంగా తనకు ఆయనతో ప్రత్యేక అనుబంధం ఉందని, 2019 ఎంపీ ఎన్నికలు, 2023 శాసన సభ ఎన్ని కల్లో మంచి మనసుతో ఆశీర్వదించారని అన్నా రు. ఆయన ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైందని, ఆయన స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. తుమ్మబాల మరణం క్రైస్తవ సమాజంతో పాటు అభిమానులకు తీరని దుఃఖాన్ని మిగిల్చిందని విచారం వ్యక్తం చేశారు.

కాలేజీలో చేరగానే మెసేజ్

- ఇంటర్‌బోర్డు సరికొత్త ప్రయోగం
- ప్రైవేట్ ఇంటర్ కాలేజీల ఆగడాలకు చెక్ పెట్టేందుకే..!



సాక్షి, హైదరాబాద్ : పైవేట్ కాలేజీల ఆగడాలకు చెక్ పెట్టేందుకు ఇంటర్‌బోర్డు ఈసారి సెరికొత్త విధానం అందుబాటులోకి తీసుకురానుంది. విద్యార్థి ఏ కాలేజీలో చేరినా, వెంటనే అతని వ్యక్తిగత మొబైల్‌కు మెసేజ్ వచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దీనిపై ఉన్నతాధికారులు చర్చించారు. ఇందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ రూపకల్పన చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే కాలేజీలో చేరిన వెంటనే వివరాలు హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. అప్పుడే ఈ మెసేజ్ పంపే వీలుంది. దీనికి ప్రైవేట్ కాలేజీలు ఇష్టపడే అవకాశం లేదు. కొన్ని నిబంధనలు అతిక్రమించే ప్రైవేట్ కాలేజీలు దీనివల్ల నష్టం జరుగుతుందని భావిస్తున్నాయి.

ప్రయోజనం ఏమిటి?

ఇప్పటి వరకూ ప్రైవేట్ కాలేజీలు విద్యార్థులను ఒక బ్రాంచ్‌లో చేర్చుకొని, వేరొక చోట కూర్చోబెట్టి బోధన చేస్తున్నాయి. ఉదాహరణకు మాదాపూర్ బ్రాంచ్‌లో ఓ విద్యార్థి అడ్మిషన్ తీసుకుంటాడు. కానీ అతని క్లాసులు వనస్థలిపురం బ్రాంచ్‌లో జరగుతాయి. పరీక్ష కేంద్రం సమీపంలో వేయాల్సి ఉంటుంది. కాబట్టి పరీక్షకు దరఖాస్తు చేసే ప్రాంతాన్నే కొలమానంగా తీసుకుంటారు. దీనివల్ల దూరంగా ఉండే ప్రాంతంలో పరీక్ష కేంద్రం ఉంటుంది. అదీగాక అంతర్గత పరీక్ష నిర్వహించి, బాగా మార్కులొచ్చే వారిని వేరు చేసి చదివిస్తున్నారు. మార్కులు తక్కువగా ఉండే వారి పట్ల ఏమాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదు. ఈ బ్రాంచ్‌ల్లో నైపుణ్యం లేని అధ్యాపకులను తక్కువ వేతనాలకు నియమిస్తున్నారు. ఈ విధానాన్ని అడ్డుకోవడానికి మెసేజ్ విధానం దోహదపడుతుందని ఓ అధికారి తెలిపారు. తనకు వచ్చే మెసేజ్‌లో అన్ని వివరాలు ఉంటాయి..కాబట్టి వెంటనే అదే కాలేజీలో చదివేలా తల్లిదండ్రులు జాగ్రత్త పడతారని, అన్ని కేటగిరీల విద్యార్థులు ఒకే క్యాంపస్‌లో చదువుకునే వీలుందని అధికారులు భావిస్తున్నారు.

సహకారం అందేనా?

మెసేజ్ విధానంపై కాలేజీ యాజమాన్యాలు పెదవి విరుస్తున్నాయి. అడ్మిషన్ల వివరాలు గడువులోగా ఇంటర్ బోర్డుకు పంపే వీలుందని, కానీ మెసేజ్ సిస్టం తీసుకొస్తే ప్రతీ రోజు వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని యాజమాన్యాలు అంటున్నాయి. దీనివల్ల క్లరికల్ పని ఎక్కువగా ఉంటుందని, తనిఖీల పేరుతో అధికారులు వేధించే వీలుందని చెబుతున్నారు. ఈ విధానాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది.

సాక్షి
కరీంనగర్
శనివారం । 1 । జూన్ । 2024



శుక్రవారం అర్ధరాత్రి మాల విరమణకు క్యూలైన్‌లో వేచిఉన్న వేలాదిమంది స్వాములు





కొండపైకి వస్తున్న అంజన్న స్వాములు



ఇరుముడితో స్వామివారిని దర్శించుకుంటూ..



కాలినడకన కొండగట్టు చేరుకుంటున్న స్వాములు

కొండంతా కాషాయం

- తరలివస్తున్న భక్తులు.. కిక్కిరిసిన కొండగట్టు
- కొనసాగుతున్న మాల విరమణ
- అర్ధరాత్రి తరువాత లక్షకు పైగా భక్తుల రాక
- శ్రీరామ నామస్మరణతో మార్మోగిన ఆలయం
- నేడు హనుమాన్ పెద్ద జయంతి


కొండగట్టు(చొప్పదండి): పవనసుత హనుమాన్‌కీ జై.. శ్రీరామ.. జయరామ.. జయజయ రామ.. రామలక్ష్మణ జానకీ.. జైబోలో హనుమాన్‌కీ.. నినాదాలతో కొండగట్టు క్షేత్రం మార్మోగింది. హనుమాన్ పెద్ద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం అర్ధరాత్రి వరకు దీక్షాపరులు తరలివస్తూనే ఉన్నారు. లక్షమంది వరకు కొండకు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. మాల విరమణ పూర్తిచేసుకున్న భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఎండ అధికంగా ఉండటంతో సాయంత్రం నుంచి అర్ధరాత్రి మాల విరమణ చేసుకున్నారు. శనివారం జయంతి సందర్భంగా వేకువజామున సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, పట్టువస్త్రాల అలంకరణ, తదితర పూజలు చేయనున్నారు. స్వామివారి దర్శనం, మాల విరమణకు సుమారు లక్షా 50వేల మంది భక్తులు వస్తారని, వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టామని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు.

కిక్కిరిసిన దారులు

హనుమాన్ దీక్షాపరులతో కొండగట్టు ఘాట్‌రోడ్, మెట్లదారి, బొజ్జ పోతన్న మార్గాలు కిక్కిరిసిపోయాయి. కాలినడకన గుట్టపైకి వచ్చే భక్తులకు లైటింగ్ ఏర్పాటు చేశారు. బొజ్జపోతన్న సమీపంలో వాహనాల పార్కింగ్ ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి వై జంక్షన్ వద్దకు వచ్చేందుకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. చలివేంద్రాలు, వైద్యశిబిరం అందుబాటులో ఉంచారు. రద్దీ దృష్ట్యా అదనపు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా 710 మంది పోలీసులతో బందోబస్తు చేపట్టినట్లు సీఐ రవి తెలిపారు. ఉత్సవాల పర్యవేక్షణ అధికారిగా వినోద్‌రెడ్డిని నియమించారు.



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ



మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు

న్యూస్‌రీల్

పొగాకుతో ప్రాణాపాయం



కరీంనగర్‌టౌన్: పొగాకు ఉత్పత్తులు వాడకంతో ప్రాణాపాయ వ్యాధుల బారినపడే ప్రమాదముందని డీఎంహెచ్‌వో సుజాత అన్నారు. ప్రపంచ పొగాకు ఉత్పత్తుల వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఎంహెచ్‌వో జెండాఊపి ప్రారంభించారు. మనదేశంలో పొగాకు ఉత్పత్తులు వాడడంతో రోజుకు 3500 మంది వరకు చనిపోతున్నారని, పొగాకు ఉత్పత్తులతో కేన్సర్, రక్తపోటు, ఊపిరితిత్తుల వ్యాధులు, కార్డియో మస్కులర్, డయాబెటిక్ వంటి రోగాల బారిన పడి 60శాతం మరణాలు సంభవిస్తున్నాయన్నారు. జిల్లాలో పొగాకుతో వచ్చే వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాలు 128 విద్యాసంస్థల్లో, 148 గ్రామాల్లో నిర్వహించడంతోపాటు, రైల్వేస్టేషన్ బస్టాండ్, పాఠశాలల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. టీబీ అధికారి కేవీ.రవీందర్‌రెడ్డి, పీవోఎం సనా జవేరియా, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ శిల్ప, ఎస్‌వో ఆర్.ఎల్. కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



కరీంనగర్ అర్బన్: విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాములు పదవీ విరమణ సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ బండారి నరేందర్, టీఎన్జీవోల జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, అసిస్టెంట్ డైరెక్టర్ నల్ల లింగారెడ్డి, గూడ ప్రభాకర్‌రెడ్డి, జగన్‌గౌడ్ పాల్గొన్నారు.

అత్యుత్తమ సేవలు గుర్తుండిపోతాయి



కరీంనగర్: అధికారులు విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందించినప్పుడే గుర్తింపు వస్తుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లాకేంద్రంలోని కృషి భవన్‌లో సోషల్‌వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ పుల్లా నేతానియేల్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 40 సంవత్సరాలపాటు నేతానియేల్ అత్యుత్తమ సేవలందించి ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. కరీంనగర్ జిల్లాలో పుట్టి ఇక్కడే ఉద్యోగ విరమణ చేయడం చాలా అరుదు అన్నారు. డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, సీపీవో కొమురయ్య, వయోజన విద్య డీడీ జయశంకర్ పాల్గొన్నారు.

రేపు జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 2న కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. అండర్-8,10,12,14,16,18, 20, బాలబాలికలకు, పురుషులకు, మహిళలకు రన్స్, జంప్స్, త్రోస్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో రాణించిన క్రీడాకారులను జూన్ 6,7 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆదివారం ఉదయం 6గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

క్వింటాల్ పత్తి రూ.7,350

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.7,350 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు 20వాహనాల్లో 367 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.7,300, కనిష్ట ధర రూ.7,000 పలికింది. గన్నీ సంచుల్లోని పత్తిని క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,000కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

ఉద్యమ పురిటిగడ్డ



- తెలంగాణ మలిదశ ఉద్యమానికి కేరాఫ్ కరీంనగర్
- 2001లో సింహగర్జనతో శంఖారావం
- ఆ వెంటనే స్థానిక సంస్థల్లో సత్తా చాటిన గులాబీ పార్టీ
- 2004లో ఏకంగా రాష్ట్ర సర్కారులో భాగస్వామ్యం
- సిద్దిపేట ఆమరణ దీక్షకు ఇక్కడ నుంచే ప్రయాణం
- ఉపఎన్నికల్లో అండ.. పార్లమెంట్‌లో బిల్లుపెట్టే వరకు కరీంనగర్ వాసులే కీలకం

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

తెలంగాణ రాష్ట్ర సాధన ఆరు దశాబ్దాల కల. దేశ స్వాతంత్య్రం అనంతరం పలుమార్లు పడిలేచిన కెరటంలా సాగిన ఉద్యమం 2009 తర్వాత ఉవ్వెత్తున ఎగిసింది. విద్యార్థులు, ఉద్యోగులు, కళాకారులు ఉద్యమాన్ని తీవ్రతరం చేయడంతో సామాన్యులు కూడా కలిసివచ్చారు. చేయి చేయి కలిపి శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో కేంద్రం పార్లమెంట్‌లో బిల్లు పెట్టేలా చేశారు. ఫలితంగా 2014లో దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. తొలిదశ ఉద్యమంలో వరంగల్, హైదరాబాద్ నగరాలు కీలకంగా వ్యవహరించాయి. అయితే, మలిదశ పోరులో మాత్రం కరీంనగర్ గుండెకాయగా నిలిచింది. ఉద్యమ పార్టీ బీఆర్‌ఎస్(అప్పటి టీఆర్‌ఎస్)ను స్థానిక సంస్థల్లో గెలిపించడంలో, అసెంబ్లీకి పంపడంలో పాత కరీంనగర్ ప్రజలు ఏనాడూ వెనకంజ వేయలేదు. ప్రజాపోరాటాలతో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం పదో ఆవిర్భావ వేడుకలను జరుపుకుంటున్న వేళ.. నాటి సువిశాల 13 నియోజకవర్గాల ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉద్యమ విశేషాలపై ప్రత్యేక కథనం.

సింహగర్జనతో కదంతొక్కి..

మలిదశ ఉద్యమానికి కరీంనగర్‌లో జరిగిన సింహగర్జన సభతో శ్రీకారం చుట్టారు. పేరుకు టీఆర్‌ఎస్ పార్టీ సభ అయినా తెలంగాణవాదులు, మేధావులు, కవులు, కళాకారులు, కార్మికులను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిన వేదికగా చరిత్రలో నిలిచిపోయింది. అనంతరం వెనువెంటనే వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్‌ఎస్ రైతు నాగలి గుర్తుపై పోటీ చేసింది. ఉమ్మడి జిల్లాలో అత్యధిక స్థానాలను కట్టబెట్టి, ఇక్కడి ప్రజలు ఉద్యమకాంక్షను చాటారు. అనూహ్యంగా మెజారిటీ స్థానాలతో జెడ్పీ పీఠాన్ని కైవసం చేసుకోవడం ఉమ్మడి రాష్ట్రంలో సంచలనంగా మారింది. తర్వాత 2004 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని, కారు గుర్తుపై పోటీ చేయగా కమలాపూర్, హుజూరాబాద్, నేరెళ్ల, పెద్దపల్లి, మేడారం స్థానాల్లో విజయం సాధించింది. పార్టీ వ్యవస్థాపకుడు కేసీఆర్ కూడా కరీంనగర్ నుంచి ఎంపీగా గెలిచారు. ఈ క్రమంలో కాంగ్రెస్‌తో వచ్చిన విభేదాల కారణంగా 2006లో కరీంనగర్ స్థానానికి ఆయన రాజీనామాతో ఉపఎన్నిక, అవే కారణాలతో 2008లోనూ ఎంపీ, అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో గులాబీ పార్టీకి కరీంనగర్ ప్రజలు అండగా నిలిచారు.

పార్లమెంట్‌లోనూ పోరాటం..

2014లో పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టిన సమయంలోనూ కరీంనగర్ నేతలు వీరోచితంగా పోరాడారు. అప్పటి కరీంనగర్ ఎంపీ, కాంగ్రెస్ ఎంపీల ఫోరానికి అధ్యక్షుడిగా ఉన్న పొన్నం ప్రభాకర్ ఉద్యమంలో నిరంతరం చురుగ్గా పాల్గొన్నారు. పార్లమెంట్‌లో బిల్లును అడ్డుకోవాలని చూసిన లగడపాటి రాజగోపాల్‌ను నిలువరించేందుకు సహచరులతో కలిసి శాయశక్తులా ప్రయత్నించారు. ఈ క్రమంలో లగడపాటి చేతిలో పెప్పర్ స్ప్రే దాడికి గురై, ఆస్పత్రిపాలయ్యారు. ఆ సమయంలో తెలంగాణవాదులంతా పొన్నం ప్రభాకర్‌కు బాసటగా నిలిచారు. అలా ఉద్యమం పురుడు పోసుకున్న క్షణం నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం వరకు కరీంనగర్ తన ప్రజాపోరాటాలతో చరిత్రను శిలాక్షరాలతో లిఖించుకుంది.

భగ్గుమన్న తెలంగాణ

2009 అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలిచినా.. తర్వాత రామగుండం, వేములవాడ ఎమ్మెల్యేలు టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అనంతరం నవంబర్ 29న కేసీఆర్ తలపెట్టిన ఆమరణ దీక్షకు కూడా కరీంనగర్ వేదికగా మాట్లాడి, సిద్దిపేటకు బయల్దేరగా.. పోలీసులు అల్గునూరులో అరెస్టు చేసి, ఖమ్మం జైలుకు తరలించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతికి నాంది పలికింది. అది కేంద్రం తెలంగాణపై ప్రకటన చేసేవరకు సాగింది. తదనంతర పరిణామాలతో కరీంనగర్ పలు తెలంగాణ ప్రజా ఉద్యమాలకు వేదికగా మారింది. 2011 సకల జనుల సమ్మె ప్రకటన, టీచర్ల జేఏసీ, కవులు, కళాకారులు, సబ్బండవర్గాల జేఏసీలన్నీ ఇక్కడే పురుడు పోసుకోవడం గమనార్హం.



అల్గునూరు చౌరస్తాలో బైఠాయించిన కేసీఆర్(ఫైల్)



ఉధృతం: కరీంనగర్‌లో సకలజనుల ర్యాలీ (ఫైల్)



మేముసైతం: ఆందోళనలో ఆర్టీసీ కార్మికులు(ఫైల్)

క్రీడలతో మానసికోల్లాసం

- మల్టీ జోన్ ఐజీ– 1 ఏవీ.రంగనాథ్

కరీంనగర్ క్రైం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మల్టీ జోన్ ఐజీ–1 ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న స్పోర్ట్స్‌మీట్–2024 ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. పోలీసులకు ఇటువంటి ఆటలతో మానసికోల్లాసమే కాకుండా శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. మొన్నటి వరకు ఎన్నికల హడావుడి, మరో నాలుగు రోజుల్లో కౌంటింగ్ ఉన్నప్పటికీ.. అతి తక్కువ విరామంలో విధుల్లో నిమగ్నమై ఉన్న పోలీసులకు ఈ మీట్‌ను గొప్పగా నిర్వహించడం అభినందనీయన్నారు. అంతకముందు సీపీ అభిషేక్ మహంతి ఐజీకి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.



బహుమతులు అందజేస్తున్న ఐజీ ఏవీ రంగనాథ్

ధరణి దరఖాస్తులకు మోక్షం

- పోర్టల్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లకు లాగిన్లు
- స్లాట్ బుకింగ్ బకాయిలపై స్పష్టతేదీ?

కరీంనగర్ అర్బన్: రెవెన్యూశాఖ ధరణి పోర్టల్‌లోని పెండింగ్ భూముల దరఖాస్తులను పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించింది. జీఎల్ఎం, టీఎం-33లతో పాటు దరఖాస్తులను స్పెషల్ డ్రైవ్ ద్వారా పరిష్కరించాలని నిర్ణయించారు. ప్రత్యేక డ్రైవ్ దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. పారదర్శకంగా పరిష్కరించేలా క్షేత్రస్థాయి పర్యటనలు, పాత రికార్డులను పరిశీలించాలని నిర్ణయించారు.

అధికార వికేంద్రీకరణ

గతంలో ధరణి సమస్యలు పరిష్కరించే అధికారం కలెక్టర్లకు మాత్రమే ఉండేది. వేల సంఖ్యలో అర్జీలు వస్తున్న నేపథ్యంలో పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. దీంతో ఆర్డీవోలు, తహసీల్దార్లకు లాగిన్ సౌకర్యం కల్పించారు. ఆర్డీవోలకు పట్టాదారు పాసు పుస్తకం లేకుండా నాలా కన్వర్షన్, ప్రభుత్వం సేకరించిన భూముల్లో సమస్యలు, ఎన్నారైలకు సంబంధించిన భూముల సమస్యలతో పాటు కోర్టు కేసుల పరిష్కారం, మిస్సింగ్ సర్వేనంబర్లు పరిష్కరించే అధికారం అప్పగించారు. తహసీల్దార్లకు పట్టా, అసైన్డ్ భూముల విరాసత్ (పౌతీ), జీపీఏ, స్పెషల్ ల్యాండ్ మ్యాటర్స్, ఖాతా మెర్జింగ్ వంటి వాటికి బాధ్యతలు అప్పగిస్తూ లాగిన్ సౌకర్యం కల్పించారు. ధరణి అర్జీల పెండింగ్ సమస్యలను వివిధ వర్గాలుగా విభజించారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ఎస్థాయి అంశాలుగా ఆయా సమస్యలను నిర్దేశించారు. సేత్వార్, కాస్రా, పహణీ, ఇతర లింక్ డాక్యుమెంట్లు పరిశీలించి క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించనున్నారు. అసైన్డ్ భూములతో పాటు అన్నిరకాల వారసత్వ బదిలీ ప్రక్రియలు, పాసుపుస్తకాలు, జీపీఏ, ఎస్‌పీఏ, ఎగ్జిక్యూటెడ్ జీపీఏ, రెండు, మూడు ఖాతాలు నమోదై ఉంటే కలపడం, భూ సమస్యలకు సంబంధించిన వినతులను తహసీల్దార్లు పరిష్కరిస్తారు. ఆర్డీవోలు పాసు పుస్తకాలు లేకుండా వ్యవసాయేతర భూములుగా నమోదు, భూ సేకరణ సమస్యలు, ప్రవాసీయులకు చెందిన భూ సమస్యలు, సంస్థల పేరుతో పాసుపుస్తకాలు, కోర్టు కేసులు, సమాచారం, పాసు పుస్తకాల్లో తప్పుల నమోదు, మిస్సింగ్ సర్వే నంబర్లు, సబ్ డివిజన్ సర్వే నంబర్లు, విస్తీర్ణాల్లో హెచ్చు తగ్గులను పరిష్కరిస్తారు. కలెక్టర్ యాజమాన్య హక్కుల బదిలీ, అసైన్డ్‌భూములతో పాటు వారసత్వ బదిలీకి సంబంధించి పాస్‌పుస్తకాలు లేనివి, నిషేధిత భూములు, సెమీ అర్బన్ భూములు, కోర్టు కేసులు– పాసుపుస్తకాల సమస్యలను పరిష్కరించనున్నారు.



జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు: 10520
ఇందులో జీఎల్ఎం: 1866
మ్యుటేషన్: 858, పీవోబీ: 1381
కోర్టుకేసులు: 998
పీపీబీ కేసులు: 223, జీపీఏ: 04
నాలా విత్‌ఔట్ పీపీబీ: 402
సక్సెషన్: 916
పాస్‌బుక్ సమస్య: 3311
సెమీ అర్బన్ ల్యాండ్: 110
ఖాతా మెర్జింగ్: 292, ఓఆర్‌జీపీబీ: 15
సర్వే నంబర్ డిలెషన్: 8
ఎన్ఆర్ఐ: 17, హౌస్‌సైట్స్: 112
ఇతర: 07

అప్రమత్తం చేసేలా వివరాలు

పెండింగ్ దరఖాస్తులపై అధికారులను అప్రమత్తం చేసేందుకు ప్రభుత్వం కలెక్టరేట్లతో పాటు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ బోర్డుల్లో ఏ రకమైన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలు వెల్లడించనున్నారు. పెండింగ్‌కు కారణాలను సైతం తెలియజేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

స్లాట్ బుకింగ్ డబ్బులపై లేని స్పష్టత

కాగా స్లాట్ బుకింగ్ చేసిన డబ్బులు చాలా మందికి వెనక్కి రాకపోగా వాటికోసం నిరీక్షిస్తున్నారు. సదరు సమస్య గత ఏడేళ్లుగా అన్నదాతలను వెంటాడుతుండగా కాంగ్రెస్ ప్రభుత్వంలో స్పష్టత వస్తుందని ఆశిస్తున్నారు. ధరణి పెండింగ్ అర్జీలపై దృష్టిసారించిన ప్రభుత్వం స్లాట్ బుక్ అయి రద్దయిన నగదును వెనక్కి ఇవ్వడంపై స్పష్టతనివ్వలేదు. వేల రూపాయలు చెల్లించిన అన్నదాతలు వాటి కోసం నిరీక్షిస్తూనే ఉన్నారు. త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

అనుమతి ఉన్న విత్తనం ఏదైనా వాడొచ్చు

- లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: రైతులు ప్రభుత్వ అనుమతి ఉన్న ఏ పత్తి విత్తనమైనా వాడొచ్చని, ఒకే రకంపై ఆధారపడవద్దని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం గాంధీరోడ్‌లో ఉన్న వైష్ణవి, మార్కెట్‌రోడ్‌లోని రెడ్డి విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏ రకం పత్తి విత్తనాలను రైతులు అధికంగా కొంటున్నారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను, గోదాముల్లో నిల్వ ఉంచిన పత్తి విత్తనాల బ్యాగులు, వరి విత్తనాల బ్యాగులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పత్తి విత్తనాలను నిబంధనలను ప్రకారం విక్రయించాలని సూచించారు. రైతులు ఒకే రకమైన విత్తనాన్ని ఎక్కువగా వాడవద్దని, విభిన్న రకాలను వాడాలని పేర్కొన్నారు. విత్తనాలు, పురుగుమందుల కొరత రాకుండా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాపారులు గడువు దాటకముందే లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్, కరీంనగర్ ఏడీఏ రణధీర్‌రెడ్డి, అర్బన్ వ్యవసాయ అధికారి హరిత ఉన్నారు.



విత్తన దుకాణం తనిఖీ చేస్తున్న కలెక్టర్

పండుగలా బడిబాట నిర్వహించండి

మానకొండూర్: బడిబాట కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మానకొండూర్ మండలం ముంజంపల్లి, జగ్గయ్యపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో చేపట్టిన అభివద్ధి పనులను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. పనులు నాణ్యతతో, విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు జూన్ 4లోపు పూర్తిచేయాలన్నారు. పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సూచించారు. డీఈవో జనార్దన్‌రావు, ఎంపీడీవో నర్సయ్య, ఎంఈవో మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ప్రమాదంలో వృద్ధుడి మృతి



రామగుండం: రామగుండం–పెద్దంపేట రైల్వేస్టేషన్ల మధ్య జరిగిన రైలు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. మృతుడిని అంధుడిగా భావిస్తున్నారు. అతడివద్ద ఆధారాలు లభించలేదు. అయితే, తెలుపు, బ్లూ, బూడిద రంగు నిలువు గీతలు ఫుల్‌షర్ట్, నలుపు, బ్రౌన్ చెక్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. బంధువులు ఉంటే 99493 04574, 87126 58604 నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి తెలిపారు.

బావిలో పడి ఒకరు..



మొండయ్య (ఫైల్)

రామగిరి(మంథని): కల్వచర్ల గ్రామానికి చెందిన కుంట మొండయ్య(75) బావిలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మే 30న మొండయ్య తన పొలం వద్దకు వెళ్తున్న క్రమంలో దారిలో దాహం వేసింది. సమీపంలోని వ్యవసాయ బావిలోకి దిగే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడి కుమారుడు కుంట ఓదేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.

స్వగ్రామానికి మృతదేహం



శవపేటిక వద్ద బంధువులు

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా కేంద్రం గాంధీనగర్‌కు చెందిన సింగారపు గంగాధర్ (35) ఇటీవల దుబాయ్‌లో మృతిచెందాడు. గురువారం రాత్రి ఏయిర్‌ఇండియా విమానంలో శవపేటిక హైదరాబాద్‌కు చేరింది. హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేసి మృతదేహాన్ని జగిత్యాలకు తీసుకువచ్చారు.

గోవులను తరలిస్తున్న వాహనాలు సీజ్

- 15 మందిపై కేసు

పాలకుర్తి(రామగుండం): మహారాష్ట్రతోపాటు మనరాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అక్రమంగా గోవులను తరలిస్తున్న ముఠాను శుక్రవారం తెల్లవారుజామున బసంత్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై స్వామి కథనం ప్రకారం.. మహారాష్ట్ర, బెల్లంపల్లి మండలం నెన్నెల, ఆసిఫాబాద్ జిల్లా దహెగాం తదితర ప్రాంతాల నుంచి 5 వాహనాల్లో 67ఆవులను అక్రమంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో కన్నాల టోల్‌ప్లాజా వద్ద పోలీసులు శుక్రవారం ఆవులను తరలిస్తున్న 3 బొలెరో, 2 ఐచ్ వాహనాలు పట్టుకున్నారు. గోవులను యైటింక్లయిన్ కాలనీలోని గోశాలలకు తరలించారు. డ్రైవర్లు, క్లీనర్లతోపాటు మహారాష్ట్రకు చెందిన రాజున క్యావర్, అజీంషేక్, వరంగల్‌కు చెందిన గట్టిగొప్పు నాగరాజు, కరీంనగర్‌కు చెందిన అఫ్జల్, ఇమ్రాన్‌పై కేసు నమోదు చేశారు.

ఆవులకు రక్షణ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): బసంత్‌నగర్ వద్ద పట్టుకున్న ఆవులకు స్థానిక శ్రీవేంకటేశ్వర ఆలయ సమీప గోశాలకు తరలించగా.. టూటౌన్ సీఐ రవీందర్ ఆధ్వర్యంలో రక్షణ కల్పించారు. పశువైద్యురాలు వెన్నెల తొలుత ఆవులను పరీక్షించి అస్వస్థతకు గురైన వాటికి చికిత్స చేశారు. సిబ్బంది సాయికృష్ణ, రమేష్, శ్రీ కాంత్, టూటౌన్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రెవెన్యూ డివిజన్ల మార్పు!

- కోరుట్ల, మెట్‌పల్లి.. ఏదో ఒక్కటేనా?
- ధర్మపురి కొత్త డివిజన్‌పై ఆశలు



కోరుట్ల: జిల్లాల కుదింపు.. పేర్ల మార్పు వంటి అంశాలు ఈ మధ్యకాలంలో చర్చనీయంగా మారిన క్రమంలో జగిత్యాల జిల్లాలో రెవెన్యూ డివిజన్లను కుదించేందుకు కసరత్తులు జరుగుతున్నట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం రెవెన్యూ డివిజన్ల అంశం తెరపైకి వస్తుందని రెవెన్యూ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో జగిత్యాల జిల్లాలో ఇప్పుడు ఉన్న మూడు డివిజన్లలో కొన్ని మార్పులు చేర్పులు ఉంటాయన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి.

ఏదో ఒక్కటేనా..?

2016లో జగిత్యాల జిల్లా కేంద్రంగా మారిన అనంతరం జిల్లాలో ప్రస్తుతం మొత్తం 20 మండలాల ఉండగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌లు ఉన్నాయి. 2021లో పోటాపోటీగా కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌లు ఏర్పాటు అయ్యాయి. మొదట మెట్‌పల్లి డివిజన్ ఏర్పాటైన అనంతరం కోరుట్ల నుంచి పెద్ద ఎత్తున ఉద్యమాలు, ఆందోళనలు ఉధృతం కావడంతో వెంటనే కోరుట్ల రెవెన్యూ డివిజన్ ప్రకటించారు. ఫలితంగా కోరుట్ల రెవెన్యూ డివిజన్‌లో కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాలు, మెట్‌పల్లి డివిజన్‌లో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలు ఉన్నాయి. ఈ లెక్కన రెండు డివిజన్‌లు కేవలం మూడునాలుగు మండలాలతో ఏర్పాటు అయ్యాయి. ఇక మిగిలిన 13 మండలాలు అన్ని జగిత్యాల రెవెన్యూ డివిజన్ పరిధిలోనే ఉన్నాయి. కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్లు చిన్నవి కావడం, ఒక్క జగిత్యాల రెవెన్యూ డివిజన్‌లోనే 13 మండలాలు ఉండటంతో పరిపాలన పరంగా అనుకూలంగా లేనట్లుగా రెవెన్యూ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ధర్మపురి రెవెన్యూ డివిజన్ కావాలన్న డిమాండ్ ఉండటం.. మారిన రాజకీయ పరిస్థితులే కాకుండా, భౌగోళిక స్వరూపం, అవసరాలు ఈ డిమాండ్‌కు అనుకూలంగా ఉండటం గమనార్హం. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్లు కలిపి ఒకే రెవెన్యూ డివిజన్‌గా మారే అవకాశాలున్నట్లు రెవెన్యూ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఈ పరిస్థితి ఎదురైతే కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్లలో ఏదో ఒక్కటే మిగులుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కుదింపు కసరత్తు ఎప్పుడో?

పార్లమెంట్ ఎన్నికల తర్వాత జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల కుదింపు కసరత్తు ఉంటుందున్న ప్రచారం జోరుగా సాగుతోంది. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన మండలాల్లో సైతం పరిపాలన పరమైన సౌలభ్యం దృష్టిలో ఉంచుకుని మార్పులు, చేర్పులు ఉంటాయన్న చర్చ సాగుతోంది. ఏడాది క్రితం జగిత్యాల జిల్లాలో కొత్తగా ఏర్పాటైన ఎండపల్లి, భీమారం మండలాల్లో ఇప్పటికీ ఎలాంటి మౌలిక సదుపాయల కల్పన లేకపోవడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో జిల్లాలో ఏ డివిజన్లు ఉంటాయో.. ఏయే మండలాలు రద్దు అవుతాయన్న అయోమయ పరిస్థితి నెలకొంది.

కుమ్మరిపల్లిలో భారీ అగ్నిప్రమాదం



కాలిపోతున్న కోళ్లఫారం షెడ్డు

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలం కుమ్మరిపల్లిలో అంబాల ప్రతాప్‌రెడ్డికి చెందిన కోళ్లఫారం షెడ్డుకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. షెడ్డుతోపాటు పశువులకు సంబంధించిన మిషన్లు, పైప్‌లైన్, షెడ్డులో నిల్వ చేసిన 3 వేల గడ్డికట్టలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, మెట్‌పల్లికి చెందిన ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. సుమారు రూ.12 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధిత రైతు ప్రతాప్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

జిల్లా కేంద్రంలో 20 బైక్‌లు..



జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్‌లో తీట్ల అన్వేశ్‌కు చెందిన బైక్ మెకానిక్ వర్క్‌షాప్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఎండవేడిమి తట్టుకోలేక ప్రమాదవశాత్తు నిప్పు చెలరేగి 20 ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులు సమాచారం అందించగా వారు సకాలంలో చేరుకుని మంటలు ఆర్పేసి పెనుప్రమాదాన్ని నివారించారు. సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు.

సిరికొండలో ఈతవనం..

బుగ్గారం(ధర్మపురి): మండలంలోని సిరికొండలో గత మంగళవారం పెద్దసంఖ్యలో ఈతచెట్లు కాలిపోయిన ఘటన మరువకముందే మండల కేంద్రం శివారు ప్రాంతంలో గురువారం సాయంత్రం ఈతవనానికి నిప్పంటుకొని సుమారు 300 పైగా ఈత చెట్లు కాలిపోయాయి. దీంతో గీతకార్మికులు ఉపాధి కోల్పోయారని గౌడసంఘం మండల అధ్యక్షుడు మూల శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాలిపోయిన ఈతవనాన్ని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. పరిహారం అందేలా కృషి చేస్తామని వేముల సుభాష్ పేర్కొన్నారు.

మోరపల్లిలో ఆయిల్‌పాం మొక్కలు..

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లికి చెందిన రైతు దమ్మ మల్లిక నాలుగెకరాల్లో ఆయిల్‌పాం సాగుచేసి డ్రిప్ పైపులు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించగా డ్రిప్ పైపులతో పాటు, 30 ఆయిల్ పాం మొక్కలు కాలిపోయాయని బాధిత రైతు ఆరోపించారు. రైతును ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఎమ్మెల్యే మామిడితోటలో..



తోటలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జగిత్యాలరూరల్: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్వగ్రామం అంతర్గాంలోని ఆయన మామిడి తోటలో శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకోగా స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ ఫైరింజన్ కొండగట్టులో ఉండటంతో ధర్మపురి ఫైరింజన్ తెప్పించి మంటలు ఆర్పేసి పెను ప్రమాదాన్ని నివారించారు. జగిత్యాల అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఒకేరోజు ఏడు ప్రమాద కాల్స్ రావడంతో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి నష్టాన్ని నివారించారు.

రెండు గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు

గన్నేరువరం: మండలంలోని మైలారం, యాస్వాడ గ్రామాల్లో శుక్రవారం ప్రమాదశాత్తు అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మైలారం గ్రామ సమీపం, మానేరు తీరాన మధ్యాహ్న సమయంలో వరికొయ్యలకు నిప్పంటుకొని మంటలు పక్కనున్న పొలాలకు వ్యాపించాయి, పొలాల్లోనే ఉన్న వరి గడ్డితో పాటు వ్యవసాయ బావులకు చెందిన మోటారు వైర్లు, స్టార్టర్ డబ్బాలు, రబ్బరు పైపులు కాలిబుడిదయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



మైలారంలో కాలిపోయిన పైపు

సుమారు పది మంది రైతులకు రూ.రెండులక్షల వరకు నష్టం జరిగిందని స్థానికులు తెలిపారు. అలాగే యాస్వాడలోను ప్రమాదవశాత్తు ప్రమాదం చోటుచేసుకోగా స్వల్పంగా నష్టం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

వీణవంక: మండల కేంద్రానికి చెందిన కళ్యాణం రామక్క(75)అనే వృద్ధురాలు శుక్రవారం వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలింది. కుటుంబీకులు గమనించేలోపు మృతి చెందింది. వారం రోజులుగా వీణవంకలో రికార్డు స్థాయిలో ఎండలు దంచికొడుతున్నాయి. 42 నుంచి 46.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదదవుతున్నాయి.

‘మాల్టా’ పేరిట మోసం

- విదేశాలకు పంపిస్తానని రూ.3 లక్షలు స్వాహా
- తప్పించుకుని తిరుగుతున్న గల్ఫ్ నకిలీ ఏజెంట్

సిరిసిల్లక్రైం: యూరప్‌లోని ‘మాల్టా’ దేశానికి పంపిస్తానని, నెలకు లక్షల రూపాయల జీతం ఉంటుందని నమ్మబలికి సిద్దిపేటకు చెందిన శ్రీనివాస్ సిరిసిల్లకు చెందిన పలువురి వద్ద డబ్బులు దండుకున్నాడు. ముందుగా టైలరింగ్ పనిచేసి అందులో కనీస కూలీ గిట్టుబాటు కాక ప్రస్తుతం సెల్‌పాయింట్‌లో పనిచేస్తున్న కృష్ణహరిని ట్రాప్ చేశాడు. విదేశాల్లో లక్షల్లో జీతం ఉంటుందని మాటల్లో ముంచి కృష్ణహరి నుంచి గత ఫిబ్రవరిలో రూ.50వేలు తీసుకున్నాడు. ఏజెంట్ మాటా లు నమ్మి కృష్ణహరి మరో ఐదుగురితో శ్రీనివాస్‌కు డబ్బులు ఇప్పించాడు. నెలలు గడుస్తున్నా వీసా రాకపోవడంతో శ్రీనివాస్ కోసం గాలింపు చేపట్టారు. ఈక్రమంలోనే శ్రీనివాస్ అద్దె ఇంటిని ఖాళీ చేసి మరో ఇంటికి మారాడు. ఏజెంట్ భార్య ఓ పాఠశాలలో పనిచేస్తుందని తెలిసి ఆమె వెళ్లే మార్గాన్ని అనుసరించి కొద్ది రోజుల క్రితం డబ్బుల గురించి అడగ్గా రేపుమాపు అంటూ దాటవేశాడు. జిల్లాలో మోసపోయిన వారిలో వేములవాడ మండలంలో ఒకరు, ఎనగంటిలో ఇద్దరు, సిరిసిల్లలో ఇద్దరు, నూకలమర్రిలో ఒకరు ఉన్నారు.

నృసింహుని సేవలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ చీఫ్



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పోస్టల్ డిపార్టుమెంట్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ విద్యాసాగర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయం పక్షాన సంప్రదాయ రీతుల్లో మేళతాళాలతో స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అనుబంధ ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం కప్పి, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వడదెబ్బతో యువకుడి మృతి



కిశోర్ (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనికి చెందిన ఈదునూరి కిశోర్(37) శుక్రవారం వడదెబ్బతో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. కిశోర్ తన మిత్రులతో కలిసి కొండగట్టు అంజన్న దర్శనానికి గురువారం పాదయాత్ర ద్వారా బయలు దేరి వెళ్లాడు. శుక్రవారం మధ్యాహ్నం భిక్ష పూర్తిచేసుకుని సాయంత్రం ధర్మారం సమీపంలోని రాజారాంపల్లి వద్దకు పాదయాత్ర ద్వారా చేరుకున్నాడు. అక్కడే హఠాత్తుగా సొమ్మసిల్లి పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న కిశోర్‌ను స్నేహితులు అంబులెన్స్ ద్వారా గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు సోలార్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు.

పిట్టల ఎల్లయ్యపల్లెలో ఒకరు..

ఓదెల(పెద్దపల్లి): పిట్టలఎల్లయ్యపల్లె గ్రామానికి చెందిన పిట్టల ఓదెలు(85) వడదెబ్బతో శుక్రవారం మృతిచెందాడు. ఎండల తీవ్రతకు అస్వస్థతకు గురైన ఓదెలు.. తన ఇంట్లో తెల్లవారుజామున మృతిచెందాడు.

రైతును బెదిరించిన కేసులో ఇద్దరి అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన ఎస్సై శ్రీకాంత్

చందుర్తి(వేములవాడ): రైతును డబ్బుల కోసం విలేకరమని బెదిరించిన నలుగురిలో ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు. చందుర్తి మండలం లింగంపేటకు చెందిన కమటం లక్ష్మీరాజంను ఈనెల 23వ తేదీ అర్ధరాత్రి నలుగురు వ్యక్తులు డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. బెదిరింపులకు పాల్పడిన కొలగాని చందు, ఖమ్మం రమాకాంత్‌లను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. లింగంపేటకు చెందిన ఇద్దరు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు వివరించారు. చందు, రమాకాంత్‌లను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

డ్రిప్ పరికరాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక నష్టం

- వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించిన మహిళా రైతు

బోయినపల్లి(చొప్పదండి): డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇవ్వకపోవడంతో రూ.30 లక్షలు నష్టం వాటిల్లిందని మండలంలోని మర్లపేటకు చెందిన మహిళా రైతు భీంరెడ్డి విజయ వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించినట్లు శుక్రవారం తెలిపింది. చెరుకుతోట కోసం డ్రిప్ పరికరాలు కావాలని 2022లో రూ.1.14లక్షలు డీడీ తీసి దరఖాస్తు చేసుకుంది. లబ్ధిదారు వాటా డబ్బులు చెల్లించినా పరికరాలు ఇవ్వకపోవడంతో రూ.30 లక్షల నష్టం వాటిల్లిందని విజయ వాపోయింది. తనకు జరిగిన నష్టంపై అధికారులను ఆశ్రయిస్తే సరిగ్గా స్పందించలేదని పేర్కొంది. దీంతో వినియోగదారుల ఫోరం ఆశ్రయించడంతోపాటు అడ్వకేట్ ద్వారా ఉద్యానశాఖ డైరెక్టర్, కలెక్టర్, ఉద్యానశాఖ జిల్లా అధికారి, జైయిన్ ఇరిగేషన్ కంపెనీకి నష్టపరిహారం అందించాలని నోటీసులు పంపినట్లు మహిళా రైతు విజయ తెలిపింది.

పెద్దపల్లి జిల్లాలో లారీల బీభత్సం



సుల్తానాబాద్‌లో చెట్టును ఢీకొని ఆగిన లారీ



జ్యోతినగర్ : ఆగి ఉన్న బస్సు, కారును ఢీకొన్న లారీ

సుల్తానాబాద్‌రూరల్/జ్యోతినగర్: పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్, జ్యోతినగర్‌లో శుక్రవారం మధ్యాహ్నం రెండు లారీలు బీభత్సం సృష్టించాయి. ఈఘటనల్లో ఏడుగురికి గాయాలు కాగా, ఓ కారు, నాలుగు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి.

తప్పిన పెనుప్రమాదం..

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలో ఓ లారీ బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులోని డ్రైవర్ లారీని అతివేగంగా నడపడంతో ఇద్దరు తీవ్రంగా, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు పరుగులు పెట్టడంతో పెను ప్రమాదం తప్పింది. ఎస్సై శ్రావణ్‌కుమార్, స్థానికుల కథనం ప్రకారం.. ఎన్టీపీసీ ప్రాంతానికి చెందిన డ్రైవర్ వంశీ, వరంగల్‌కు చెందిన క్లీనర్ కమలాకర్ ఇసుక లోడ్‌తో వరంగల్ వెళ్లారు. అక్కడ అన్‌లోడ్ చేశాక గోదావరిఖని వస్తున్నారు. సుల్తానాబాద్‌లోని పూసాల రోడ్డు వద్దకు రాగా లారీ అతివేగంతో అదుపు తప్పింది. బైక్‌పై రోడ్డు దాటుతున్న సుల్తానాబాద్‌కు చెందిన యూసఫ్, తన భార్య నజీం, కొడుకు దీలిషన్, కూతురును ఢీకొట్టింది. ఆ వెంటనే చొప్పదండికి చెందిన వినయ్‌కుమార్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. అక్కడితో ఆగకుండ రాజీవ్ రహదారి పక్కన ఉన్న గప్‌చప్ బండి ఢీకొని ఎడమవైపున ఉన్న ఓ దుకాణం ఎదట చెట్టును ఢీకొని ఆగిపోయింది. ఈ ఘటనలో నజీం, దీలిషన్‌కు తీవ్రగాయాలు కాగా కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. యూసఫ్, వినయ్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. యూసఫ్ కూతురు, డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు. అయితే, ఈ ఘటనలో నలుగు ద్విచక్ర వాహనాలు, ఒక గప్‌చుప్ బండి ధ్వంసమయ్యాయి. లారీ డ్రైవర్‌ను స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేస్తుండగా పోలీసులు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి ఏసీపీ కృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

జ్యోతినగర్‌లో..

ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు సమీపంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆగిఉన్న ఆర్టీసీ బస్సు, కారును ఓ లారీ ఢీకొంది. గోదావరిఖని మెయిన్ చౌరస్తాకు చెందిన ఎండీ జమీర్ తన కుటుంబసభ్యులు తయ్యబ్, ఫాతీమా జబీన్, ఇఖ్రా సమీన్, ఆరిఫాతో కలిసి కారులో రామగుండం రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నారు. ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ సిగ్నల్స్ పడడంతో అప్పటికే ఆగిఉన్న ఆర్టీసీ బస్సు వెనకాల కారు నిలిపాడు. ఇదేసమయంలో గోదావరిఖని నుంచి అతివేగంగా వచ్చిన లారీ కారును బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు, లారీ మధ్య కారు ఇరుక్కుని ధ్వంసమైంది. కారులోని వారికి గాయాలు కాగా వెంటనే గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు జమీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు రంగంలోకి దిగి పునరుద్ధరించారు.

నిందితులను శిక్షించాలి

- ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా
- బాధితులతో మాట్లాడిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి



ఎల్లారెడ్డిపేటలో మమత బంధువుల ఆందోళన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం బాబాయి చెరువుతండాకు చెందిన మమత(21)ను ప్రేమించిన వ్యక్తి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపిస్తూ బంధువులు, కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం ఆందోళన చేశారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. దాదాపు 200 మంది తరలివచ్చి స్థానిక ఠాణా ఎదుట ధర్నాకు దిగారు. ఎల్లారెడ్డిపేటలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై బైటాయించారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కూతురును ప్రేమించిన వ్యక్తి మరొకరితో కలిసి హత్య చేశారని ఆరోపించారు. ఇద్దరిని పోలీసులు పట్టుకొని చట్టపరంగా శిక్షించాలని కోరారు. ఈ సమాచారం అందుకున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఎల్లారెడ్డిపేటకు చేరుకొని బాధితులతో మాట్లాడారు. సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నిందితులను చట్టపరంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. డీఎస్పీ హామీతో బాధితులు ఆందోళన విరమించారు.

ఎట్టకేలకు యువతి అంత్యక్రియలు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం బాబాయిచెరువుతండాలో బానోతు మమత అనుమానాస్పదంగా మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసిన తర్వాత స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. కుటుంబీకులు, తండావాసుల రోదనలు మిన్నంటాయి. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి మృతదేహాన్ని సంప్రదాయాల ప్రకారం ఖననం చేశారు.

లైంగికదాడి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

జగిత్యాలక్రైం/జగిత్యాలజోన్: మహిళను బలవంతంగా లాక్కెళ్లి లైంగికదాడికి పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వివరాలు.. బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మహిళ 2018 ఫిబ్రవరి 11న సాయంత్రం 4 గంటలకు తన అమ్మమ్మ ఊరు ధర్మపురి మండలం తీగలధర్మారం గ్రామానికి వెళ్లింది. ఇంట్లో అమ్మమ్మ లేకపోవడంతో పొలం వద్దకు వెళ్లిందని తెలుసుకుని అక్కడికి సైకిల్‌పై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన మేరనగేశ్, కొమ్మిర సాయి ఇద్దరు కలిసి బాధితురాలిని మామిడితోటలోకి లాక్కెళ్లి, లైంగికదాడికి పాల్పడ్డారు. ఆమె అరవడంతో అక్కడే పొలంలో పనిచేస్తున్న మహేశ్ వెళ్లగా అతడిని చూసి నిందితులు పరారయ్యారు. దీంతో బాధితురాలు జరిగిన విషయాన్ని అన్నయ్య, అమ్మమ్మ, అక్కకు తెలుపడంతో అదేరోజు ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ లక్ష్మీబాబు కేసు నమోదు చేశారు. నిందితులకు శిక్ష పడేలా సీపీ మల్లేశం, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ లక్ష్మీబాబు, ఎస్సై రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితులకు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నారాయణ శుక్రవారం తీర్పునిచ్చారు. నిందితులకు శిక్ష పడేలా పనిచేసిన పోలీసు అధికారులను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

హుజూరాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లికి చెందిన ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ముగ్దుంపురం అనిల్ కుమార్(39) పట్టణంలోని ఓ దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. కళ్లు సరిగ్గా కనిపించకపోవడంతో దుకాణంలో ఇబ్బందులు పడుతూ తాగుడుకు బానిసయ్యాడు. మే 30న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించిందని మెరుగైన చికిత్స కోసం హుజూరాబాద్‌కు తీసుకొస్తుండగా మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కేబుల్ టీవీ ఆపరేటర్ బలవన్మరణం

- కళ్లు దానం చేసిన కుటుంబసభ్యులు



శ్రీనివాస్ (ఫైల్)

గోదావరిఖని: స్థానిక పవర్‌హౌస్‌కాలనీకి చెందిన కేబుల్ టీవీ ఆపరేటర్ మమూనూరి శ్రీనివాస్(45) శుక్రవారం ఉరివేసుకుని మృతి చెందాడు. మద్యానికి బానిసైన శ్రీనివాస్ ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపా రు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు వివరించారు. అయితే, కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు శ్రీనివాస్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని వాసన్‌ఐ బ్యాంక్‌కు తరలించారు.



రాజన్న ఆలయంలో హనుమాన్ దీక్షాపరులు, ఇతర భక్తులు

శైవక్షేత్రం.. కాషాయ వర్ణం



వేములవాడ: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వేములవాడ రాజన్న ఆలయంలో శుక్రవారం రద్దీ పెరిగింది. హనుమాన్ మాలధారులతోపాటు వివిధప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో రాజన్న క్షేత్రం కాషాయవర్ణమైంది. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఈవో రామకృష్ణ, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్, జయకుమారి పరిశీలించారు.

ఉద్యోగాల భర్తీపై శ్రద్ధ ఏదీ?



సభ్యత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కరీంనగర్: రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లో డీవైఎఫ్ఐ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గడిచిన పదేళ్లలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత కుటుంబపోషణ భారమై ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉన్నంత శ్రద్ధ ఉద్యోగాలు భర్తీ చేయడంలో ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉద్యోగాలు భర్తీ చేసి, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో నిరుద్యోగ యువతీ యువకులతో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జి.సురేశ్‌నాయక్ ,నాయకులు రాహుల్, అజయ్, భాను, సంతోష్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకొని గ్రామ, మండల కేంద్రాల్లో ప్రభుత్వమే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏవో గద్దం సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్ మాట్లాడుతూ తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, డీఈ, డీపీవో, గ్రామ పంచాయతీ ఆఫీస్‌లలో బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలన్నారు. కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా, గోదావరిఖని వెళ్లే బస్టాండ్ ,జగిత్యాల వెళ్లే బస్టాండ్, రేకుర్తి, కొత్తపల్లి, నాకా చౌరస్తా, కమాన్ దగ్గర, కోతిరాంపూర్, గంజి, అల్గునూరు చౌరస్తా , శివ టాకీస్ లేబర్ అడ్డా తదితర ప్రాంతాల్లో జన సందోహం ఉన్నచోట మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ల రాజు, సుందరగిరి భూమయ్య, తదితరులు ఉన్నారు.



ఘనంగా హన్మాన్ హోమం

కరీంనగర్ మండలం నగునూరులోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం అంజనేయ సేవా సమితి ఆధ్వర్యంలో హన్మాన్‌హోమం ఘనంగా నిర్వహించారు. రాఘవేందర్‌రెడ్డి దంపతులతో పాటు హన్మాన్ మాలధారులు హోమంలో పాల్గొన్నారు. గురుస్వామి బాపురెడ్డి ప్రత్యేక పూజల అనంతరం హన్మాన్ దీక్షాపరులకు ఇరుముడి కట్టారు. అనంతరం మాజీ ఉప సర్పంచ్ దామరపల్లి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. – కరీంనగర్‌రూరల్

క్లుప్తంగా

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



శిబిరంలో సర్టిఫికెట్లతో విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని హనుమాన్‌నగర్‌లో గల బ్లూబెల్స్ పాఠశాలలో వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. సుమారు 50 మంది చిన్నారులు భగవద్గీత శ్లోకాలు, రామాయణం, క్విజ్ గేమ్స్, ల్యూసిడ్ హ్యాండ్‌రైటింగ్, వేద గణితం తదితర వాటిపై శిక్షణ పొందారు. శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జంగ సునీత మనోహర్‌రెడ్డి, వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ జంధ్యం మాధవి, మధూకర్, రవీందర్, విజయలక్ష్మి, పద్మావతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడుతున్న వ్యాపారులకు జరిమానా

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో ప్లాస్టిక్ వాడుతున్న పలు వ్యాపార సంస్థలకు నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం జరిమానా విధించింది. శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పలు టిఫిన్ సెంటర్లు, చికెన్ సెంటర్లు, దుకాణాల్లో ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ప్లాస్టిక్‌ను వాడుతున్న వ్యాపారులకు రూ.2 వేలు జరిమానా విధించారు. అలాగే ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి

శంకరపట్నం: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జూనియర్ కాలేజీ ఏర్పాటును పట్టించుకోలేదని ఆరోపించారు. మండలానికి కాలేజీ మంజూరు చేయకుంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అమరుల కుటుంబాలను ఆదుకోవాలి

జమ్మికుంట: రాష్ట్ర సాధనలో బలిదానాలు చేసుకున్న 1200 అమరుల కుటుంబాలను ఆదుకోవాలని నంది అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా వారి అమరుల కుటుంబాలకు న్యాయం జరుగలేదని ఆరోపించారు. జూన్ రెండున జరిగే దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర అధికార లోగోను మార్చడమే కాకుండా తెలంగాణ కోసం ప్రాణాలర్పించి వారి కుటుంబాలకు అండగా రూ. 20లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమంలో పాల్గొన్న వారిపై కేసులున్నాయని, కోర్టు చుట్టూ తిరుగుతున్న ఉద్యమకారులందరినీ ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు.

రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు

సైదాపూర్: మండల రైతులకు వానాకాలం సాగుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు వ్యవసాయ సహకార సంఘాల్లో అందుబాటులో ఉన్నాయని వెన్కెపల్లి సహకార సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విత్తనాలు అవసరమున్న రైతులు భూమి పాసుబుక్కులు, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో సహకార సంఘంలో కొనుగోలు చేయాలన్నారు.

వాన నీటిని ఒడిసిపట్టాలి

- 'ఉపాధిహామీ'లో జలసంరక్షణ పనులు
- మూడు గ్రామాల్లో ఫాంపాండ్స్ నిర్మాణం

కరీంనగర్‌రూరల్: వేసవికాలంలో జలసంరక్షణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఓ వైపు కొందరు రైతులు సొంతంగా జేసీబీలతో పొలాల్లో బావులు తవ్వుతుండగా మరోవైపు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నీటి నిల్వ సామర్థ్య పనులు ముమ్మరంగా నడుస్తున్నాయి. ఈ పనులన్నీ పూర్తయితే రాబోయే వర్షాకాలంలో కురిసే వాన నీటిని ఒడిసిపట్టేందుకు అవకాశమేర్పడుతోంది.

అడుగంటిన భూగర్భ జలాలు

కరీంనగర్ మండలంలో భూగర్భ జలాలు అడుగంటాయి. బోరుబావుల ద్వారా పంటలకు సరైన నీళ్లు అందక వేసవి సీజన్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోయాయి. గతంలో వంద అడుగుల లోతులోనే నీళ్లు సమృద్ధిగా లభించేవి. నీటి వినియోగంలో పెరుగుతున్న పోటీతో ప్రస్తుతం మూడు వందల అడుగులకు పైగా బోర్లు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. అడుగంటిన భూగర్భ జలాలను పెంపొందించేందుకు అధికారులు జలసంరక్షణ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఉపాధిహామీ పథకంలో చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, ఫాంపాండ్స్ నిర్మాణ పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీటి నిల్వ తగ్గడంతో ఉపాధికూలీలతో అన్ని గ్రామాల్లో పూడికతీత, చెరువు మట్టి తరలింపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పూడికతీత పనులతో చెరువులు, కుంటల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. చెరువుల సమీపంలోని వ్యవసాయ బావులు, బోర్లలో నీటిమట్టం పెరిగేందుకు దోహదపడుతోంది.



దుర్శేడ్‌లో ఫాంపాండ్ తవ్వుతున్న ఉపాధికూలీలు

మూడు గ్రామాల్లో ఫాంపాండ్స్ నిర్మాణం

ఉపాధిహామీ పథకంలో దుర్శేడ్, నగునూరు, బహదూర్‌ఖాన్‌పేట గ్రామాల్లో మార్చి నెల నుంచి ఫాంపాండ్స్ నిర్మాణ పనులు నడుస్తున్నాయి. దుర్శేడ్‌లో రెండు చోట్ల, నగునూరు, బహదూర్‌ఖాన్‌పేటలో ఒక్కోటి చొప్పున ఫాంపాండ్స్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం దుర్శేడ్‌లో ఒక్క ఫాంపాండ్ పనులు నడుస్తుండగా మిగతా గ్రామాల్లో పూర్తయ్యాయి. అయితే వ్యవసాయభూముల్లో సైతం ఫాంపాండ్ నిర్మించుకునే అవకాశమున్నప్పటికీ రైతులు ముందుకు రావడం లేదు. ఫాంపాండ్స్ నిర్మాణంతో పంట భూమిని కోల్పోతామనే ఉద్దేశంతో పలువురు రైతులు ముందుకు రావడం లేదు. ఫాంపాండ్స్‌తో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టితే కొంతమంది రైతులైనా ముందుకొచ్చే అవకాశముంది.

> **జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం**
>
> ఉపాధిహామీ పథకంలో ఎక్కువగా జలసంరక్షణ పనులకు ప్రాధాన్యం కల్పించాం. జలసంరక్షణపై రైతులు, ఉపాధికూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. చెరువులు, కుంటల్లో పూడికతీత పనులతో నీటి సామర్థ్యం పెరుగుతుంది. చెరువుల సమీపంలోని వ్యవసాయబావుల్లో నీటి నిల్వలుంటాయి.
>
> – శోభారాణి, ఏపీవో, ఉపాధిహామీ పథకం

పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలి



మాట్లాడుతున్న పసుల శ్రవణ్

కరీంనగర్‌టౌన్: ప్రభుత్వామోదిత ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో బోధనేతర సిబ్బందికి ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని బీఎంఎస్ కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఈ విషయంలో ఆలోచన చేయాలని, లేని పక్షంలో బీఎంఎస్ ఆధ్వర్యంలో తగిన కార్యాచరణ చేపట్టి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఎంఎస్ రాష్ట్ర నాయకుడు పప్పుల సురేశ్, జిల్లా నాయకులు ఎండీ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాల శాంపిల్స్ సేకరణ



పత్తి విత్తనాల ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఏవో సత్యం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్ల నుంచి శుక్రవారం పత్తి విత్తనాల శాంపిల్స్‌ను మండల వ్యవసాయాధికారి బి.సత్యం సేకరించారు. బొమ్మకల్‌లోని హన్మాన్ ఆగ్రోస్‌లో శ్రీరాం బయోసీడ్ కంపెనీకి చెందిన జీహెచ్‌హెచ్029, వసంతసీడ్ కంపెనీ ముద్ర విత్తనాలు, వానాశ్రీ అగ్రి సర్వీసెస్‌లో అజిత్ సీడ్స్ కంపెనీ ఏసీహెచ్900–2, మహికో సీడ్స్–ఎంఆర్‌సీ–7373 పత్తి విత్తనాల ప్యాకెట్లను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి ఆయా కంపెనీల పత్తి విత్తనాల శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించినట్లు ఏవో తెలిపారు. ల్యాబ్ నుంచి పరీక్షా ఫలితాలు వచ్చిన అనంతరమే ఆయా కంపెనీల పత్తి విత్తనాలను డీలర్లకు సరఫరా చేయాలని ఆయా సంస్థల యజమానులకు సూచించారు.

శిక్షణతోనే క్రీడారంగంలో రాణింపు



సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులతో బండ శ్రీనివాస్, తదితరులు

హుజూరాబాద్: సరైన శిక్షణ తీసుకుంటేనే క్రీడాకారులు ఆటల్లో రాణిస్తారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నెల రోజుల పాటు హాకీ క్రీడాకారులకు ఇచ్చిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. హుజూరాబాద్ హాకీ క్రీడకు అడ్డాగా మారిందని, క్రీడలో రాణించి హుజూరాబాద్‌కు మంచి పేరును తీసుకరావాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన బాలబాలికలకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. కోచ్, సీనియర్ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు భూసారపు శంకర్, ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఉమామహేశ్వర్, కౌన్సిలర్ కబడ్డీ క్రీడాకారుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

10న రాష్ట్ర సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కరీంనగర్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'ఉపాధి హామీ చట్టం అమలు సవాళ్లు' అనే అంశంపై ఈనెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ల రాజు అన్నారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాజ్యసభ సభ్యులు శివదాసన్‌లు హాజరవుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా ఉపాధి హామీ చట్టం అమలులో వస్తున్న సమస్యలు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ఈ సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కవ్వంపెల్లి అజయ్, జిల్లా నాయకులు సుంకరి, సంపత్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ



రామడుగు: మండలంలోని వెదిర జిల్లా పరిషత్ పాఠశాల వద్ద శుక్రవారం కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తున్న హనుమాన్ మాల స్వాములకు వెదిర హనుమాన్ స్వాములు పండ్లు పంపిణీ చేశారు.

రాజన్న గోశాలకు పశుగ్రాసం అందజేత



గడ్డి అందజేస్తున్న రైతు కొలగాని గణేశ్

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన కొలగాని గణేశ్ శుక్రవారం వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి గోశాలకు పశుగ్రాసం అందజేశారు. ట్రాక్టర్‌లో వరి గడ్డి కట్టలను తీసుకొని ఆలయానికి తీసుకెళ్లాడు.





'రోహిణి'లో.. రోళ్లు పగిలేలా...

రోహిణికార్తెలో భానుడు భగభగమండుతున్నాడు. సూర్యప్రతాపంతో మూడు రోజులుగా 44 డిగ్రీల సెల్సియస్ దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. వడగాలులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 9గంటలకే ఇళ్లకు చేరి సాయంత్రం 6గంటల తర్వాతనే బయటకు వెళ్తున్నారు. పొద్దంతా సూర్యుడి బగబగలు హీటెక్కిన వాతావరణం అర్ధరాత్రి వరకు కూడా తగ్గడం లేదు. దీంతో కరీంనగర్ రోడ్లు, మార్కెట్ ప్రాంతాలు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మరికొన్ని రోజులు సైతం ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

చింతకుంటలో కుక్కల బెడద

- బాలుడిపై కుక్క దాడి
- ముఖంపై తీవ్ర గాయాలు
- భయాందోళనలో గ్రామస్తులు



గాయపడి సొమ్మసిల్లిన త్రిలోక్

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంటలో కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. గుంపులు గుంపులుగా కుక్కలు వీధుల్లో తిరుగుతుండటంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. కుక్కలను నియంత్రించడంలో గ్రామ పంచాయతీ దృష్టి సారించకపోవడంతో గ్రామస్తుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీల్లో పాలన గాడి తప్పుతుండటం ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో కుక్కల స్వైర విహారం పెరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. శుక్రవారం ఉదయం చింతకుంటలోని బృందావన్‌నగర్‌లో త్రిలోక్ అనే బాలుడిపై కుక్క దాడి చేసింది. దీంతో బాలుడి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అంతేగాకుండా భయాందోళనలకు గురైన ఆ బాలుడు సొమ్మసిల్లిపోయాడు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు హుటాహుటిన కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స నిర్వహించిన వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో లేకపోవడంతో లాప్రోస్కోపిక్ సర్జరీ కోసం ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. దీంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో త్రిలోక్‌కు లాప్రోస్కోపిక్ సర్జరీ చేశారు. బాలుడు క్షేమంగానే ఉన్నట్లు తల్లిదండ్రులు తెలపడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఇకనైనా కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన అవగాహన సదస్సులు



మందులపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏఈవో

కరీంనగర్‌రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మే 25 నుంచి కరీంనగర్ మండలంలో నకిలీ విత్తనాలపై రైతులకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు మందులపల్లి, బహదూర్‌ఖాన్‌పేట, దుబ్బపల్లి గ్రామాల్లో ఏఈవోలు రైతులకు నకిలీ పత్తి విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈవో పైడితల్లి, ఆత్మ బీటీఎం శ్రీలత, ఏటీఎం రమ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

పేదలకు భూమి పంపిణీ చేయాలి

చిగురుమామిడి: చిగురుమామిడి శివారులోని పాంబండ వద్ద 840 సర్వే నంబర్‌లో 3.12 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని ఆ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల నరేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ ఈ. నరేందర్‌కు వినతిపత్రం అందించారు. రెవెన్యూ అధికారులు తక్షణం చర్యలు తీసుకోని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మండల ప్రచార కమిటీ బాధ్యులు జిల్లెల్ల సురేశ్, రమేశ్, నవీన్, నాగరాజు, సంతోష్, కొంకట హరీశ్ పలువురు ఉన్నారు.

పనుల పరిశీలన



శంకరపట్నం: కరీంపేట ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను శుక్రవారం ఎంపీడీఓ శ్రీవాణి పరిశీలించారు. మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వెంట ఎంఈఓ నర్సింహారెడ్డి, ఏఈ తిరుపతి, కార్యదర్శి నర్సయ్య ఉన్నారు.

మూడు సీట్లు... ముచ్చెమటలు!

జార్ఖండ్‌లో చివరి విడతలో నువ్వా నేనా ● బీజేపీకి ఇండియా కూటమి గట్టి పోటీ

సార్వత్రిక ఎన్నికల జాతర చివరి అంకానికొచ్చింది. జార్ఖండ్‌లో 14 లోక్‌సభ స్థానాలకు గాను 11 చోట్ల పోలింగ్ ముగిసింది. మిగతా మూడింటికి నేడు ఏడో విడతలో పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. ప్రధాని మోదీతో సహా బీజేపీ, కాంగ్రెస్ అగ్రనేతలంతా సుడిగాలి ప్రచారాలతో హోరెత్తించారు. ఈ మూడు సీట్లలో రెండు ఎస్టీ నియోజకవర్గాలు. వీటిలో 2 బీజేపీ, ఒకటి జేఎంఎం ఖాతాలో ఉన్నాయి. ఈ స్థానాలపై ఫోకస్...

\- సాక్షి, నేషనల్ డెస్క్

గొడ్డా.. బీజేపీ అడ్డా


✤ నిశికాంత్ దూబే

ఇది కమలనాథుల కంచుకోట. 1991లో మాత్రం జేఎంఎం నుంచి సూరజ్ మండల్ విజయం సాధించారు. కేంద్రంలో పీవీ నరసింహారావు సారథ్యంలోని కాంగ్రెస్ మైనారిటీ ప్రభుత్వానికి అనుకూలంగా పార్లమెంటులో ఓటేసేందుకు జేఎంఎం ఎంపీలు ముడుపులు తీసుకున్న వివాదంలో సూరజ్ మండల్ పేరు మార్మోగింది. కాంగ్రెస్ కూడా ఒక్క 2004లో మాత్రమే గెలిచింది. గత మూడు ఎన్నికల్లోనూ బీజేపీదే విజయం. హ్యాట్రిక్ కొట్టిన ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీ నిశికాంత్ దూబే మరోసారి బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో 4.5 లక్షల ఓట్లు సాధించిన జార్ఖండ్ వికాస్ మోర్చా (ప్రజాతాంత్రిక్) నేత ప్రదీప్ యాదవ్ కాంగ్రెస్‌లో చేరి పోటీ చేస్తున్నారు. బొగ్గు గనులకు ప్రసిద్ధి చెందిన ఈ నియోజకవర్గంలోని 6 అసెంబ్లీ స్థానాల్లో 3 కాంగ్రెస్, 2 బీజేపీ, ఒకటి జేఎంఎం చేతిలో ఉన్నాయి. ఈసారి బీజేపీ హవాకు ఎలాగైనా అడ్డుకట్ట వేయాలని ఇండియా కూటమి గట్టిగా ప్రయత్నిస్తుండటంతో ఇక్కడ పోటీ ఆసక్తి రేకెత్తిస్తోంది.

దుమ్కా... సోరెన్ ఫ్యామిలీ వార్


✤ సీతా సోరెన్

ఈ ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానం జార్ఖండ్ ముక్తి మోర్చా చీఫ్ శిబు సోరెన్ కంచుకోట. ఆయన 1980లో జేఎంఎం తరఫున ఇక్కడ తొలిసారి పాగా వేశారు. 1989 నుంచి మూడుసార్లు గెలిచినా, తర్వాత రెండు సార్లు బీజేపీ నేత బాబూలాల్ మరాండీ చేతిలో ఓటమి చవిచూశారు. మళ్లీ వరుసగా నాలుగు ఎన్నికల్లోనూ సోరెన్‌దే హవా. వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నళిన్ సోరెన్ ఈసారి జేఎంఎం తరఫున బరిలోకి దిగారు. బీజేపీ కూడా సిట్టింగ్ ఎంపీని కాదని శిబు సోరెన్ కోడలు సీతా సోరెన్‌కు టికెటిచ్చింది. ఆమె సోరెన్ పెద్ద కుమారుడు దివంగత దుర్గా సోరెన్ భార్య. మామ కంచుకోటలో కోడలే జేఎంఎంకు సవాలు విసురుతుండటంతో పోటీ రసవత్తరంగా మారింది. దుమ్కాలో 40 శాతం గిరిజనులు, 40 శాతం వెనకబడిన వర్గాలు, 20 శాతం ముస్లింలు ఉంటారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని 6 అసెంబ్లీ సెగ్మెంట్లలో 3 జేఎంఎం, 2 బీజేపీ, ఒకటి కాంగ్రెస్ ఖాతాలో ఉన్నాయి.

రాజ్‌మహల్... హోరాహోరీ


✤ విజయ్‌కుమార్ హన్స్‌డా

ఈ స్థానంపై కాంగ్రెస్ క్రమంగా పట్టు కోల్పోయింది. 1989లో తొలిసారి జేఎంఎం నెగ్గింది. అప్పట్నుంచి కాంగ్రెస్, బీజేపీ, జేఎంఎం మధ్య చేతులు మారుతూ వస్తోంది. గత రెండు ఎన్నికల్లోనూ విజయం జేఎంఎంనే వరించింది. 2019లో విజయ్‌కుమార్ హన్స్‌డా లక్ష ఓట్ల మెజారిటీతో బీజేపీ అభ్యర్థి హేమ్‌లాల్ ముర్ముపై వరుసగా రెండోసారి గెలిచారు. ఈసారి హ్యాట్రిక్‌పై గురి పెట్టారు. బీజేపీ ఈసారి రాజ్‌మహల్ లోక్‌సభ స్థానం పరిధిలోని బోరియో సిట్టింగ్ ఎమ్మెల్యే తాలా మరాండీని రంగంలోకి దించింది. సీపీఎం నుంచి గోపెన్ సోరెన్ కూడా తలపడుతున్నారు.

సుదీర్ఘ సార్వత్రిక ఎన్నికల సమరం తుది ఘట్టానికి చేరింది. చివరిదైన ఏడో విడతలో శనివారం పోలింగ్ జరుగుతున్న 57 లోక్‌సభ స్థానాల్లో ఐదు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ఆ హాట్ సీట్లపై ఫోకస్... - సాక్షి, నేషనల్ డెస్క్

ఏడో విడతలో 5 హాట్ సీట్లు



వారణాసి... మోదీ మేజిక్

కాశీ విశ్వేశ్వరుడు కొలువైన ఈ స్థానం నుంచి ప్రధాని నరేంద్ర మోదీ బరిలో ఉన్నారు. గత రెండు ఎన్నికల్లోనూ విజయఢంకా మోగించిన ఆయన ఈసారి హ్యాట్రిక్‌పై కన్నేశారు. 2014లో తొలిసారి ప్రధాని అభ్యర్థిగా ఇక్కడ ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై 3.7 లక్షలకు పైగా ఓట్లతో నెగ్గిన ఆయన 2019లో మెజారిటీని 4.8 లక్షల ఓట్లకు పెంచుకున్నారు. ఈసారి దాన్ని రికార్డు స్థాయికి పెంచడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్న పీసీసీ చీఫ్ అజయ్ రాయ్ ప్రధానిని ఏ మేరకు నిలువరిస్తారో చూడాలి. రాయ్ ఒకప్పుడు బీజేపీ నేతే కావడం విశేషం. బీఎస్పీ నుంచి అథర్ జమాల్ లారీ పోటీ చేస్తున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటైన వారణాసిలో 1991 నుంచి బీజేపీ పాతుకుపోయింది. 2004లో కాంగ్రెస్ గెలిచినా మళ్లీ 2009లో బీజేపీ దిగ్గజ నేత మురళీ మనోహర్ జోషి ఇక్కడ విజయం సాధించారు.

హమీర్‌పూర్.. అనురాగ్ విన్నింగ్ షాట్!

ఇది బీజేపీ కంచుకోట. 1989 నుంచి ఏకంగా 10సార్లు కాషాయ జెండా ఎగిరింది. రెండుసార్లు సీఎంగా పనిచేసిన ప్రేమ్‌కుమార్ ధుమాల్ ఇక్కడ మూడుసార్లు గెలిచారు. ఆ విజయ పరంపరను ధుమాల్ కుమారుడు, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ కొనసాగిస్తున్నారు. రాజ్‌పుత్ సామాజిక వర్గానికి చెందిన ఠాకూర్ 2019లో ఏకంగా 4 లక్షల ఓట్ల మెజారిటీ సాధించారు. అది ఆయనకు వరుసగా నాలుగో విజయం. కాంగ్రెస్ నుంచి సత్పాల్ రైజాదా రంగంలో ఉన్నారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసి, బీజేపీలో చేరిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటంతో ఆ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతుండటం తెలిసిందే. వాటిలో 4 స్థానాలు హమీర్‌పూర్ లోక్‌సభ స్థానం పరిధిలోనే ఉన్నాయి.

మండీ... కింగ్ వర్సెస్ క్వీన్

ఆరుసార్లు సీఎంగా చేసిన దివంగత కాంగ్రెస్ నేత వీరభద్రసింగ్ రాజ కుటుంబానికి ఈ స్థానం కంచుకోట. ఆయన, భార్య ప్రతిభా సింగ్ ఇద్దరూ ఇక్కడి నుంచి మూడేసిసార్లు గెలవడం విశేషం! 2014, 2019ల్లో బీజేపీ నేత రామ్ స్వరూప్ శర్మ గెలిచి కాంగ్రెస్ హవాకు అడ్డుకట్ట వేశారు. 2021లో ఆయన ఆత్మహత్య చేసుకోవడంతో జరిగిన ఉప ఎన్నికలో ప్రతిభా సింగ్ స్వల్ప మెజారిటీతో నెగ్గారు. ఈసారి బీజేపీ నుంచి ప్రముఖ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ బరిలోకి దిగారు. కాంగ్రెస్ నుంచి ప్రతిభకు బదులు ఆమె కుమారుడు విక్రమాదిత్యసింగ్ పోటీ చేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి అయిన ఆయన ఈసారి గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కంగన, విక్రమాదిత్య పోటాపోటీ ప్రచారంతో హోరెత్తించారు. కంగనా నాన్ లోకల్ అని, వరదలప్పుడు రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడలేదని కాంగ్రెస్ చేసిన ప్రచారం జనాల్లోకి బాగా వెళ్లింది.

డైమండ్ హార్బర్... అభిషేక్ హవా

ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోట. 2009 నుంచి తృణమూల్ అడ్డాగా మారింది. గత రెండు ఎన్నికల్లోనూ పార్టీ వారసునిగా చెబుతున్న సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ విజయం సాధించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి అయిన అభిషేక్‌కు బీజేపీ అభ్యర్థి అభిజిత్ దాస్ (బాబీ) గట్టి పోటీ నేపథ్యంలో ఈసారి విజయం ప్రతిష్టాత్మకంగా మారింది. అభిషేక్ హ్యాట్రిక్ కొడతారా, డైమండ్ హార్బర్‌పై కాషాయ జెండా ఎగురుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. సీపీఎం కూడా బరిలో ఉండటంతో త్రిముఖ పోటీ నెలకొంది.


పట్నా సాహిబ్... రవిశంకర్‌కు సవాల్

సిక్కుల పవిత్ర పుణ్యక్షేత్రమైన పట్నాసాహిబ్ పేరుతో 2008లో ఏర్పాటైన లోక్‌సభ స్థానం. 2009, 2014ల్లో బీజేపీ నుంచి నెగ్గిన బాలీవుడ్ షాట్‌గన్ శత్రుఘ్న సిన్హా 2019 ఎన్నికల ముందు కాంగ్రెస్ గూటికి చేశారు. దాంతో ఆయన్ను ఢీకొనేందుకు బీజేపీ సీనియర్ నేత రవి శంకర్ ప్రసాద్ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో దిగారు. 2019 ఎన్నికల్లో శత్రుఘ్నపై భారీ మెజారిటీతో నెగ్గారు. ఈసారి మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి అన్షుల్ అవిజిత్ నుంచి రవిశంకర్ ప్రసాద్‌కు గట్టి పోటీ ఎదురవుతోంది. అన్షుల్ లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ తనయుడు. కాంగ్రెస్‌తో పాటు దాని భాగస్వామి ఆర్జేడీకి కూడా ఇక్కడ గట్టి ఓటు బ్యాంకుంది. దాంతో ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడం బీజేపీకి కఠిన పరీక్షగా మారింది.

ఫరీద్‌కోట్... బహుముఖ పోటీ

● ప్రధాన అభ్యర్థులకు రైతుల నుంచి సెగ
● బరిలో ఇందిరా హంతకుని కుమారుడు

ఎలకం


● హన్స్‌రాజ్ హన్స్


● సరబ్‌జీత్ సింగ్ ఖల్సా

పంజాబ్‌లోని ఫరీద్‌కోట్ లోక్‌సభ స్థానంలో బహుముఖ పోటీ నెలకొంది. బీజేపీ నుంచి ప్రముఖ గాయకుడు హన్స్‌రాజ్ హన్స్, ఆప్ నుంచి నట గాయకుడు కరంజీత్ అన్మోల్ బరిలో ఉన్నారు. అకాలీదళ్, కాంగ్రెస్‌లకు తోడు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హంతకుల్లో ఒకరైన బియాంత్‌సింగ్ కుమారుడు సరబ్‌జీత్ సింగ్ ఖల్సా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి గట్టి పోటీయే ఇస్తున్నారు. దాంతో శనివారం చివరిదైన ఏడో విడతలో పోలింగ్ జరిగే స్థానాల్లో ఫరీద్‌కోట్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

కాంగ్రెస్‌కు కష్టాలు..

ఫరీద్‌కోట్ కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం. పంజాబీ జానపద గాయకుడు మహ్మద్ సాదిక్ 2019లో గెలుపొందారు. ఈసారి ఆయన్ను కాదని అమర్‌జీత్ కౌర్ సాహోక్‌కు టికెటిచ్చింది. స్థానికురాలైన సాహోక్ దాన్నే ప్రధాన బలంగా మార్చుకుని ప్రచారం చేశారు. కానీ పార్టీలోనే తీవ్రమైన వ్యతిరేకత ఉండటం ఆమెకు మైనస్‌గా మారింది. సీనియర్ నేతలు ప్రచారానికి పూర్తిగా దూరంగా ఉన్నారు. దాంతో సాహోక్‌కు మద్దతుగా కాంగ్రెస్ ఒక్క పెద్ద ర్యాలీ కూడా నిర్వహించలేకపోయింది! ఆప్ అభ్యర్థి అన్మోల్ సీఎం భగవంత్ మాన్‌కు సన్నిహితుడు. తన స్టార్‌డమ్, మాన్ ప్రభుత్వ పనితీరు తనను గెలిపిస్తాయనే ధీమాతో ఉన్నారు. పంజాబీ నటులు, గాయకులు అన్మోల్‌కు మద్దతుగా జోరుగా ప్రచారం చేశారు. ఇక 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ విజయానికి కారణమైన సిక్కు సంస్థలు ఈసారి ఇండిపెండెంట్ సరబ్‌జీత్ సింగ్ ఖల్సాకు దన్నుగా నిలిచాయి.

బీజేపీకి చుక్కలు...

గత ఎన్నికల్లో ఢిల్లీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన బీజేపీ అభ్యర్థి హన్స్‌రాజ్ హన్స్ ఫరీద్‌కోట్కు పూర్తిగా కొత్త. ప్రచారం పొడవునా రైతు సంఘాల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొన్నారు. దానికి తోడు రైతులకు వ్యతిరేకంగా ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు బీజేపీని మరింత ఇరుకున పెట్టాయి. ప్రచారంలో పాటలు పాడుతూ ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అకాలీదళ్ కూడా ఈసారి ఎలాగైనా నెగ్గాలని పట్టుదలగా ఉంది. ఆ పార్టీ అభ్యర్థి రాజ్విందర్ సింగ్ మాజీ ఎమ్మెల్యే శీతల్ సింగ్ కుమారుడు, మాజీ మంత్రి గురుదేవ్ బాదల్ మనవడు. 2015లో ఆప్‌లో చేరిన ఆయన 2017 అసెంబ్లీ ఎన్నికల ముందు మళ్లీ అకాలీదళ్‌కు తిరిగొచ్చారు. తన కుటుంబ రాజకీయ వారసత్వాన్నే నమ్ముకున్నారు. ఫరీద్‌కోట్‌కు తన కుటుంబం ఎంతో సేవ చేసిందంటూ ప్రచారం చేశారు. దళిత ప్రాబల్యమున్న ఫరీద్‌కోట్‌లో బీఎస్పీ పోటీ ప్రధాన పార్టీల అవకాశాలను దెబ్బ తీసేలా ఉంది.

సూఫీల ఇలాకా...

రాజ నగరంగా ప్రసిద్ధి చెందిన ఫరీద్‌కోట్ సూఫీ సాధువుల అడ్డా. బాబా ఫరీద్ నగరం అని కూడా అంటారు. ఈ లోక్‌సభ స్థానం 1977లో ఏర్పాటైంది. ఒకప్పుడు అకాలీదళ్‌కి కంచుకోట. 2014లో ఆప్, 2019 కాంగ్రెస్ గెలిచాయి. దీని పరిధిలోని తొమ్మిది అసెంబ్లీ సీట్లూ ఆప్ చేతిలోనే ఉండటం ఆ పార్టీకి కాస్త కలిసొచ్చే అంశం. ఒక్క అభ్యర్థి కూడా నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడలేదన్నది స్థానికుల ఆరోపణ. డ్రగ్స్, అభివృద్ధి లేమి ఇక్కడి ప్రధాన సమస్యలు. దీనికి తోడు రైతు ఆందోళనల ప్రకంపనలు ఈసారి అందరు అభ్యర్థులనూ తాకాయి!

\- సాక్షి, న్యూఢిల్లీ

నేడు రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్

● ముగిసిన విదేశీ పర్యటన



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన విదేశీ పర్యటన ముగించుకొని నేడు రాష్ట్రానికి చేరుకోనున్నారు. మే 17వ తేదీన కుటుంబసభ్యులతో కలిసి సీఎం జగన్ లండన్‌కు బయలుదేరి వెళ్లారు. విదేశీ పర్యటన ముగించుకొని శుక్రవారం సాయంత్రం సీఎం జగన్ లండన్ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. శనివారం తెల్లవారుజామున ఆయన తాడేపల్లిలోని ఇంటికి చేరుకోనున్నారు.

రూ.45.81 కోట్ల జీఎస్టీ స్కాం

జీఎస్టీ నుంచి రిఫండ్ పేరిట దందా

● కేవలం 9 నిమిషాల్లో రూ.2.86 కోట్లు రిఫండ్ కావడంతో కొత్తగా వచ్చిన అధికారికి అనుమానం ● తీగ లాగితే కదిలిన డొంక..
● ఢిల్లీ ట్యాక్స్ కన్సల్టెంట్‌తో ఆరుగురు జీఎస్టీ అధికారుల కుమ్మక్కు
● సీసీఎస్ అధికారుల దర్యాప్తులో వెలుగులోకి కీలకాంశాలు

సాక్షి, హైదరాబాద్: 'మాదాపూర్ కేంద్రంగా పని చేసిన ఓ సంస్థ తమ చిరునామాను నల్లగొండకు మారుస్తూ ఉదయం దరఖాస్తు చేసుకుంది. జీఎస్టీ అధికారులు మధ్యాహ్నానికి ఆ ప్రక్రియ పూర్తి చేసేశారు... సాయంత్రం తమకు రావాల్సిన రూ.2.86 కోట్ల రిఫండ్ ఇవ్వాల్సిందిగా సదరు సంస్థ నుంచి అభ్యర్థన వచ్చింది... సరిగ్గా తొమ్మిది నిమిషాల్లో ఆ మొత్తం వారి ఖాతాల్లోకి రిఫండ్ అయింది.' నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) అధికారులు దర్యాప్తు చేస్తున్న జీఎస్టీ స్కామ్‌లో వెలుగులోకి వచ్చిన కీలకాంశాలు ఇవి. ఈ లావాదేవీలో కీలక నిందితుడిగా ఉన్న మాదాపూర్ సర్కిల్–2 డీఎస్టీఓ వి.వెంకట రమణను తాము గతంలో అరెస్టు చేశామని, ఈయన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించిందని డీసీపీ ఎన్.శ్వేత శుక్ర వారం వెల్లడించారు. ఈ స్కాంకు సంబంధించి నమోదైన ఏడు కేసులను ప్రస్తుతం సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ స్కాంలో ఎవరెవరు ఉన్నారంటే..

ఎలక్ట్రికల్ బైక్స్ విక్రయ సందర్భంలో చెల్లించాల్సిన జీఎస్టీలో కేంద్ర ప్రభుత్వం అనేక రాయితీలు ఇస్తోంది. ఇవన్నీ రిఫండ్ రూపంలో వారికి చేరతాయి. దీన్ని ఆసరాగా చేసుకున్న ఢిల్లీకి చెందిన ట్యాక్స్ కన్సల్టెంట్ చిరాగ్ శర్మ భారీ స్కాంకు తెరలేపారు. వ్యాపారి రాజా రమేష్‌రెడ్డి బంధువైన ఎన్నారై తెలంగాణ, ఏపీల్లో ఈ బైక్‌లు తయారు చేసి విక్రయిస్తుంటారు. ఈయనకు జీఎస్టీ నుంచి రిఫండ్ రూపంలో రూ. 5 కోట్లు రావాల్సి ఉంది. ఈ మొత్తం ఇప్పించేందుకు ఒప్పందం చేసుకున్న చిరాగ్ శర్మ జీఎస్టీ అధికారులకు కమీషన్లు ఇచ్చి పని పూర్తి చేశాడు. ఇలా ఆయా అధికారులకు, చిరాగ్ శర్మకు మధ్య సంబంధాలు ఏర్పడ్డాయి. నల్లగొండ డివిజన్ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ స్వర్ణ కుమార్, అబిడ్స్ సర్కిల్ స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.వేణుగోపాల్, మాదాపూర్–1 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ పాదిల విశ్వకిరణ్, మాదాపూర్ సర్కిల్–2 డిప్యూటీ స్టేట్ జీఎస్టీ ఆఫీసర్ వేమవరపు వెంకట రమణ, మాదాపూర్ సర్కిల్–3 అసిస్టెంట్ కమిషనర్ మర్రి మహితలు చిరాగ్ శర్మ టీమ్‌తో చేతులు కలిపి ఈ జీఎస్టీ స్కాంకు సహకరించారు.

భారీ స్కాం ఎలా చేశారంటే..

కొత్త పేర్లతో కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించిన చిరాగ్ శర్మ ఆయా అధికారులు పనిచేస్తున్న చోటనే జీఎస్టీ నెంబర్లు తీసుకున్నాడు. రిఫండ్స్ కూడా అక్కడే ఫైల్ చేస్తూ దందా నిర్వహించాడు. కొన్నాళ్ల క్రితం ఓ అధికారి హైదరాబాద్ నుంచి నల్లగొండకు బదిలీ అయ్యారు. దీంతో రిఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న ఫైల్ పెండింగ్‌లో ఉండిపోయింది. కొత్త అధికారి ఈ బైక్ వ్యాపారానికి సంబంధించి సందేహాలు లేవనెత్తడంతో ఆ అధికారికి తెలియకుండా తమ కంపెనీ చిరునామాను నల్లగొండకు మార్చాలని చిరాగ్ శర్మ పథకం వేశాడు. అలా చేయడంతో అక్కడకు బదిలీ అయిన తమ అధికారి ద్వారా పని పూర్తి చేయించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు చిరాగ్ శర్మ ద్వారా గ్రోమోర్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ చిరునామాను నల్లగొండకు మార్చాల్సిందిగా మాదాపూర్ సర్కిల్ 2 డీఎస్‌టీఓ వెంకట రమణకు 2021 సెప్టెంబర్ 6న దరఖాస్తు చేశారు. నిబంధనల ప్రకారం ఆయన ఈ విషయాన్ని కొత్తగా వచ్చిన అధికారికి తెలిపి, ఆయన అనుమతి తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. అయితే చిరాగ్ శర్మతో ఉన్న ఒప్పందం నేపథ్యంలో ఆయన బదిలీ ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో అదే రోజు మధ్యాహ్నం 2.01 గంటలకు నల్లగొండ చిరునామాతో గ్రోమోర్ సంస్థ జీఎస్టీ రిఫండ్ కోరుతూ దరఖాస్తు చేసింది. వీటిని పరిశీలించిన నల్లగొండ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ స్వర్ణకుమార్ సాయంత్రం 6.24 గంటలకు క్లియర్ చేశారు. సాయంత్రం 6.33 గంటలకు రూ.2,86,81,400 రిఫండ్ రూపంలో గ్రోమోర్ సంస్థ ఖాతాలోకి వచ్చేశాయి. మరో రూ.3 కోట్లనూ ఇదే రూపంలో తీసుకున్న రెండు రోజుల్లోనే ఆయా కంపెనీల చిరునామాలన్నీ హైదరాబాద్‌కు తిరిగి బదిలీ అయ్యాయి.

డబ్బులు పోక రాకలపై అనుమానం వచ్చి..

డబ్బులు 'పోక-రాక'లపై అనుమానం ఇచ్చిన కొత్త అధి కారి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. వాళ్ల అంతర్గత విచారణలో రూ.45.81 కోట్ల కుంభకోణం వెలుగు లోకి రావడంతో సీసీఎస్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి పరారీలో ఉన్న మిగిలిన నిందితు లను అరెస్టు చేయడానికి అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.

ఇది ఈసీ వివక్షే

పేరు, హోదా వివరాలు, సీలు లేకపోతే పోస్టల్ బ్యాలెట్ ఎలా చెల్లుతుంది?

ఎన్నికల కమిషన్ ఇచ్చిన తాజా ఉత్తర్వులు విస్మయకరం, అన్యాయం

హైకోర్టుకు నివేదించిన వైఎస్సార్‌సీపీ సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, వీరారెడ్డి

సాక్షి, అమరావతి: పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫాంపై అటెస్టింగ్ అధికారి సంతకం మాత్రమే ఉండి.. పేరు, హోదా వివరాలు, సీలు లేకపోయినా ఆ పోస్టల్ బ్యాలెట్‌లను ఆమోదించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం గురువారం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్ణయం వెలువరిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం ఎన్నికల సంఘం గురువారం జారీ చేసిన ఉత్తర్వులను చట్ట విరుద్ధంగా ప్రకటించి, ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఆ ఉత్తర్వుల అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలంటూ ఓ అనుబంధ పిటిషన్ కూడా దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై అత్యవసరంగా హౌస్ మోషన్ రూపంలో విచారణ జరపాలని కోరుతూ పిటిషనర్ తరఫు న్యాయవాది సన్నపురెడ్డి వివేక్ చంద్రశేఖర్ హైకోర్టు రిజిస్ట్రీని కోరారు. దీంతో రిజిస్ట్రీ ఈ కేసు ఫైల్‌ను ప్రధాన న్యాయమూర్తి (సీజే) ముందు ఉంచింది. దానిని పరిశీలించిన ఆయన హౌస్ మోషన్ రూపంలో అత్యవసర విచారణకు అనుమతి మంజూరు చేశారు. దీంతో జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ విజయ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది.



దేశ వ్యాప్తంగా కాకుండా ఏపీలో మాత్రమే అమలు చేస్తారా?

వైఎస్సార్‌సీపీ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, హైకోర్టు సీనియర్ న్యాయవాది పాపెల్లుగారి వీరారెడ్డి, న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ వాదనలు వినిపించారు. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫాంపై అటెస్టింగ్ అధికారి సంతకం మాత్రమే ఉండి.. పేరు, హోదా వివరాలు, సీలు లేకపోయినా కూడా ఆ పోస్టల్ బ్యాలెట్‌లను ఆమోదించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులు వివక్షాపూరితమని సింఘ్వీ తెలిపారు. ఈ ఉత్తర్వులు చాలా కొత్తగా ఉన్నాయన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఉత్తర్వులను దేశంలో ఇతర ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయడం లేదని, కేవలం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే అమలు చేస్తోందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు దేశం మొత్తానికి వర్తిస్తాయని, కానీ విస్మయకరంగా తాజా ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే వర్తింపచేస్తోందని వివరించారు. ఇంత కన్నా అన్యాయం ఏమీ ఉండద న్నారు. తాజా ఉత్తర్వులు ఎన్నికల కమిషన్ స్వీయ నిబంధనలకు విరుద్ధమన్నారు. లేఖలు, సర్కులర్లు, మెమోల ద్వారా చట్టబద్ధ నిబంధనలను మార్చలేరన్నారు. అది పార్లమెంట్ పని అని తెలిపారు. పార్లమెంట్‌లో ఎలాంటి సవరణ చేయకుండా తాజా ఉత్తర్వులు తీసుకురావడానికి వీల్లేదని, అందువల్ల అవి ఎంత మాత్రం చెల్లుబాటు కావని ఆయన స్పష్టం చేశారు.

కౌంటింగ్‌కు నాలుగు రోజుల ముందు ఎందుకిలా?

రాష్ట్రంలో 5.39 లక్షల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ అయ్యాయని, ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ఇవి సరిపోతాయని సింఘ్వీ అన్నారు. ఎన్నికల నిర్వహణ నిబంధనల్లో రూల్స్ 27ఎఫ్, 54ఏ, 13 ఏ లకు విరుద్ధంగా ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వులు అమల్లోకి తెచ్చిందన్నారు. అటెస్టేటింగ్ అధికారి పేరు, హోదా వివరాలు లేకుండా ఆ పోస్టల్ బ్యాలెట్‌ను ఎవరో ధృవీకరించారో తెలియదని, దీని వల్ల అక్రమాలకు ఆస్కారం ఉంటుందన్నారు. అసలు పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫాంపై ఎవరైనా సంతకం చేయవచ్చన్నారు. తప్పుడు, నకిలీ ఓట్లను కూడా ఆమోదించేందుకు తాజా ఉత్తర్వులు అవకాశం కల్పిస్తున్నాయని తెలిపారు. ఎప్పుడో ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయితే, ఇప్పుడు కౌంటింగ్‌కు నాలుగు రోజుల సమయం మాత్రమే ఉండగా, కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ఈ తాజా ఉత్తర్వుల వల్ల నష్టం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ తీరు సందేహాస్పదంగా ఉందని తెలిపారు. ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్ ఇలాంటి ఉత్తర్వుల ద్వారా నిష్పాక్షికతకు అర్థం లేకుండా చేస్తోందన్నారు. ఏకపక్షంగా జారీ చేసిన ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని ఆయన కోర్టును కోరారు. ఎన్నికల ఫలితాలపై అభ్యంతరం ఉంటేనే ఎన్నికల పిటిషన్ (ఈపీ) దాఖలు చేసుకోవాల్సి ఉంటుందని, కానీ ఇక్కడ ఆ పరిస్థితి కాదని, అందువల్ల తమ వ్యాజ్యానికి విచారణార్హత ఉందని వివరించారు.

పరిధి దాటి వ్యవహరిస్తున్న ఎన్నికల సంఘం

సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమేనన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘమే చెబుతోందని, అలాంటిది 5.39 లక్షల ఓట్ల విషయంలో మాత్రం బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో తమ ఆందోళనను గానీ, తామిచ్చిన వినతి పత్రాన్ని గానీ ఎన్నికల సంఘం కనీస స్థాయిలో కూడా పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. తాము హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన తర్వాత హడావుడిగా తాజా ఉత్తర్వులిచ్చిందన్నారు. అతి కొద్ది రోజుల్లో కౌంటింగ్ జరగ బోతుండగా, ఇప్పటికిప్పుడు ఈ ఉత్తర్వులను తీసుకురావాల్సిన అవసరం ఏముందో ఎన్ని కల సంఘం చెప్పడం లేదన్నారు. ఎన్నికల సంఘం చర్యల్లో నిజాయితీ ఉండి ఉంటే, ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే ఈ ఉత్తర్వులు అమల్లోకి తెచ్చి ఉండేదని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివాదంపై ఎన్నికల పిటిషన్లు వేయాలంటే 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజక వర్గాల్లో దాఖలు చేయాల్సి ఉంటుందని, ఇది ఆచరణ సాధ్యం కాదన్నారు. ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా తన పరిధి దాటి వ్యవహరించిందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో గత ఏడాది జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని, బ్యాలెట్ ఫాంపై పేరు, హోదా వివరాలు, సీలు లేకుంటే ఆ ఓటును తిరస్కరించాల్సిందేనన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియ సాగుతున్నప్పుడు అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని వీరారెడ్డి తెలిపారు.

కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల విధుల్లో ఉండి ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులకే తమ తాజా ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద అటెస్టేటింగ్ అధికారిని సంబంధిత రిటర్నింగ్ అధికారే నియమిస్తారని.. అందువల్ల డిక్లరేషన్ ఫాంపై ఆ అధికారి సంతకం ఉంటే చాలని చెప్పారు. పేరు, హోదా వివరాలు, సీలు ఉండాల్సిన అవసరం లేదని తెలిపారు. ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను మొత్తం నిబంధనలకు అనుగుణంగా వీడియోగ్రఫీ చేశారని చెప్పారు. ఈ

తాజా ఉత్తర్వులు ఆ ఉద్యోగులకే వర్తింపు

మొత్తం వ్యవహారంలో పిటిషనర్ అనవసరంగా ఆందోళన చెందుతున్నారన్నారు. ఎన్నికల ప్రక్రియను సవాలు చేయడానికి వీల్లేదని, ఒకవేళ పిటిషన్లు దాఖలు చేసినా అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని తెలిపారు. పిటిషనర్ పరోక్షంగా ఎన్నికల ఫలితాల గురించే మాట్లాడుతున్నారని, అందువల్ల వారు ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. ఎన్నికల ఫలితాల వ్యవహారంలో ఈపీ దాఖలు చేసుకోవాలన్న వాదన సరైందేనని, అయితే పిటిషనర్ తన వ్యాజ్యంలో లేవనెత్తిన అంశాలు పూర్తిగా వేరని వ్యాఖ్యానించింది. ఇదేమీ వ్యక్తిగత కేసు కాదని స్పష్టం చేసింది. అనంతరం వైఎస్సార్‌సీపీ వ్యాజ్యంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాది పదిరి రవితేజ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా వారు ఎన్నికల నిర్వహణ నిబంధనలను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన ఉత్తర్వులు సబబేనన్నారు. అందరి వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు తెలిపింది. శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్ణయాన్ని వెలువరిస్తామంది.



జయంతి చౌహాన్

మహిళలు ఇంటి బాధ్యతలను
సమర్థంగా నిర్వహించగలరు.
అంతకన్నా సమర్థతంగా
తమ సత్తా ఏంటో నిరూపించగలరు.
అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ
తండ్రి అమ్మాలనుకున్న కంపెనీ బాధ్యతలను చేపట్టి
కార్పొరేట్ దిగ్గజాలకు దీటుగా ఏడు వేల కోట్ల
రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని
నిలబెట్టిన మహిళ జయంతి చౌహాన్.
ఎవరీమే..? అనేవారికి
ఆమె ప్రతిభే ఆమెను పరిచయం చేస్తుంది.

బాధ్యతను సవాల్‌గా తీసుకుంది

రెండేళ్ల క్రితం వరకు జయంతి చౌహాన్ తనకు నచ్చిన రంగమైన ఆర్కిటెక్చర్‌కు సంబంధించిన ఓ అంతర్జాతీయ కంపెనీని విజయవంతంగా నడిపిస్తూ ఉండేది. ఆమె తండ్రి భారతీయ బహుళజాతి కంపెనీ అయిన బిస్లరీకి రమేష్ చౌహాన్ చైర్మన్. కూతురిని మొదట ఈ వ్యాపార రంగంలోకి రమ్మని అడిగాడు. కానీ, వ్యాపార రంగంలో ఆసక్తి లేక ఆమె నిరాకరించింది. రమేష్ చౌహాన్ వయసు పై బడుతుండటం, ఎవరి మద్దతూ లేకపోవడంతో కంపెనీని అమ్మాలని పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీల యజమానులతో చర్చలు జరిపారు. 2022లో చేసిన చర్చలు సఫలం అయ్యాయి. కానీ, డీల్ అమలు కాలేదు. ఆ సమయంలో జయంతి చౌహాన్ తన తండ్రి కంపెనీకి నాయకత్వం వహించడానికి ముందుకు వచ్చింది. బిస్లరీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కంపెనీలో పెద్ద మార్పు కనిపించింది.

ఫ్యాషన్ ఐకాన్


ఢిల్లీ, ముంబయ్ నగరాలలో జయంతి బాల్యం గడిచింది. ఆ తర్వాత ఫ్యాషన్ రంగం అంటే ఉన్న ఇష్టంతో ఆమె అమెరికాలోని లాస్ ఏంజిల్స్ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ నుంచి స్టైలింగ్‌లో పట్టా పొందింది. లండన్ కాలేజ్ ఆఫ్ ఫ్యాషన్‌లో ఫొటోగ్రఫీ, ఫ్యాషన్ స్టైలింగ్‌లో తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంది. తనదైన స్టైల్ మార్క్‌తో ఫ్యాషన్ ఐకాన్‌గా గుర్తింపు పొందింది. స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ నుంచి అరబిక్‌లో బిఏ కూడా చేసింది.

కొత్త పానీయాల పరిచయం

బిస్లరీ కంపెనీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తనదైన మార్క్‌ను చూపింది. వాటర్ కంపెనీ నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్‌ను పరిచయం చేసింది. ఈ కొత్త ఉత్పత్తులు సంస్థకు మరింత లాభదాయకంగా మారాయి. డిజిటల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రచారం కూడా ఉత్పత్తి వృద్ధిని పెంచింది. శీతల పానీయాల పరిశ్రమలోని దిగ్గజ కంపెనీలకు బిస్లరీ ప్రవేశం ఓ సవాల్‌గా మారుతుందని మార్కెట్ నిపుణులు భావించేంతగా కృషి జరిగింది. దీంతో టాటా గ్రూప్‌తో డీల్ కుదిరి, మినరల్ వాటర్ బ్రాండ్‌లలో పెట్టుబడులు పెట్టింది. ఇతర కార్పొరేట్ కంపెనీలతో జయంతి చౌహాన్‌కు చెందిన బిస్లరీ ఇంటర్నేషనల్ పోటీ పడుతోంది. జయంతి తన 42 ఏళ్ల వయసులో వైస్ చైర్‌పర్సన్ హోదాతో కంపెనీని దిగ్విజయంగా నడిపిస్తోంది. సేల్స్, మార్కెటింగ్ బృందానికి కూడా నాయకత్వం వహిస్తోంది. వ్యాపార రంగంలో తన నైపుణ్యాలను చూపలేనేమో అని సందేహించి తొలుత వెనకడుగు వేసినా, తండ్రి మీద ప్రేమతో తీసుకున్న బాధ్యతను మరింత దిగ్విజయంగా నడిపిస్తూ కార్పొరేట్ దిగ్గజాలకే ఔరా అనిపిస్తోంది. 'సమస్య మనదే, సవాల్ కూడా మనదే' అని నవ్వుతూ సమాధానమిచ్చే జయంతి లాంటి వ్యక్తులు ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తారు.

బ్యూటిప్స్

మృదువైన చేతులు.. పాదాల కోసం...



- టేబుల్ స్పూన్ శనగపిండిలో చిటికెడు పసుపు వేసి అందులో తగిన మోతాదులో పాలు లేదా పెరుగు వేసి మరీ గట్టిగా కాకుండా జారుడుగా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ని చేతులకు, పాదాలకు పట్టించి పదిహేను – ఇరవై నిమిషాల పాటు ఉంచాలి. ఆ తరవాత వేళ్లతో వలయాకారంగా మర్దన చేస్తూ చర్మం నుంచి శనగపిండి ప్యాక్‌ను వదిలించిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే చేతులు, పాదాల చర్మం మదువుగా మారుతుంది.
- చేతులు, పాదాల చర్మం గరుకుగా మారినప్పుడు... టీ స్పూన్ నిమ్మరసంలో టీ స్పూన్ చక్కెర కలిపి (చక్కెర పూర్తిగా కరగాల్సిన అవసరం లేదు. గరుకుగానే ఉండాలి), ఆ మిశ్రమాన్ని చేతులకు, పాదాలు పట్టించి పది నిమిషాల తర్వాత వేళ్లతో మర్దన చేయాలి. ఇలా చేస్తే మతకణాలు తొలగిపోతాయి, చేతులు, పాదాల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. పొడి చర్మం వాళ్లు ఈ ప్యాక్‌లో నాలుగు చుక్కల కొబ్బరి నూనె లేదా బాదం నూనె కలుపుకోవాలి.
- రెండు స్పూన్‌ల నిమ్మరసం లేదా కమలాపండు రసంలో టీ స్పూన్ తేనె, టీ స్పూన్ గ్లిజరిన్, టీ స్పూన్ పన్నీరు కలిపి ఈ మిశ్రమాన్ని చేతులకు, పాదాలకు పట్టించాలి. ఇది రెగ్యులర్ ప్యాక్. చలికాలంలో రోజూ వేసుకోవచ్చు. ఎండాకాలంలో వారంలో రెండుసార్లు సరిపోతుంది.
- చేతి వేళ్లు, పాదాలు ఆకర్షణీయంగా కనిపించాలంటే... కలబంద గుజ్జులో రెండు చుక్కల బాదం నూనె లేదా గ్లిజరిన్ కలిపి రాత్రి పడుకునే ముందు చేతులకు, పాదాలకు రాసుకోవాలి. అలాగే టీ స్పూన్ టొమాటో రసం, అదే మోతాదులో గ్లిజరిన్, నిమ్మ రసం కలిపి రాసినా కూడా మంచి ఫలితం ఉంటుంది.

సమ్‌థింగ్ స్పెషల్

నీలిరంగు చీరలోన జపాన్‌లో ఒక సందమామ



'రోమ్‌లో రోమన్‌లా ఉండాలి' అంటారు కొందరు. 'అయినా సరే, నేను నాలాగే ఉంటాను' అంటారు కొందరు. రెండో కోవకు చెందిన డిజిటల్ క్రియేటర్, ఎంటర్‌ప్రెన్యూర్ మహిశర్మ వీడియో వైరల్ అయింది. గోల్డెన్ బార్డర్స్ బ్లూ శారీ ధరించి జపాన్‌లోని టోక్యో వీధుల్లో చిద్విలాసంగా నడుస్తున్న ఆమె వీడియో ప్రపంచవ్యాప్తంగా వ్యూయర్స్ దృష్టిని ఆకర్షించింది. 'ఐ వోర్ ఏ శారీ ఇన్ జపాన్ రియాక్షన్స్ ఆర్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియో ఏడు మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది. వీడియోలో ఆబాలగోపాలం మహిశర్మను ఆశ్చర్యంగా చూస్తున్న, సెల్ఫీలు తీసుకుంటున్న దృశ్యాలు కనిపిస్తాయి.

విడాకుల మహోత్సవం



'మా అమ్మాయి పెళ్లి' అని చెప్పడానికి సంతోషించే తల్లిదండ్రులు విడాకుల విషయం చెప్పడానికి మాత్రం ఇబ్బంది పడతారు. అయితే ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి అనిల్ కుమార్ మాత్రం 'నరక ప్రాయమైన సంసారం కంటే విడాకులే సో బెటర్' అంటున్నాడు.

అనిల్ అల్లుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అత్తింటి వాళ్ల అదనపు కట్నం కోసం రకరకాల బాధలకు గురి చేస్తుంటే తట్టుకోలేక అనిల్ కుమార్తె ఉర్వీ భర్త నుంచి విడాకులు తీసుకుంది. బ్యాండ్ బాజాలతో నిర్వహించిన ఉర్వీ విడాకుల మహోత్సవం వీడియో సామాజిక మాధ్యమాల్లో అందరి దృష్టిని ఆకర్షించింది.

ఓన్లీ ఉమెన్

వ్యాపారానికి సామాజిక బాధ్యత తోడైతే ఎలా ఉంటుందో చెప్పకనే చెబుతుంది చెన్నైకి చెందిన పంప్‌కిన్ టేల్స్. ఆల్-ఉమెన్ టీమ్ రెస్టారెంట్‌గా ప్రత్యేకతను సాధించిన 'పంప్‌కిన్ టేల్స్' అమ్మాయిలలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించే బడి. చల్లగా చూసే అమ్మ ఒడి. 'పంప్‌కిన్ ఉపాధి ఇవ్వడమే కాదు. ఉత్సాహాన్ని ఇస్తుంది. కొత్త విషయాలు ఎన్నో నేర్చుకునేలా సహాయపడుతుంది' అంటారు ఉద్యోగులు.

వీరి వీరి గుమ్మడి విజయానికి చూపే దారి ఇది



భువనేశ్వరి, రాజేశ్వరి, చింది వరదరాజులు

ఉద్యోగం కోసం తాను ఉంటున్న డార్జిలింగ్ నుంచి గోవాకు వెళ్లాలనుకున్న అనూష మింజ్ విధివశాత్తు చెన్నైకి వచ్చింది. అక్కడి వాతావరణం ఆమెకు బాగా నచ్చింది.

'నా కొలీగ్స్‌తో ఎన్నో విషయాలు చర్చించే అవకాశం దొరికింది' అంటుంది అనూష.

'మహిళలు కేఫ్‌లను నిర్వహించలేరు'లాంటి అపోహలకు అడ్డుకట్ట వేయడం కోసం చింది వరదరాజులు, జె.భువనేశ్వరి, ఆర్. రాజేశ్వరి అనే మహిళలు 2017లో 'పంప్‌కిన్ టేల్స్'ను ప్రారంభించారు. రెస్టారెంట్, బేకరి, కేటరింగ్ విభాగాల్లో మంచి పేరు తెచ్చుకుంది... పంప్‌కిన్ టేల్స్.

టేబుల్స్‌ను సెట్ చేయడం నుంచి కస్టమర్‌లతో ఇంటరాక్ట్ కావడం, ఆర్డర్లు తీసుకోవడం, టేక్ అవేలను రెడీ చేయడం వరకు ఎన్నో పనులు చేస్తుంది ఈ ఆల్-ఉమెన్ టీమ్.

'ఉద్యోగంలో చేరే సమయంలో రెస్టారెంట్‌లో పనికి సంబంధించి వారిలో ప్రాథమిక జ్ఞానం ఉంటుంది. ఆ తరువాత టేబుల్ సెట్ చేయడం నుంచి కమ్యూనికేషన్స్ స్కిల్స్ మెరుగుపరుచుకోవడం వరకు ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. ఆ వెంటనే వారిలో ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది' అంటారు కంపెనీ డైరెక్టర్లు భువనేశ్వరీ, రాజేశ్వరి.

ఉదాహరణకు 'పంప్‌కిన్' వందమందికి పైగా మహిళల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోంది. రెస్టారెంట్ ప్రారంభమైనప్పుడు షిల్లాంగ్‌కు చెందిన మోనిక వెయిటర్‌గా చేరింది. ఇప్పుడు ఆమె రెస్టారెంట్‌కు సంబంధించిన సమస్త విషయాలలో ప్రావీణ్యం సాధించింది.

'ఎవరి మీదా ఆధారపడకుండా సొంత కాళ్ల మీద నిలబడుతున్నందుకు గర్వంగా ఉంది. మా అమ్మాయి చెన్నైలో పనిచేస్తోంది. నెల నెలా నాకు డబ్బులు పంపిస్తుంది అని నా గురించి అమ్మ గర్వంగా చెప్పుకుంటుంది' అంటుంది మోనిక.

మోనిక ఏదో ఒకరోజు ఎక్కడో ఒకచోట సొంతంగా రెస్టారెంట్ ప్రారంభించవచ్చు. ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించవచ్చు. స్థూలంగా చెప్పాలంటే 'పంప్‌కిన్ టేల్స్' అనేది అనే ఉపాధి కేంద్రమే కాదు, ఉజ్వల భవిష్యత్‌కు ఉపయోగపడే కేంద్రం కూడా.

ధన్య ప్రయత్నం

ఈ కేఫ్ చాలా 'స్పెషల్'

'మిట్టి' అంటే మట్టి.
ఈ మట్టి మీద పుట్టిన
అందరికీ
ఈ మట్టి మీద ఉన్న అన్ని ఉపాధుల్లో హక్కు ఉంది.
కాని దివ్యాంగులకు చాలా చోట్ల
డోర్లు క్లోజ్ అయి ఉంటాయి.
అందుకే 24 ఏళ్ల అలినా ఆలమ్
దివ్యాంగుల కోసమే నడిచే, వారే
యజమానులుగా మారే కేఫ్‌లను
'మిట్టి కేఫ్' పేరుతో స్థాపించింది.
ఇప్పటికి 4000 మంది దివ్యాంగులు ఉపాధి
పొందారు.
సాక్షాత్తు సుప్రీంకోర్టు జడ్జీనే ఈ ప్రయత్నాన్ని మెచ్చుకుని
సుప్రీంకోర్టు ప్రాంగణంలో మిట్టి కేఫ్‌కు చోటు ఇచ్చారు.



అలినా ఆలమ్ తన టీనేజ్‌లో కోల్‌కటాలోని నానమ్మ దగ్గర పెరిగింది. నానమ్మకు వెన్ను సమస్య వచ్చినప్పటి నుంచి ఆమెకు కదలడం, సొంత పనులు చేసుకోవడం చాలా కష్టమవడం గమనించింది. అది అలినా ఆలమ్ మనసులో ముద్ర పడింది. బెంగళూరుకు చదువుకోవడానికి వచ్చాక చదువులు, ర్యాంకులు అన్నీ అవయవాలు సక్రమంగా ఉన్నవారిని అందలం ఎక్కించేలా ఉన్నాయి కాని ఏ ఉపాధి రంగమూ దివ్యాంగులకు మేము పని ఇస్తాం అనడం కనిపించలేదు. దివ్యాంగులు ఆత్మాభిమానంతో జీవించాలంటే వారికి సానుభూతి కంటే ఉపాధి కల్పించడమే చాలా ముఖ్యం అనుకుంది. 'నేనే దివ్యాంగులకు పని ఇస్తాను' అని నిశ్చయించుకుంది. 'నీ దగ్గర ఏముందని వారికి పని ఇస్తావు?' అని ఫ్రెండ్స్ అడిగారు. 'సంకల్పం ఉంది' అని చెప్పింది అలినా.

2017లో మొదటి కేఫ్

దివ్యాంగులకు పని ఇవ్వడమే కాదు... ఆ పని నలుగురి కంటా పడేలా చేయాలి... వారితో నలుగురూ మాట్లాడేలా ఉండాలి... ఈ ప్రయత్నాన్ని చూసి నలుగురూ తమ తమ రంగాల్లో అలాంటి వారికి పని ఇచ్చేలా ఉండాలి అనేది అలినా ఆలోచన.

ఇందుకు 'కేఫ్' తెరవడం సరైనదనిపించింది. అప్పటికి చదువుకుని ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న అలినా ఇలాంటి ప్రయత్నానికి అండగా నిలిచే సేవాసంస్థ దేశ్‌పాండే ఫౌండేషన్‌ను కలిసి ఆలోచన చెప్పింది. నిధులు తీసుకుని ఉత్తర కర్నాటకలోని హుబ్లీలో తొలి 'మిట్టి కేఫ్' తెరిచింది. అందుకు ఊరిలో ప్రతి వీధి తిరిగి దివ్యాంగులకు ఉద్యోగం, ఉపాధి అని చెప్పింది. కొందరు సందేహంగా చూశారు. కొందరు అపనమ్మకంతోనే వచ్చారు. నడక వీలుకాని వారు, బధిరులు, అంధులు, మరుగుజ్జులు, గూని బాధితులు... వీరు వచ్చి ఉత్సాహంగా పనిలో జాయిన్ అయ్యారు. మిట్టి కేఫ్‌లో టీ, కాఫీ, శాండ్ విచ్, సాదా సీదా భోజనం దొరికేలా మెనూ తయారు చేసింది అలినా. ఆ మెల్లగా అయినా సరిగ్గా చేయడం నేర్చుకున్నారు. వారికే మొత్తం నిర్వహణ, ఆదాయ పంపకం అప్పజెప్పి మరో మిట్టి కేఫ్ కోసం సాగిపోయింది అలినా.

ఆహ్వానించే ప్రయత్నం

ఒక పని సఫలం కావాలంటే సరిగ్గా వివరించే ప్రయత్నం చెయ్యాలి... ఉద్దేశం పరిశుభ్రంగా ఉండాలి. అలినా ఆలోచన, ఆచరణలో చిత్తశుద్ధి ఉన్నాయి. అందుకే కార్పొరేట్ సంస్థలు, ఎయిర్‌పోర్ట్‌ల యాజమాన్యాలు అందరూ ఆమెను ఆహ్వానించారు. బెంగళూరు ఎయిర్‌పోర్ట్, ముంబై ఎయిర్‌పోర్ట్‌లతో పాటు పెద్ద పెద్ద ఆస్పత్రులలో కూడా మిట్టి కేఫ్‌లు ఏర్పాటయ్యాయి.

'ఇప్పటికి దేశంలో 41 చోట్ల మిట్టి కేఫ్‌లు ఉన్నాయి. ఇవి ఇంకా పెరుగుతాయి. సుప్రీంకోర్టు ప్రాంగణంలో కూడా మాకు చోటు దక్కడం గొప్ప విషయం' అంటుంది అలినా. ఈ కేఫ్‌ల ద్వారా ఇప్పటికి 4000 మంది దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వు వచ్చింది. ఆత్మాభిమానం తొణికిసలాడింది.

వెతికి, శిక్షణ ఇచ్చి

'కేఫ్ పని అయినా శిక్షణ అవసరం. అందుకే నేను దేశంలోని కొన్ని ఎన్‌జిఓలను కాంటాక్ట్ చేసి ఆయా ప్రాంతాల్లోని దివ్యాంగులను గుర్తించేలా చేశాను. అంతే కాదు ఇళ్ల నుంచి తరిమేస్తే రోడ్ల మీద భిక్షాటన చేస్తున్న దివ్యాంగులను కూడా గుర్తించాను. ఒక పట్టణంలో ఒక సమూహం సిద్ధంగా ఉంది అని అర్థమయ్యాక వారికి అక్కడి వ్యక్తుల చేత రెండు నెలల పాటు ట్రయినింగ్ ఇప్పించి మిట్టి కేఫ్‌లు స్థాపిస్తున్నాను. అందుకు దాతలు ముందుకొస్తున్నారు. ఒకసారి కేఫ్ స్థాపించాక దాని మీద అధికారం ఆ దివ్యాంగులదే' అంటుంది అలినా.

'మా మిట్టి కేఫ్ స్టాఫ్ మిగిలిన రెస్టరెంట్ల స్టాఫ్ అంత వేగంగా పని చేయకపోవచ్చు. చెప్పింది మెల్లగా అర్థం చేసుకోవచ్చు. కాని వారు పని గొప్పగా చేస్తారు. మీరు మెచ్చుకునేలా చేస్తారు' అంటుంది అలినా. వీరు అమ్మే 'కుల్హాద్ చాయ్'కి మంచి డిమాండ్ ఉంది. అన్నట్టు ఇక్కడ మెనూ బ్రెయిలీలో కూడా ఉంటుంది.

ఇలాంటి కేఫ్‌ను ప్రతి ఊరికి ఆహ్వానించండి.



టిప్



పటిక కరిగించిన నీటితో తల స్నానంచేస్తే ఎక్కువగా చెమట పట్టేసమస్య తగ్గడంతోపాటు చుండ్రుబాధ కూడా తగ్గుతుంది.

కొలెస్ట్రాల్ ఎంత అవసరం? ఎంతకు మించరాదు?



ఆధునిక కాలంలో మనం అనుసరించే జీవనశైలి వల్ల, తినే ఆహారం వల్ల రకరకాల జబ్బులను కొని తెచ్చుకునే వారి సంఖ్య పెరిగిపోతోంది. ముఖ్యంగా గుండె జబ్బులతో బాధపడే వారి సంఖ్య అంతకంతకూ హెచ్చుతూనే ఉంది. హృదయ సంబంధ వ్యాధులకు ప్రధానంగా ఆహార పదార్థాలతోపాటు కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువ ఉండటమూ ఒక కారణం. ఇంతకూ కొలెస్ట్రాల్ శరీరానికి అవసరమేనా? ఇది ఎంత ఉండాలి, ఎంతకంటే ఎక్కువ ఉంటే ప్రమాదం అనే విషయాల గురించి తెలుసుకుందాం.

చెడు కొలెస్ట్రాల్ ఉంటే..?

శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువైతే ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయి. రక్తపోటు, ఊబకాయం, గుండె పోటు, నడుము నొప్పులు, కీళ్ల నొప్పులు, వెన్ను నొప్పులు, కిడ్నీ, మెదడుకు సంబంధించిన సమస్యలు ఎక్కువవుతాయి. మరి మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

అన్ని విషయాల్లో మంచి, చెడూ ఉన్నట్లే.. కొవ్వుల్లోనూ మనకు మేలు చేసేవి, చెడు చేసేవి ఉన్నాయి. చెడు కొవ్వుల్ని ఎల్‌డీఎల్ అని, మంచి కొవ్వుల్ని హెచ్‌డీఎల్ అని పిలుస్తారు. మన రక్తంలో చెడు కొలెస్ట్రాల్ తక్కువగా/అదుపులో ఉండాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటాం. మరి మన వంట్లో ఉన్న చెడు కొలెస్ట్రాల్ తగ్గడానికి ఏం తినాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందామా?

శరీరంలో కొవ్వు పెరగడంలో ఎల్‌డిఎల్‌ది ప్రధాన బాధ్యత. ఇప్పటికే గుండె జబ్బు ఉన్నవారిలో ఎల్‌డిఎల్ స్థాయి 70 మిల్లీ గ్రాము/డిఎల్ కంటే తక్కువ ఉండాలని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి.

హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్ దీనినే మంచి కొలెస్ట్రాల్ అని అంటారు. హెచ్‌డిఎల్ రక్తనాళాల్లోని కొలెస్ట్రాల్‌ను తొలగించి, కాలేయానికి పంపిస్తుంది. ఇక్కడ కొలెస్ట్రాల్ విచ్ఛిన్నం అవుతుంది. హెచ్‌డిఎల్ స్థాయి తక్కువగా ఉందంటే, గుండె రక్తనాళాల వ్యాధి ప్రమాదం పెరుగుతున్నట్లు భావించాలి. గుండెపోటుకు బలమైన కారణం ఎల్‌డిఎల్ పెరగడం కన్నా హెచ్‌డిఎల్ తగ్గడమే. హెచ్‌డిఎల్ పురుషుల్లో 40 ఎంజి/ డిఎల్, మహిళల్లో 50 ఎంజి/డిఎల్ ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.

- అల్లం వెల్లుల్లి మిశ్రమాన్ని ప్రతిరోజు వంటల్లో ఉపయోగించడం వల్ల కొలెస్ట్రాల్ సమస్యను తగ్గించుకోవచ్చు.
- అలాగే గ్రీన్ టీ రోజు తాగడం వల్ల కూడా చెడ్డ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంతోపాటు హెచ్‌డీఎల్ స్థాయిని కూడా పెంచుకునే వీలుంది.
- ఇక ధనియాలు.. ఈ గింజల్లో ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఏ, బీటా కెరోటిన్, విటమిన్ సి వంటివి ఉండటం వల్ల కొలెస్ట్రాల్ ప్రభావం తగ్గుతుంది. వీటిని రోజు నేరుగా తినడం అలవాటు చేసుకుంటే మంచిది.
- మెంతులు కూడా కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. వీటిని నేరుగా తినలేము. ఎందుకంటే ఇవి రుచికి చిరు చేదుగా అనిపిస్తాయి. అందువల్ల నానబెట్టుకుని తింటే మంచిది.
- ఇక చివరిగా ఉసిరి. ఇది కొలెస్ట్రాల్ సమస్యకు చక్కని పరిష్కారంగా నిపుణులు సూచిస్తున్నారు. అయితే ఏదైనా సమస్య రాకముందే ఇలాంటివి అలవాటు చేసుకుంటే మంచిదని.. చక్కని ఆరోగ్యాన్ని పొందవచ్చని కూడా చెబుతున్నారు.
- మాంసాహారం పూర్తిగా మానేయాలి. శాకాహారంలో వేపుడు కూరలు తినరాదు. వీటి బదులు ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం మంచిది. అలాగే కొబ్బరి, వేరుశనగలు, నువ్వులు వంటివి తీసుకోవడం వల్ల వీటిలో ఫైబర్‌తోపాటు ఆరోగ్యకరమైన కొవ్వు ఉంటుంది. ఇది మన శరీర నిర్మాణానికి అవసరం.
- వరి, గోధుమ బదులు తృణ ధాన్యాలు, సిరి ధాన్యాలు తింటే కూడా చెడు కొలెస్ట్రాల్ బాగా తగ్గుతుంది.
- అలాగే పళ్ళు, పచ్చి కూరలు తురుముకొని పెరుగులో వేసుకుని తినండి. కీర దోసకాయలు, కారట్, బీట్రూట్, దోసకాయలు, బూడిద గుమ్మడి, సొరకాయ వంటివి తురుముకొని లేదా మిక్సర్ లో వేసి పెరుగులో కలిపి తీసుకుంటే మంచిది.
- పాలకు బదులు పెరుగు, మజ్జిగ తీసుకోండి. పంచదార పూర్తిగా మానేసి తాటి బెల్లం, బెల్లం లేదా తేనె కొద్ది మోతాదులో తీసుకోండి.
- రోజూ ఉదయం మొలకలు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం సలాడ్, పండ్లు తీసుకోండి. ఇలా 30 రోజులు చేయండి. ఉదయం రెండు కిలోమీటర్ల నడక, ప్రాణాయామం చేయాలి.

చెడు కొవ్వు తగ్గడానికి...

- ఉప్పు తగిన మోతాదులో తీసుకోవాలి
- ఎల్‌డీఎల్ అనే చెడు కొవ్వులు.. డెసిలీటర్‌కు 70 మిల్లీ గ్రాములకు మించకూడదు
- మధుమేహం ఉన్నవాళ్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే ఔషధాలు తీసుకోవడం తప్పనిసరి. అపోహలను పక్కనపెట్టి వైద్యుల సూచనలను తప్పక పాటించాలి
- మంచి కొలెస్ట్రాల్ . డెసిలీటర్‌కు 40 మిల్లీగ్రాములు ఉండేలా చూసుకోవాలి
- ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూసుకోవాలి. ఊబకాయం బారిన పడకుండా జాగ్రత్త పడాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి
- తిండిని అదుపులో ఉంచుకోవాలి.

డ్రై ఫ్రూట్స్ ఎన్ని... ఎలా... తింటున్నారు?

డ్రై ఫ్రూట్స్! ఇవి ఆరోగ్యానికి మంచిదని చాలా మంది సూచిస్తారు. ప్రొటీన్స్, ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్ ఇవన్నీ ఆరోగ్యం మెరుగ్గా ఉండటానికి కావాల్సినవి. వీటన్నింటిని పొందడానికి డ్రై ఫ్రూట్స్ ఒక ఆప్షన్. అయితే ఇవి ఆరోగ్యానికి మంచిది కదా అని.. ఇష్టమొచ్చినట్టు తినకూడదు. దేనికైనా ఒక పరిమితి ఉంటుంది. అయితే ఎంత పరిమాణంలో తినాలి. ఏ డ్రై ఫ్రూట్స్ ఎన్ని తింటే ఆరోగ్యకరం? డ్రైఫ్రూట్స్‌ను తిన దానికి ముందు ఎందుకు నానబెట్టాలి? లాభాలేంటి..?



డ్రై ఫ్రూట్స్‌లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే.. షుగర్స్, క్యాలరీలు కూడా ఉంటాయి. కాబట్టి వీటిని 20 గ్రాముల కంటే ఎక్కువ తినకూడదు. అలాగే నేరుగా తినడం కూడా మంచిది కాదు. కాబట్టి.. డ్రై ఫ్రూట్స్ తినే విధానం, ఏ నట్స్ ఎంత పరిమాణంలో తినాలో తెలుసుకుందాం.

బాదం... బాదం పప్పులో మోనో శ్యాచురేటెడ్ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండెకి, మెదడుకి, చర్మ ఆరోగ్యానికి మంచిది. అలాగే ఆల్మండ్స్ లో విటమిన్ ఈ, మెగ్నీషియం, పొటాషియం ఉంటాయి. ఇవి రక్తప్రసరణ సక్రమంగా ఉండటానికి సహాయపడతాయి. అలాగే రక్త ప్రసరణ సజావుగా సాగడానికి సహకరిస్తాయి. రోజుకి 4 నుంచి 7 బాదం పప్పులు తినడం వల్ల అన్ని రకాల ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.

వాల్ నట్స్... వాల్ నట్స్ పైన ఉండే పెంకు తీయగానే.. ఉండే పప్పు అంత రుచిగా ఉండదు. కానీ.. 90 శాతం యాంటీ ఆక్సిడెంట్స్, ఫెనోలిక్ యాసిడ్స్, టాన్నిన్స్, ఫ్లేవనాయిడ్స్ ఈ స్కిన్ లోనే ఉంటాయట. గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షించడంలో ఇవి చాలా సమర్థంగా పని చేస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. వీటిని రోజుకి 3 నుంచి 4 తీసుకోవచ్చు.

కర్జూరం... ఇందులో ఆరోగ్యంగా ఉండటానికి ఉపయోగపడే న్యూట్రియంట్స్, విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. అలాగే ఫ్రాక్టోజ్ ఇందులో రిచ్ గా ఉంటుంది. మెటబాలిజం స్థాయి చురుగ్గా ఉండటానికి కర్జూరం ఉపయోగపడుతుంది. వీటిని రోజుకి మీడియం సైజులో ఉండే 1 లేదా రెండు తీసుకుంటే సరిపోతతుంది.

పిస్తా... పిస్తా వెల్‌నెస్ కి చిహ్నం. ఇవి బలానికి, ఆరోగ్యానికి బాగా ఉపయోగపడతాయి. ఇందులో మిగిలిన డ్రైఫ్రూట్స్ లో కంటే ప్రొటీన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. వీటిని రోజుకి 20 గ్రాముల కంటే ఎక్కువ తీసుకోకూడదు.

జీడిపప్పు... కమ్మటి రుచిలో ఉండే జీడిపప్పును రెగ్యులర్ గా తినడం వల్ల పిత్తాశయంలో రాళ్లు ఏర్పడకుండా నివారించవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. రోజుకు నాలుగు జీడిపప్పులను తినడం ఆరోగ్యకరమని ఈ అధ్యయనాలు చెబుతున్నాయి.

ఎండుద్రాక్ష... ఎండుద్రాక్షను ఎక్కువ మోతాదులో తిన్నా ఎలాంటి సమస్యా లేదు. ఇందులో విటమిన్ బి, పొటాషియం, ఐరన్ పుష్కలంగా లభిస్తాయి. కాబట్టి రోజుకి గుప్పెడు ఎండుద్రాక్ష తినవచ్చు. అయితే మహిళలు రోజుకి ఒకటిన్నర కప్పు, మగవాళ్లు 2 కప్పుల ఎండుద్రాక్ష తినాలని నిపుణులు సూచిస్తున్నారు.

కాలిన గాయాలకు సత్వర సాంత్వన



వంటింట్లో వేడి వేడి పాత్రలు చేతికి పొరబాటున తగలడం వల్ల కాలిన చోట బొబ్బలు వచ్చి మంట అనిపిస్తుంది. ఈ సమస్య త్వరగా తగ్గాలంటే ఏం చేయాలంటే...

బ్లాక్ టీ: ఈ బ్యాగులను డీప్ ఫ్రిజ్‌లో కాసేపు ఉంచాలి. ఈ బ్యాగులను కాలిన గాయాల మీద ఉంచాలి. బ్లాక్ టీలో ఉండే టానిక్ యాసిడ్ చర్మానికి సాంత్వన అందిస్తుంది. నొప్పి, మంటను తగ్గిస్తుంది.

తేనె: రాత్రిపూట పడుకునే ముందు కాలిన గాయం మీద తేనెను రాయడం వల్ల ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉంటాయి.

పాలు: కాలినచోట పాలు రాస్తే గాయాలు త్వరగా తగ్గుతాయి. అలానే బాగా మంటగా అనిపించినప్పుడు ఫ్రిజ్‌లో పెట్టిన పాలలో దూదిని ముంచి గాయాల మీద పరచాలి. ఇలా చేయడం వల్ల చాలా వేగంగా సాంత్వన చేకూరుతుంది.

మెత్తగా నూరిన పుదీనా ఆకుల గుజ్జుని కాలినచోట పూతలా రాయాలి. తరవాత చల్లని నీళ్లను చల్లి.. పుదీనా పూతను తొలగిస్తే మంట తగ్గుతుంది.

కాలిన చర్మం తెల్లగా అయితే...

నేరేడు చెట్ల ఆకులు తీసుకొని ముక్కలు చేసి బాణలిలో వేసి స్టవ్ మీద పెట్టి నల్లగా బూడిదలాగా అయిన తరువాత జల్లించాలి. దీనిలో నల్లనువ్వుల నూనె వేసి మెత్తగా నూరాలి. సీసాలో భద్రపరచాలి. రోజూ రెండు పూటలా గాయాల మీద లోపలికి ఇంకి పోయేటట్లు పూస్తుంటే తెల్ల మచ్చలు త్వరలోనే చర్మపురంగులో కలిసిపోతాయి.

మీకు తెలుసా?

జ్వరం ఒక వ్యాధి కాదు!



మనం జ్వరాన్ని ఓ వ్యాధిగా చూస్తాం. కాబట్టే జ్వరం రాగానే దాన్ని తగ్గించే మాత్రలు వేసుకోవాలని పొరపడుతూ ఉంటాం. నిజానికి జ్వరం అనేది వ్యాధి కాదు...అది వ్యాధిలో కనిపించే ఓ లక్షణం మాత్రమే! కాబట్టి అలా కనిపించే లక్షణానికి చికిత్స చేయటం మాని అందుకు మూల కారణాన్ని కనిపెట్టి దాన్ని సరిదిద్దే చికిత్స తీసుకోవాలి. ఇందు కోసం తప్పనిసరిగా వైద్యుల్ని ఆశ్రయించాల్సిందే! జ్వరం తగ్గుతూ పెరుగుతున్నా, విడవకుండా రెండు రోజుల కు మించి వేధిస్తున్నా నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ని కలిసి పరీక్షలు చేయించుకుని జ్వరాన్ని కలిగించిన వ్యాధి గురించి తెలుసుకోవాలి. అలా కాకుండా తాత్సారం చేస్తే జ్వర కారక వ్యాధి క్రిములు అంతర్గత అవయవాల మీద దాడిచేసి ఆరోగ్యపరంగా తీవ్ర నష్టం కలిగించవచ్చు

రక్తశుద్ధికి...

- టేబుల్ స్పూన్ నెయ్యి లో పది మిరియాలు వేసి చిన్న మంట మీద వేయించి తర్వాత వడపోసి, మిరియాలు తీసివేయాలి. వీటిని ఆహారంలో మొదటి ముద్దలో కలిపి తినాలి, 40 రోజులపాటు ఇలా చేస్తుంటే రక్తం శుద్ధి అవుతుంది. దీనివల్ల చర్మ వ్యాధులు అన్నీ హరించి వేస్తాయి
- 'ప్లాస్టిక్ వాటర్ బాటిల్ లో, నీళ్ల తాగడం ఆపి కేవలం రాగి పాత్రలో నీళ్ల మాత్రమే తాగండి
- మీకు వచ్చే అన్ని రోగాలు, కొద్ది రోజులలో మటుమాయమవుతాయి.

స్ఫూర్తిదాయక పోరాటం



కీర్తి సురేష్

రెగ్యులర్ కమర్షియల్ క్యారెక్టర్స్ మాత్రమే కాకుండా... వీలైనప్పుడల్లా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో పవర్‌ఫుల్ క్యారెక్టర్స్ కూడా చేస్తుంటారు హీరోయిన్ కీర్తి సురేష్. 'మహానటి', 'పెంగ్విన్', 'మిస్ ఇండియా' వంటి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో నటించి, ప్రేక్షకులను మెప్పించారు కీర్తి. తాజాగా ఆమె నటించిన ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'రఘు తాత'. కీర్తి సురేష్ లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు సుమన్ కుమార్ దర్శకత్వం వహించారు. 'సలార్, కేజీఎఫ్' వంటి సినిమాలను నిర్మించిన హోంబలే ఫిలింస్ నిర్మించిన తొలి తమిళ సినిమా ఇది. ఈ సినిమాను ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. ''ఈ సినిమా కథ ప్రేక్షకులను భావోద్వేగానికి గురి చేస్తుంది... నవ్విస్తుంది... స్ఫూర్తి కలిగిస్తుంది'' అని పేర్కొన్నారు కీర్తి సురేష్. ఒక సామాజిక అంశంతో ఓ మహిళ చేసే స్ఫూర్తిదాయక పోరాటం నేపథ్యంలో 'రఘు తాత' ఉంటుందని టాక్. తెలుగు, మలయాళ భాషల్లోనూ ఈ చిత్రం రిలీజ్ కానుందట.

విలేజ్... సెట్... గో...



రామ్‌చరణ్

గెట్... సెట్... గో అంటారు. అయితే రామ్‌చరణ్ విలేజ్... సెట్... గో అంటూ పల్లెటూరికి వెళ్లనున్నారు. విలేజ్‌లో స్పోర్ట్స్ ఆడేందుకు రెడీ అవుతున్నారు రామ్‌చరణ్. ఆయన హీరోగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ విలేజ్ స్పోర్ట్స్ డ్రామా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తారు. కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్రల్లో నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అన్నదమ్ముల్లా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేయనున్నారట. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ ఫిల్మ్ చిత్రీకరణకు రంగం సిద్ధమౌతోంది. ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలో విలేజ్ సెట్‌ను రెడీ చేయిస్తున్నారు మేకర్స్. ఈ సెట్ పూర్తి కాగానే ఈ సినిమా చిత్రీకరణ మొదలవుతుంది. మేజర్ షూటింగ్ ఈ విలేజ్ సెట్‌లోనే ప్లాన్ చేశారట. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది చివర్లో రిలీజ్ కానుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఇదిలా ఉంటే... దర్శకుడు బుచ్చిబాబు తండ్రి గురువారం మరణించారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా చిత్రీకరణ కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

ఇక ఆరంభం



ప్రియాంకా చోప్రా

ఆస్ట్రేలియాలో సముద్రపు దొంగగా మారిపోయారు ప్రియాంకా చోప్రా. న్యూజిల్యాండ్ యాక్టర్ కర్ల్ అర్బన్, ప్రియాంకా చోప్రా లీడ్ రోల్స్‌లో నటిస్తున్న హాలీవుడ్ ఫిల్మ్ 'ది బ్లఫ్'. ఫ్రాంక్ ఈ ఫ్లవర్స్–జో బల్లారిని ద్వయం దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన పనులు ఆరంభం అయ్యాయని తెలియజేస్తూ, తన ఇన్‌స్టా స్టేటస్‌లో 'ఇట్ బిగిన్స్' అంటూ 'ది బ్లఫ్' సినిమా స్క్రిప్ట్ చదువుతున్నట్లు ఓ పేజీని షేర్ చేశారు ప్రియాంకా చోప్రా. ఈ చిత్రంలో కానర్ అనే పాత్రలో కర్ల్, ఎర్సెల్ అనే పాత్రలో ప్రియాంకా చోప్రా నటిస్తున్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఈ సినిమా చిత్రీకరణలోనే ఉన్నారు ప్రియాంకా చోప్రా. ఇక 19వ శతాబ్దంలో ఎర్సెల్ అనే ఓ సముద్రపు దొంగ జీవితం నేపథ్యంతో 'ది బ్లఫ్' సినిమా కథనం సాగుతుంది. కొన్ని కారణాల వల్ల ఎర్సెల్ అనే యువతి సముద్రపు దొంగతనాలు మానేసి, సాధారణ జీవితం గడుపుతుంటుంది. కానీ ఎర్సెల్ సముద్రపు దొంగగా ఉన్న సమయంలో చేసిన పనులు, ఆమె ప్రస్తుత జీవితాన్ని ఎలా ప్రభావితం చేశాయి? ఆ సమస్యల నుంచి ఎర్సెల్ ఎలా బయటపడింది? అనే అంశాల నేపథ్యంలో 'ది బ్లఫ్' కథనం సాగుతుందని హాలీవుడ్ టాక్. ఇక ప్రియాంకా చోప్రా ఓ లీడ్ రోల్‌లో నటించిన మరో హాలీవుడ్ ఫిల్మ్ 'హెడ్స్ ఆఫ్ స్టేట్' రిలీజ్‌కు రెడీ అవుతోంది.

సుభద్రలా ఉండలేను! - కృతీ శెట్టి

"మనమే' మూవీ పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ప్రతి సన్నివేశంలో వినోదం ఉంటుంది. అలాగే వండర్‌ఫుల్ కిడ్, పేరెంట్ ఎమోషన్స్ ఉన్నాయి. అది గ్లోబల్ ఆడియన్స్‌కి కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా మొత్తం మా ముగ్గురి పాత్రల (శర్వా, కృతి, విక్రమాదిత్య) చుట్టూ తిరుగుతుంది.. అందుకే 'మనమే' అనే టైటిల్ పెట్టాం" అని హీరోయిన్ కృతీ శెట్టి అన్నారు. శర్వానంద్, కృతీ శెట్టి జంటగా నటించిన తాజా చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విక్రమాదిత్య కీలక పాత్ర చేశాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై రామ్‌సే స్టూడియోస్ ప్రొడక్షన్‌లో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కృతీ శెట్టి పంచుకున్న విశేషాలు...



- 'మనమే'లో నా పాత్ర పేరు సుభద్ర. ఇప్పటివరకూ నేను చేసిన క్యారెక్టర్స్‌కి ఇది వైవిధ్యంగా ఉంటుంది. నేను క్యూట్, సాఫ్ట్, బబ్లీ క్యారెక్టర్స్ చేశాను. కానీ, తొలిసారి 'మనమే'లో చాలా స్ట్రిక్ట్‌గా ఉండే పాత్ర చేశాను. నిజ జీవితంలో నాకు పెద్దగా కోపం రాదు.. గట్టిగా అరవను. చాలా కామ్‌గా ఉంటాను. చెప్పాలంటే సుభద్రలా స్ట్రిక్ట్‌గా ఉండలేను. అందుకే ఈ పాత్ర చేయడం నాకు పూర్తిగా కొత్తగా అనిపించింది. ఈ పాత్ర కోసం డైరెక్టర్ శ్రీరామ్‌గారి విజన్‌ని ఫాలో అయ్యాను.
- నా తొలి మూవీ 'ఉప్పెన'లో బేబమ్మ పాత్రకి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. అయితే ఆ తర్వాత ఆ స్థాయిలో గుర్తింపు రాలేదు. 'ఉప్పెన' రస్టిక్ లవ్ స్టోరీ. 'మనమే' రొమాంటిక్ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. నేను చేసిన సుభద్ర పాత్రలో చాలా భావోద్వేగాలున్నాయి. అది ప్రేక్షకులకి నచ్చుతుందనే ఆశిస్తున్నాను. సినిమా సక్సెస్, ఫెయిల్యూర్ మన చేతుల్లో ఉండదు. నా వరకూ పాత్రకి న్యాయం చేస్తాను. మన చేతిలో లేని విషయాల గురించి ఎక్కువగా ఆలోచించి, ఆందోళన చెందకూడదని ఈ ప్రయాణంలో నేర్చుకున్నాను.
- ప్రస్తుతం తమిళంలో మూడు సినిమాలు, మలయాళంలో ఒక సినిమా చేస్తున్నాను. ఆ కమిట్‌మెంట్స్ వల్లే తెలుగులో గ్యాప్ వస్తోంది. పైగా రొటీన్ పాత్రలు కాకుండా వైవిధ్యంగా ఉన్నవి మాత్రమే చేయాలనుకుంటున్నాను. 'బాహుబలి' చిత్రంలో అనుష్కగారిలా నాకు మహారాణి పాత్ర చేయడం ఇష్టం. అలాగే యాక్షన్, మార్షల్ ఆర్ట్స్ బ్యాక్‌డ్రాప్ రోల్స్ కూడా చేయాలని ఉంది. నాకు వీలు కుదిరినప్పుడు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకుంటాను.

జై బోలో కృష్ణ



అశోక్ గల్లా

సూపర్ స్టార్ కృష్ణ మనవడు అశోక్ గల్లా హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో వారణాసి మానస హీరోయిన్. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. శుక్రవారం సూపర్ స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకుని 'దేవకి నందన వాసుదేవ' మూవీ నుంచి 'జై బోలో కృష్ణ...' అంటూ సాగే రెండో పాటని రిలీజ్ చేశారు. ఈ పాటకి రఘురామ్ సాహిత్యం అందించగా, స్వరాగ్ కీర్తన్ పాడారు. యష్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ''భక్తి అంశాలతో కూడిన ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. హీరో తన బ్యాచ్‌తో కలిసి కృష్ణుడి జన్మాష్టమిని సెలబ్రేట్ చేసుకునే సందర్భంలో 'జై బోలో కృష్ణ...' పాట వస్తుంది. ఈ సినిమా రిలీజ్ డేట్‌ని త్వరలో ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

అప్పుడు నేనూ నవ్వేదాన్ని!



జాన్వీ కపూర్

క్రికెట్ ప్రాక్టీస్‌లో తనకైన గాయాలను గురించి ట్రోల్ చేసిన ఓ నెటిజన్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు హీరోయిన్ జాన్వీ కపూర్. క్రికెట్ నేపథ్యంలో సాగే హిందీ చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. ఈ చిత్రంలో మహేంద్ర పాత్రలో రాజ్‌కుమార్ రావు, మహిమా పాత్రలో జాన్వీ కపూర్ నటించారు. ఈ సినిమా కోసం క్రికెట్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు జాన్వీ. తాను క్రికెట్ ప్రాక్టీస్ చేసిన వీడియోను ఆమె ఇటీవల సోషల్ మీడియాలో షేర్ చేశారు. క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు తనకు గాయాలైనట్లుగా కూడా ఆమె పేర్కొన్నారు. 'టెన్నిస్ బాల్‌తో ఆడితేనే ఇన్ని గాయాలు అయ్యాయా?' అంటూ ఓ నెటిజన్ కామెంట్ చేశారు. ఈ కామెంట్‌పై జాన్వీ కపూర్ స్పందించారు. ''టెన్నిస్ బాల్‌తో ఆడితే గాయాలు ఎలా అవుతాయి? ముందు క్రికెట్ బాల్‌తోనే ఆడాను. అప్పుడు గాయాలు అయ్యాయి. అందుకే టెన్నిస్ బాల్‌తో ఆడాల్సి వచ్చింది. నా భుజాలకు ఉన్న బ్యాండేజీలను చూస్తే మీకు ఆ విషయం అర్థం అవుతుంది. దెబ్బలు తగిలిన తర్వాత ఆడిన వీడియోనే ఇది. ట్రోల్ చేసే ముందు మీరు వీడియో మొత్తం చూసి ఉంటే అప్పుడు మీరు వేసిన జోక్‌కు నేను నవ్వి ఉండేదాన్ని'' అని వ్యంగ్యంగా సమాధానం ఇచ్చారు జాన్వీ కపూర్. ఇక 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' శుక్రవారం (మే 31) విడుదలైంది.

తెలంగాణ తేజం



రాకేశ్, కేసీఆర్

'జబర్దస్త్' ఫేమ్ రాకింగ్ రాకేశ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'కేసీఆర్' (కేశవ చంద్ర రమావత్). 'గరుడవేగ' అంజి దర్శకత్వం వహించారు. చరణ్ అర్జున్ సంగీతం అందించారు. ఈ చిత్రంలోని 'తెలంగాణ తేజం..' అంటూ సాగే పాటను బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ రిలీజ్ చేసి, సినిమా విజయం సాధించాలన్నారు. గోరేటి వెంకన్న రచించిన ఈ పాటని మను, కల్పన, గోరేటి వెంకన్న పాడారు. ''తెలంగాణ తేజం..' పాట అందరిలో ఉత్తేజాన్ని కలిగిస్తుంది'' అన్నారు రాకింగ్ రాకేశ్. ఈ పాట ఆవిష్కరణలో ఎంపీ దీవకొండ దామోదర్ రావు, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 76	73,961
నిఫ్టీ ▲ 42	22,530

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,540	▽ 196
డోజోన్స్	38,305	▲ 193
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,275	▲ 44
డాక్స్	18,498	▲ 1
షాంఘై	3,087	▽ 5
నికాయ్	38,488	▲ 434

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	72,115	▽ 298
బంగారం (99.5 స్వచ్ఛత)	71,826	▽ 297
వెండి (కిలో)	92,673	▽ 1,445

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.85	83.87
£	బ్రిటన్ పౌండ్		104.76	107.31
€	యూరో		89.01	91.37
¥	జపాన్ ఎన్ (100)		52.39	53.55
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.23	56.17
S$	సింగపూర్ డాలర్		59.59	63.56
SAR	సౌదీ రియాల్		21.34	22.88
UAE D	యూఏఈ దిర్హామ్		21.81	23.58
¥	చైనా యువాన్		10.36	12.36

అంచనాలకు మించి... వృద్ధి

- క్యూ4లో 7.8 శాతం పురోగతి
- 2023–24లో 8.2 శాతం పరుగు
- ప్రపంచంలో వేగంగా పురోగమిస్తున్న దేశంగా హోదా



భళా.. భారత్

ఎకానమీ దూకుడు

న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ అన్ని వర్గాల అంచనాలకు మించి మంచి ఫలితాన్ని సాధించింది. మార్చితో ముగిసిన 2023–24 ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదయ్యింది. మార్చి త్రైమాసికంలో ఈ పురోగతి 7.8 శాతంగా రికార్డు అయ్యింది. నాలుగో త్రైమాసికంలో 6.1–6.7 శాతం పరిధిలో వృద్ధి చెందుతుందని పలువురు ఆర్థికవేత్తలు అంచనావేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 7.6–7.8 శాతం శ్రేణిలో ఉంటుందన్నది వారి అభిప్రాయం. ఆర్‌బీఐ వృద్ధి అంచనాసైతం 7 శాతంగా ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) ఫిబ్రవరినాటి తన రెండవ అడ్వాన్స్ అంచనాల్లో 2023–24 వృద్ధి రేటును 7.7 శాతంగా పేర్కొంది. ఈ అంచనాలు, విశ్లేషణలు అన్నింటికీ మించి తాజా ఫలితం వెలువడ్డం గమనార్హం. క్యూ4లో అంచనాలకు మించి (7.8 శాతం) భారీ ఫలితం రావడం మొత్తం ఎకానమీ వృద్ధి (8.2 శాతం) పురోగతికి కారణం. ఎన్‌ఎస్‌ఓ శుక్రవారం ఈ మేరకు తాజా గణాంకాలను వెలువరించింది.

5 ట్రిలియన్ డాలర్ల దిశగా అడుగులు

భారత ఆర్థిక వ్యవస్థ 2023–24 జూన్ త్రైమాసికంలో 8.2 శాతం, సెప్టెంబర్ త్రైమాసికంలో 8.1 శాతం, డిసెంబర్ త్రైమాసికంలో 8.6 శాతం పురోగతి సాధించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7 శాతంకాగా, అదే ఆర్థిక సంవత్సరం క్యూ4లో వృద్ధి రేటు 6.2 శాతం. చైనా ఎకానమీ 2024 మొదటి మూడు నెలల్లో 5.3 శాతం పురోగమించడం గమనార్హం. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఎకానమీ ముందుందని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీనితోపాటు భారత్ ఎకానమీ 3.5 ట్రిలియన్ డాలర్ల జోన్‌లో స్థిరపడగా, 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య సాధనకు ముందడుగు పడింది.

ద్రవ్యలోటు కట్టడి

ఆర్థిక వ్యవస్థ గణాంకాలు అంచనాలకు మించి పురోగమించిన నేపథ్యంలో ఎకానమీకి మరో సానుకూల అంశం... ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు పరిస్థితి మెరుగుపడ్డం. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 5.8 శాతంగా (జీడీపీ విలువలతో పోల్చి) ద్రవ్యలోటు ఉండాలని కేంద్ర బడ్జెట్ నిర్దేశిస్తుండగా, ఈ అంకెలు మరింత మెరుగ్గా 5.63 శాతంగా నమోదయ్యాయి. విలువల్లో రూ.17.34 లక్షల కోట్లుగా ఫిబ్రవరి 1 బడ్జెట్ అంచనావేస్తే, మరింత మెరుగ్గా రూ.16.53 లక్షల కోట్లుగా ఇది నమోదయినట్లు కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ తాజా గణాంకాలు వెల్లడించాయి.

8.2% వృద్ధి ఎలా...

2011–12ను బేస్ ఇయర్‌గా తీసుకుంటూ.. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకు ని స్థిర ధరల వద్ద 2022–23 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ విలువ రూ.160.71 లక్షల కోట్లు. 2023–24లో ఈ విలువ 173.82 లక్షల కోట్లకు ఎగసింది. అంటే ఇక్కడ వృద్ధి రేటు 8.2 శాతం. ఇక ద్రవ్యోల్బణాన్ని ప్రాతిపదికగా తీసుకోకుండా స్థిర ధరల వద్ద వృద్ధి రేటును చూస్తే... ఇది 9.6 శాతం పురోగమించి రూ.269.50 లక్షల కోట్ల నుంచి రూ.295.36 లక్షల కోట్లకు చేరింది.

7.8% పరుగు ఇలా..

ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని క్యూ4లో (2023 క్యూ4తో పోల్చి) ఎకానమీ విలువ రూ.43.84 లక్షల కోట్ల నుంచి రూ.47.24 లక్షల కోట్లకు ఎగసింది. అంటే వృద్ధి 7.8 శాతమన్నమాట. స్థిర ధరల వద్ద ఈ రేటు 9.9 శాతం పెరిగి రూ.71.23 లక్షల కోట్ల నుంచి రూ.78.28 లక్షల కోట్లకు ఎగసింది.

మార్చిలో మౌలిక రంగం 6.2 శాతం వృద్ధి



ఎనిమిది పారిశ్రామిక రంగాలతో కూడిన మౌలిక పరిశ్రమ మార్చిలో 6.2 శాతం పురోగమించింది. సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్టులు, విద్యుత్ రంగాల చక్కటి పనితీరు ఇందుకు దోహదపడింది. బొగ్గు, క్రూడ్ ఆయిల్, ఎరువులు, స్టీల్, సిమెంట్ రంగాలు కూడా కలిగిన ఈ గ్రూప్ 2024 మార్చితో 6 శాతం పురోగమించగా, 2023 ఏప్రిల్‌లో 4.6 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో (ఐఐపీ) ఈ గ్రూప్ వెయిటేజ్ 40.27 శాతం.

2024లో వృద్ధి 6.8%: మూడీస్

భారత్ 2024లో 6.8 శాతం వృద్ధి రేటును సాధిస్తుందని రేటింగ్ దిగ్గజం మూడీస్ తన తాజా నివేదికలో పేర్కొంది. 2025లో ఈ రేటు 6.5 శాతంగా ఉంటుందని విశ్లేషించింది. 2022లో ఎకానమీ 6.5 శాతం పురోగమిస్తే,,, 2023లో 7.7 శాతానికి ఎగసిందని తెలిపింది.



మోదీ ప్రభుత్వం 3.0లోనూ వృద్ధి వేగం కొనసాగుతుంది

ప్రపంచంలోని దిగ్గజ ఎకానమీలో భారత్ జీడీపీ వృద్ధి తీరు విశేషమైనది. మోదీ ప్రభుత్వం 3.0లోనూ ఇదే వృద్ధి వేగం కొనగుతుంది. 2023–24లో తయారీ రంగం 9.9 శాతం పురోగమించడం ప్రత్యేకమైన అంశం. 2014కి పూర్వం యూపీఏ ప్రభుత్వం హయాంలో అవినీతితో మొండి బకాయిల కుప్పగా మారిన బ్యాంకింగ్ రంగాన్ని వివిధ సంస్కరణలతో మోదీ ప్రభుత్వం టర్నెరౌండ్ చేసి, వృద్ధి బాటలో పరుగులు తీయిస్తోంది. 2014–23 మధ్య బ్యాంకులు రూ. 10 లక్షల కోట్ల మేర మొండిబాకీల రికవరీ జరిగింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 1,105 బ్యాంక్ ఫ్రాడ్ కేసులను దర్యాప్తు చేసి రూ. 64,920 కోట్ల మొత్తాన్ని అటాచ్ చేసింది.

– మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో నిర్మలా సీతారామన్

ఆర్బిక్యులర్ ఫార్మాలో టాటా క్యాపిటల్ పెట్టుబడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ ఆర్బిక్యులర్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీస్‌లో టాటా క్యాపిటల్ హెల్త్‌కేర్ ఫండ్–2 పెట్టుబడి చేసింది. డీల్ విలువ రూ.167 కోట్లు. ఉత్పత్తుల అభివృద్ధికి ఈ నిధులను వినియోగిస్తారని టాటా క్యాపిటల్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-6-2024 ఫామ్ ధర...	
విశాఖ	500–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	490–00
హైదరాబాద్	505–00

అయిదు రోజుల అమ్మకాలకు బ్రేక్

- ఎగ్జిట్ పోల్స్ వైపు ఇన్వెస్టర్ల చూపు
- స్వల్ప లాభాలతో గట్టెక్కిన సూచీలు



ముంబై: దేశీయ జీడీపీ గణాంకాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు సానుకూలంగా స్పందించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. నేడు(శనివారం) ఎగ్జిట్ పోల్స్, వచ్చే మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అప్రమత్తత కొనసాగింది. ఫలితంగా సెన్సెక్స్ 76 పాయింట్లు పెరిగి 73,961 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 42 పాయింట్లు బలపడి 22,530 వద్ద నిలిచింది. దీంతో సూచీల అయిదురోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఇటీవల వరుస పతనంలో భాగంగా కనిష్టాలకు దిగివచ్చిన బ్యాంకులు, ఫైనాన్స్, మెటల్ ఇంధన, కన్జూమర్, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 593 పాయింట్లు బలపడి 74,479 వద్ద, నిఫ్టీ 165 పాయింట్లు పెరిగి 22,654 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. నెలాఖరున డాలర్లకు డిమాండ్ పెరగడంతో దేశీయ కరెన్సీ ఆరంభ నష్టాలు కోల్పోయింది. అమెరికా బ్రోకరేజ్ సంస్థ జెప్ఫారీస్ 'బై' రేటింగ్‌తో అదానీ షేర్లు భారీగా పెరిగాయి.

డాలర్ మారకంలో 13 పైసలు బలహీనపడింది 83.42 స్థాయి వద్ద స్థిరపడింది.

భారత్‌కు 100 టన్నుల బంగారం

- బ్రిటన్ నుంచి దేశీ ఖజానాకు తరలించిన ఆర్‌బీఐ
- 1991 పసిడి తనఖా తర్వాత ఈ స్థాయిలో తరలింపు ఇదే ప్రథమం



ముంబై: బ్రిటన్ వాల్టుల్లో భద్రపర్చిన 100 టన్నుల బంగారాన్ని రిజర్వ్ బ్యాంక్ దేశీ ఖజానాకు తరలించింది. 1991లో భారత్ విదేశీ మారక సంక్షోభాన్ని అధిగమించేందుకు పసిడిని తాకట్టు పెట్టిన అనంతరం ఇంత పెద్ద ఎత్తున బంగారాన్ని తరలించడం ఇదే ప్రథమం అని సంబంధిత వర్గాలు తెలిపాయి. బ్రిటన్ నుంచి బంగారం తరలింపు విషయంలో ఆర్థిక శాఖ, ఆర్‌బీఐ, ఇతరత్రా ఏజెన్సీలు చాలా జాగ్రత్తలు తీసుకున్నట్లు, అత్యంత విలువైన లావాదేవీ కావడంతో చాలా గోప్యత పాటించినట్లు వివరించాయి. రవాణా సౌలభ్యం తదితర అంశాలు పసిడి తరలింపునకు కారణమని పేర్కొన్నాయి. ప్రస్తుతం దేశీయంగా ముంబై, నాగ్‌పూర్‌లో పటిష్టమైన వాల్టుల్లో బంగారాన్ని నిల్వ చేస్తున్నారు. తాజా పరిణామంతో దేశీయంగా భద్రపర్చిన మొత్తం పసిడి పరిమాణం 408 టన్నులకు చేరింది. అధికారిక గణాంకాల ప్రకారం 2024 మార్చి ఆఖరు నాటికి భారత్ వద్ద మొత్తం 822 టన్నుల బంగారం ఉంది. ఇందులో సుమారు 413.79 టన్నులు విదేశీ వాల్టుల్లో ఉన్నాయి. గత కొన్నాళ్లుగా గణనీయంగా పసిడి కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో విదేశాల్లో దాన్ని నిల్వ చేయడాన్ని తగ్గించుకోవాలని భారత్ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

తగ్గనున్న వ్యయాలు..

ఆర్థిక అస్థిరతలను ఎదుర్కొనడానికి దేశాలు కొన్న బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ మొదలైన వాటి వాల్ట్‌లలో సురక్షితంగా నిల్వ చేస్తుంటాయి. ఇందుకు కొంత చెల్లిస్తుంటాయి. తాజాగా బంగారాన్ని మన దేశానికి తరలించి, ఇక్కడే నిల్వ చేయడం వల్ల విదేశీ కస్టోడియన్లకు చెల్లించాల్సిన స్టోరేజీ ఫీజుల భారాన్ని ఆర్‌బీఐ తగ్గించుకోగలుగుతుంది.



అరుంధతి రెడ్డి పునరాగమనం

దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్టుతో ఈనెలలో జరిగే వన్డే, టెస్టు, టి20 సిరీస్‌లలో పాల్గొనే భారత జట్లను ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన పేస్ బౌలర్ అరుంధతి రెడ్డి మూడేళ్ల తర్వాత భారత జట్టులోకి పునరాగమనం చేసింది. 2018 నుంచి 2021 మధ్యకాలంలో భారత జట్టు తరఫున 26 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడిన అరుంధతి 18 వికెట్లు పడగొట్టింది. ఆ తర్వాత ఆమె జట్టులో స్థానం కోల్పోయింది. ఇటీవల మహిళల ప్రీమియర్ లీగ్‌లో, ఇంటర్ జోనల్ దేశవాళీ టోర్నీలో రాణించిన అరుంధతి మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చింది. అయితే ఈసారి అరుంధతిని కేవలం టి20 ఫార్మాట్‌లోనే కాకుండా టెస్టు, వన్డే ఫార్మాట్‌లలో కూడా భారత జట్టులోకి ఎంపిక చేశారు.

పోరాడి ఓడిన సహజ



సాంటో డొమింగో ఓపెన్ ఐటీఎఫ్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో తెలంగాణ టెన్నిస్ ప్లేయర్ సహజ యామలపల్లి 3-6, 6-3, 6-7 (5/7)తో కేథరీన్ (అమెరికా) చేతిలో ఓటమి పాలైంది.

నిశాంత్ దేవ్‌కు పారిస్ 'టికెట్'

ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన భారత బాక్సర్



బ్యాంకాక్: భారత బాక్సర్ నిశాంత్ దేవ్ పారిస్ విమానం ఎక్కనున్నాడు. ప్రతిష్టాత్మక విశ్వ క్రీడలకు అతను అర్హత సంపాదించాడు. మెగా ఈవెంట్‌కు ఆఖరి అర్హత టోర్నీ అయిన 'వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్'లో నిశాంత్ పురుషుల 71 కేజీల విభాగంలో సెమీఫైనల్ చేరడం ద్వారా బెర్త్ దక్కించుకున్నాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో అతను 5–0తో వాసిల్ సెబొటరి (మాల్డోవా)పై ఏకపక్ష విజయం సాధించాడు. మహిళల 60 కేజీల క్వార్టర్స్‌లో అంకుశిత 2–3తో అగ్నెస్ (స్వీడన్) చేతిలో ఓడి... అరుంధతి 1–4తో జెస్సికా (స్లొవేకియా) చేతిలో ఓడి ఒలింపిక్స్‌కు దూరమయ్యారు. పురుషుల 51 కేజీల ప్రిక్వార్టర్స్‌లో భారత స్టార్ బాక్సర్ అమిత్ పంఘాల్ 5–0తో కిమ్ ఇంక్యూ (కొరియా)పై గెలిచి 'పారిస్'కు అడుగు దూరంలో ఉన్నాడు. 57 కేజీల క్వార్టర్స్‌లో సచిన్ సివాచ్ 4–1తో శామ్యూల్ కిస్తోహరీ (ఫ్రాన్స్)పై గెలిచి సెమీస్ చేరాడు. ఈ వెయిట్ కేటగిరీలో మూడు బెర్త్‌లు మాత్రమే ఉండటంతో సచిన్ ఫైనల్ చేరాలి లేదంటే 'బాక్స్ ఆఫ్' బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాడు. పురుషుల 92 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత బాక్సర్ సంజీత్ 0–5తో అల్ఫోన్సో (అజర్‌బైజాన్) చేతిలో ఓడిపోయాడు.

సన్నాహక సమయం

నేడు బంగ్లాదేశ్‌తో భారత్ ప్రాక్టీస్ మ్యాచ్

రాత్రి గం. 8 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం



టి20 ప్రపంచకప్, ఎన్‌బీఏ విన్నర్స్ ట్రోఫీలతో భారత కెప్టెన్ రోహిత్ శర్మ

న్యూయార్క్: టి20 వరల్డ్ కప్‌లో అసలు సమరానికి ముందు ఏకైక సన్నాహక మ్యాచ్ కోసం భారత జట్టు సిద్ధమైంది. నేడు జరిగే 'వామప్' పోరులో బంగ్లాదేశ్‌తో టీమిండియా తలపడుతుంది. లీగ్ దశలో తమ తొలి మూడు మ్యాచ్‌లు ఆడే నాసా కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలోనే రోహిత్ బృందం ఈ మ్యాచ్ ఆడనుంది. కొత్తగా నిర్మించిన ఈ స్టేడియం పిచ్‌తో పాటు అటు వాతావరణంపై కూడా ఒక అంచనాకు వచ్చేందుకు ఈ మ్యాచ్ ఉపయోగపడనుంది. స్థానిక కాలమానం ప్రకారం మ్యాచ్‌లు ఉదయం 10:30 గంటలకు ప్రారంభం అవుతాయి. అందువల్ల అలాంటి స్థితికి అలవాటు పడటం చాలా ముఖ్యం. ఈ నేపథ్యంలో ఏకైక వామప్ మ్యాచ్ కీలకం కానుంది. మ్యాచ్‌కు ముందు శుక్రవారం ఆటగాళ్లు చివరి నెట్ సెషన్‌లో పాల్గొన్నారు. అంతకుముందు రోహిత్ శర్మ ఈనెలలో జరిగే విఖ్యాత బాస్కెట్‌బాల్ లీగ్ ఎన్‌బీఏ ఫైనల్స్‌లో విన్నర్స్ జట్టుకు ఇచ్చే ట్రోఫీతో, టి20 వరల్డ్‌కప్‌తో ఫొటో సెషన్‌లో పాల్గొన్నాడు.

అందరూ బరిలోకి...

వామప్ మ్యాచ్ కావడంతో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో ఆటగాళ్లందరినీ పరీక్షించేందుకు భారత్‌కు అవకాశం ఉంది. 15 మంది సభ్యుల టీమ్‌లో విరాట్ కోహ్లి మాత్రం శుక్రవారం ఆలస్యంగా చేరాడు. అయితే అతను ఈ మ్యాచ్‌లో ఆడేది సందేహంగానే ఉంది. దాంతో కోహ్లి మినహా ఇతర కూర్పుపై టీమ్ మేనేజ్‌మెంట్ దృష్టి పెట్టనుంది. ఐపీఎల్ కారణంగా అంతా మ్యాచ్ ప్రాక్టీస్‌లోనే ఉన్నారు. జట్టులోని సభ్యులంతా తమ టీమ్‌లలో రెగ్యులర్‌గా దాదాపు అన్ని మ్యాచ్‌లు ఆడారు. ప్రధాన టోర్నీలో యశస్వి జైస్వాల్‌ను తుది జట్టులోకి తీసుకోవడం, బుమ్రాకు తోడుగా రెండో పేసర్‌గా ఎవరికి అవకాశం కల్పించాలనేదానిపై మేనేజ్‌మెంట్ ప్రధానంగా దృష్టి పెడుతోంది. రెండో పేసర్‌గా సిరాజ్, అర్ష్‌దీప్‌లలో ఒకరికే అవకాశం దక్కుతుంది. మరోవైపు బంగ్లాదేశ్ టీమ్ పరిస్థితి గొప్పగా లేదు. ఇటీవలే అనూహ్యంగా అమెరికా జట్టు చేతిలో 1–2తో బంగ్లాదేశ్ టి20 సిరీస్ కోల్పోయింది. పైగా ఈ టోర్నీలో బలమైన 'డి' గ్రూప్‌లో ఆ జట్టు ఉంది. ఈ నేపథ్యంలో ప్రాక్టీస్ మ్యాచ్‌తో కాస్త ఆత్మవిశ్వాసం ప్రోదిచేసుకోవడంపై బంగ్లాదేశ్ బృందం దృష్టి సారించింది.

"గతంలో ఎప్పుడూ ఇక్కడ ఆడలేదు కాబట్టి ముందుగా మేం పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. జూన్ 5న ఇక్కడ తొలి మ్యాచ్ ఆడే సమయానికి ఏదీ కొత్తగా అనిపించకుండా ఉండటం ముఖ్యం. డ్రాప్ ఇన్ పిచ్‌కు అలవాటు పడటం కూడా కీలకం. ఒక్కసారి లయ అందుకుంటే అంతా సజావుగా సాగిపోతుంది. కొత్త వేదిక చాలా బాగుంది. మైదానమంతా ఓపెన్‌గా ఉండటంతో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. న్యూయార్క్ వాసులు ఇక్కడ తొలిసారి జరుగుతున్న వరల్డ్‌కప్‌లో ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. అభిమానుల తరహాలోనే మేం కూడా మ్యాచ్‌ల కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాం. టోర్నీ బాగా జరుగుతుందని ఆశిస్తున్నా." –రోహిత్ శర్మ, భారత కెప్టెన్

గాయత్రి-ట్రెసా జోడీ మరో సంచలనం

ప్రపంచ ఆరో ర్యాంకర్ జంటపై విజయం • సింగపూర్ ఓపెన్‌లో సెమీఫైనల్లోకి



సింగపూర్: భారత మహిళల బ్యాడ్మింటన్ డబుల్స్ భవిష్యత్‌కు భరోసా ఇస్తూ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో మరో సంచలనం సృష్టించింది. గురువారం ప్రపంచ రెండో ర్యాంక్ జంటను బోల్తా కొట్టించిన గాయత్రి-ట్రెసా శుక్రవారం ప్రపంచ ఆరో ర్యాంక్ జోడీని ఇంటిదారి పట్టించింది. 79 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 30వ ర్యాంక్ ద్వయం గాయత్రి-ట్రెసా 18–21, 21–19, 24–22తో కిమ్ సో యెంగ్-కాంగ్ హీ యోంగ్ (దక్షిణ కొరియా) జోడీని ఓడించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ గెలుపుతో గత ఏడాది ఆసియా క్రీడల్లో ఈ కొరియా జోడీ చేతిలో ఎదురైన ఓటమికి భారత జోడీ బదులు తీర్చుకుంది. నేడు జరిగే సెమీఫైనల్లో నాలుగో సీడ్ నమి మత్సుయామ-చిహారు షిదా (జపాన్)లతో గాయత్రి-ట్రెసా తలపడతారు. కొరియా ద్వయంతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ఓటమి అంచుల్లో నుంచి పుంజుకున్నారు. తొలి గేమ్ కోల్పోయి, రెండో గేమ్‌లో 12–18తో వెనుకబడిన గాయత్రి-ట్రెసా వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి ఆధిక్యాన్ని 17–18కి తగ్గించారు. ఆ తర్వాత కొరియా ద్వయం ఒక పాయింట్ సాధించగా... ఆ వెంటనే గాయత్రి-ట్రెసా వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి గేమ్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచారు. నిర్ణాయక మూడో గేమ్‌లో పూర్తి సమన్వయంతో ఆడిన గాయత్రి-ట్రెసా కీలకదశలో పాయింట్లు నెగ్గి మరో చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నారు.

వైశాలి విజయం... హంపి పరాజయం



స్టావెంజర్: నార్వే చెస్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి తన జోరు కొనసాగిస్తోంది. నాలుగో రౌండ్ గేమ్‌లో వైశాలి 54 ఎత్తుల్లో పియా క్రామ్లింగ్ (స్వీడన్)పై గెలిచింది. ఆరుగురు గ్రాండ్‌మాస్టర్ల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగో రౌండ్ తర్వాత వైశాలి 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారత నంబర్‌వన్ కోనేరు హంపి 55 ఎత్తుల్లో అనా ముజిచుక్ (ఉక్రెయిన్) చేతిలో ఓడిపోయింది. ఇదే టోర్నీ పురుషుల విభాగంలో వైశాలి తమ్ముడు, భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద నాలుగో రౌండ్‌లో 65 ఎత్తుల్లో హికారు నకముర (అమెరికా) చేతిలో ఓడిపోయాడు.



స్వియాటెక్ సులువుగా...

- ప్రిక్వార్టర్స్‌లోకి టాప్ సీడ్
- మూడో సీడ్ కోకో గాఫ్ కూడా

పారిస్: రెండో రౌండ్‌లో ఓటమి అంచుల్లో నుంచి గట్టెక్కిన పోలాండ్ టెన్నిస్ స్టార్ ఇగా స్వియాటెక్ మూడో రౌండ్‌లో మాత్రం అలవోకగా గెలిచింది. ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరుసగా ఆరో ఏడాది ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ఇప్పటికే ఈ టోర్నీలో మూడుసార్లు విజేతగా నిలిచిన స్వియాటెక్ శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో 6–4, 6–2తో మేరీ బుజ్కోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచింది. టాప్ సీడ్ హోదాలో బరిలోకి దిగిన ప్రపంచ నంబర్‌వన్ స్వియాటెక్ ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. 34 విన్నర్స్ కొట్టిన ఆమె కేవలం ఎనిమిది అనవసర తప్పిదాలు చేసింది. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6–2, 6–4తో డయానా యెస్‌ట్రిమ్‌స్కా (ఉక్రెయిన్)పై, ఐదో సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6–1, 6–3తో చోల్ పాక్వెట్ (ఫ్రాన్స్)పై, ఎనిమిదో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) 6–4, 7–6 (7/5)తో లేలా ఫెర్నాండెజ్ (కెనడా)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు.

సినెర్ ముందంజ...

పురుషుల సింగిల్స్ విభాగంలో ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ యానిక్ సినెర్ (ఇటలీ) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. సినెర్ మూడో రౌండ్‌లో 6–4, 6–4, 6–4తో కొటోవ్ (రష్యా)ను ఓడించాడు. ఆరో సీడ్ రుబ్లెవ్ (రష్యా) మాత్రం మూడో రౌండ్‌లోనే నిష్క్రమించాడు. అర్నాల్డి (ఇటలీ) 7–6 (8/6), 6–2, 6–4తో రుబ్లెవ్‌ను ఇంటిదారి పట్టించాడు.

బాలాజీ జోడీ గెలుపు

పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ (భారత్)-మిగెల్ వరేలా (మెక్సికో) జోడీ రెండో రౌండ్‌కు చేరింది. తొలి రౌండ్‌లో బాలాజీ-వరేలా ద్వయం 6–3, 6–4తో రీస్ స్టాల్‌డెర్ (అమెరికా)-సెమ్ వీర్‌బీక్ (నెదర్లాండ్స్) జంటను ఓడించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ 3–6, 6–7 (5/7)తో జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా)-సఫీయులిన్ (రష్యా) జంట చేతిలో ఓడిపోయింది.

మళ్లీ ఓడిన పాక్... ఇంగ్లండ్‌దే టి20 సిరీస్



లండన్: టి20 ప్రపంచకప్‌కు ముందు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన పాకిస్తాన్‌కు నిరాశే ఎదురైంది. నాలుగు టి20ల ద్వైపాక్షిక సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు వర్షార్పణం కాగా... రెండు మ్యాచ్‌ల్లోనూ ఆతిథ్య ఇంగ్లండ్ గెలిచి సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. చివరిదైన నాలుగో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. మొదట పాక్ 19.5 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. ఉస్మాన్ ఖాన్ (21 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ బాబర్ ఆజమ్ (22 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. వుడ్, ఆదిల్ రషీద్, లివింగ్‌స్టోన్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం ఇంగ్లండ్ 15.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసి నెగ్గింది. సాల్ట్ (24 బంతుల్లో 45; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ బట్లర్ (21 బంతుల్లో 39; 7 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 6.2 ఓవర్లలోనే 82 పరుగులు జోడించారు. బెయిర్‌స్టో (16 బంతుల్లో 28 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు), జాక్స్ (18 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. రవూఫ్‌కు 3 వికెట్లు దక్కాయి.



ఆలయ ఆవరణలో భక్తులు

అంజన్న అండ.. భక్తజన కొండ

- నేడు హనుమాన్ పెద్ద జయంతి
- తరలివస్తున్న స్వాములు

కొండగట్టు(చొప్పదండి): జైశ్రీరామ్.. జై బోలో హనుమాన్‌కీ.. నినాదాలతో జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న క్షేత్రం పులకించింది. శనివారం హనుమాన్ పెద్ద జయంతిని పురస్కరించుకొని హనుమాన్ దీక్షాపరులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. దీంతో కొండంతా కాషాయమయంగా మారింది. స్వామివారి దర్శనం, దీక్ష విరమణకు సుమారు లక్షా 50 వేల మంది రానున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఎండ అధికంగా ఉండటంతో సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు మాల విరమణ చేసుకున్నారు. భక్తులతో ఘాట్‌రోడ్, మెట్లదారి, బొజ్జ పోతన్న మార్గాలు నిండిపోయాయి. భక్తుల సౌకర్యార్థం ఉచిత బస్సు, చలివేంద్రాలు అందుబాటులో ఉంచారు. అదనపు ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశారు.

'భారత్‌మాల' నుంచి ట్రిపుల్ ఆర్ ఔట్

కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయ లోపం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) ఉత్తర భాగం ప్రాజెక్టు భారత్‌మాల ఫేజ్–1 నుంచి గల్లంతైంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య అగాధంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో దీనిని అనివార్యంగా భారత్‌మాల పరియోజన ఫేజ్–2లో చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఎన్నికల అనంతరం కేంద్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వం ఈ యోజన కొనసాగింపు విషయంలో తీసుకునే నిర్ణయంపై ఇది ఆధారపడి ఉంటుంది. తొలుత ప్రతిపాదించినట్టుగా భారత్‌మాల ఫేజ్–1లో ఉత్తర భాగం ప్రాజెక్టు పనులకు చోటు దక్కి ఉంటే పనుల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా పట్టాలెక్కే పరిస్థితి ఉండేది. ఇప్పుడా అవకాశం చేజారడంతో కొత్త ప్రభుత్వం దాన్ని పట్టాలెక్కించినా ప్రాజెక్టు జాప్యం కాక తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ.2,650 కోట్ల డిపాజిట్‌పై రాష్ట్ర సర్కారు అభ్యంతరం

ట్రిపుల్ ఆర్‌ను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్ వేలను విస్తృతంగా చేపట్టే క్రమంలో మోదీ ప్రభుత్వం దీనికి పచ్చజెండా ఊపింది. జాతీయ రహదారిగా దాన్ని సొంత వ్యయంతో నిర్మించేందుకు సిద్ధమైంది. భూసేకరణ వ్యయంలో సగం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే సరిపోయేలా కార్యాచరణ చేపట్టింది. అంతా అనుకున్నట్టు జరిగితే 2022లోనే ఇది టెండర్ల ప్రక్రియను చేరుకునేది. కానీ కీలక భూసేకరణ ప్రక్రియ చేపట్టే తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అభిప్రాయభేదాలు నెలకొన్నాయి. భూసేకరణ వ్యయంలో 50%, కరెంటు స్తంభాలు లాంటి వాటి తరలింపు ఖర్చు.. వెరసి రూ.2,650 కోట్లు ఒకేసారి డిపాజిట్ చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై కేంద్రం ఎన్ని పర్యాయాలు లేఖలు రాసినా సానుకూలంగా స్పందించలేదు. దీంతో ప్రాజెక్టు ప్రక్రియ నిలిచిపోయింది.

ఫేజ్–1 అంచనా వ్యయం మించి పోవడంతో..

ట్రిపుల్ ఆర్‌లోని 158 కి.మీ. ఉత్తర భాగాన్ని భారత్‌మాల ఫేజ్–1లో చేర్చేందుకు అప్పటికే కేంద్రం సిద్ధమైంది. దేశవ్యాప్తంగా యాక్సెస్ కంట్రోల్డ్ జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలను వేగంగా పూర్తి చేసే లక్ష్యంతో 2017లో కేంద్రం దీనిని చేపట్టింది. ఇందులో హైదరాబాద్ ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగాన్ని చేర్చాలని కూడా నిర్ణయించింది. కానీ ప్రాజెక్టు ప్రక్రియ నిలిచిపోవటం, ఈ ఫేజ్–1లోని 27,384 కి.మీ. నిడివి గల జాతీయ రహదారుల పనులకు అవార్డులు పాస్ చేయడం, వాటి అంచనా వ్యయం రూ.4.25 లక్షల కోట్లకు మించి పోవడంతో ఫేజ్–1ను ముగించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రాజెక్టు ఎటూ తేలకుండా నిలిచిపోయిన ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం ప్రాజెక్టు స్థానంలో వేరే ప్రాజెక్టును ఫేజ్–1 జాబితాలో చేర్చింది.

ఫేజ్–1 పనులకే ప్రాధాన్యం

భారత్‌మాల ఫేజ్–1లో మిగిలిపోయిన 7,500 కి.మీ. నిడివి గల రహదారుల పనులతో పాటు మరో 5,000 కి.మీ ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టులతో భారత్‌మాల ఫేజ్–2ను ప్రారంభించాలని కేంద్రం నిర్ణయించింది. ఈలోపు ఎన్నికలు రావటంతో అది పట్టాలెక్కలేదు. నిజానికి దీన్ని రూ.3 లక్షల కోట్లతో చేపట్టాలని ప్రాథమికంగా కేంద్రం నిర్ణయించింది. విజన్ –2047 లక్ష్యంతో దీన్ని కొనసాగించాలని భావిస్తూ ఓ రూట్‌మ్యాప్‌ను రూపొందించింది. కొత్త ప్రభుత్వం దీనిని ముందుకు తీసుకెళ్లే పక్షంలో ఇప్పుడు ట్రిపుల్ ఆర్ రెండు భాగాలను ఇందులో చేర్చాల్సి ఉంది. అయితే ఫేజ్–1లో ఆమోదం పొందిన వాటికే తొలి ప్రాధాన్యం ఉండనుంది. ఇప్పటికే వాటన్నింటికీ అవార్డులు కూడా పాస్ చేసినందున పనులు మొదలై కొనసాగుతున్నాయి. కేంద్రంలో ఏ ప్రభుత్వం కొలువుదీరినా వాటికి ఇబ్బంది ఉండదు. ఈ పనులకు నిధులు విడుదలయ్యాకే, ఫేజ్–2లోని ప్రాజెక్టులకు నిధులు అందుతాయి. అంటే ఫేజ్–1లో చోటు దక్కకపోవడం వల్ల నిధులంది, పనులు వేగంగా ముందుకు సాగే సదవకాశాన్ని ట్రిపుల్ ఉత్తర భాగం ప్రాజెక్టు కోల్పోయిందన్నమాట.

క్లుప్తంగా...

అమెరికాలో యోగా కార్యక్రమానికి దాజీ

21న యోగా డే సందర్భంగా కీలక ఉపన్యాసం



సాక్షి, హైదరాబాద్: జూన్ 21న అమెరికాలోని న్యూయార్క్‌లో 'యూఎన్ ఇంటర్నేషనల్ డే ఆఫ్ యోగా'కార్యక్రమంలో కీలక ఉపన్యాసం ఇవ్వాల్సిందిగా శ్రీరామచంద్రమిషన్ అధ్యక్షుడు, హార్ట్‌ఫుల్‌నెస్ గైడ్ కమలేశ్ డి.పటేల్ దాజీని నిర్వాహకులు ఆహ్వానించారు. అదేవిధంగా జూన్ 24న వాషింగ్టన్ డీసీలోని ప్రపంచబ్యాంక్ హెడ్‌క్వార్టర్స్‌లో జరగనున్న కార్యక్రమంలో సీనియర్ అధికారులు, ఉద్యోగులను ఉద్దేశించి దాజీ ప్రసంగించనున్నారు. దాజీ అమెరికా పర్యటనలో భాగంగా.. జూన్ 1,2 తేదీల్లో అట్లాంటాలోని అంబాజీ శక్తి మందిరంలో ధ్యానానికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. కాగా, సమాజానికి దాజీ అందిస్తున్న సేవలకుగాను జూన్ 8న కాలిఫోర్నియాలో ఆయనను సన్మానించనున్నారు. ఇటీవల హైదరాబాద్ శివార్లలోని కన్హ ఆశ్రమంలో నిర్వహించిన 'ప్రపంచ ఆధ్యాత్మిక సదస్సు'విజయవంతమైన నేపథ్యంలో దాజీకి అమెరికాలో పర్యటించాల్సిందిగా ఆహ్వానం అందింది.

డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: లాలాపేటలో గుట్టుచప్పుడు కాకుండా విదేశాల నుంచి కుష్ అనే మాదకద్రవ్యాన్ని దిగుమతి చేసుకుని విద్యార్థులకు అమ్ముతున్నారనే సమాచారంతో శుక్రవారం ఎస్టీఎఫ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 33 గ్రాముల కుష్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. ప్రదీప్‌రావు, ఎస్సై బాలరాజు, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు. మొదట కుష్ డ్రగ్ అమ్ముతున్న మహ్మద్‌ఖాన్, మహ్మద్ మొబిన్‌లను పట్టుకొని విచారించగా.. నిఖిల్ నాయక్ అనే వ్యక్తి తమకు కుష్ డ్రగ్ అమ్మేందుకు ఇచ్చాడని తెలిపారు. దీంతో నిఖిల్ నాయక్‌ను కూడా పట్టుకున్నామని సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు తెలిపారు.

నెల రోజుల తర్వాతే కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు!

నేటి నుంచి ఢిల్లీ హైకోర్టుకు వేసవి సెలవులు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌లో తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇటీవల ఈ కేసును విచారించిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ వేసవి సెలవుల కన్నా ముందే తీర్పు ఇవ్వడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. కానీ శుక్రవారం తీర్పుల జాబితాలో ఈ కేసు లేకపోవడంతో కవిత తరపు న్యాయవాది మోహిత్ రావు ధర్మాసనం ముందు ఈ విషయాన్ని ప్రస్తావించారు. కేసు జాబితాలో లేదని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై న్యాయమూర్తి స్పందించలేదు. దీంతో వేసవి సెలవుల తర్వాతే తీర్పు వచ్చే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. జూన్ 1 నుంచి ఢిల్లీ హైకోర్టుకు నెలరోజులపాటు వేసవి సెలవులు ప్రకటించారు. మరోవైపు, ట్రయల్ కోర్టులో ఈడీ దాఖలు చేసిన అదనపు ఛార్జిషీటు పరిగణనకు సంబంధించి కవిత సహా ఐదుగురిని జూన్ 3న హాజరుకావాలని ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ఆదేశించిన విషయం విదితమే.

ఎక్కడికక్కడే సమస్యలు

నేటి నుంచి ఇంటర్ క్లాసులు

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పుస్తకాల పంపిణీ ఎప్పుడో?

1,654 లెక్చరర్ల పోస్టులు ఖాళీ.. ప్రాక్టికల్స్ నిధులేవీ?

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ క్లాసులు శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కానున్నాయి. అందుకు అవసరమైన ఏర్పాట్లు ఇంటర్ అధికారులు చేశారు. ప్రస్తుతం వడగాడ్పులు వీస్తున్న నేపథ్యంలో మొదటివారం రోజులూ ప్రభుత్వ, గురుకుల కాలేజీలతోపాటు కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో హాజరుశాతంపై అధికారులు పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. జూన్ రెండోవారం వరకూ విద్యార్థులు పెద్దగా కాలేజీలకు రాకపోవచ్చని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ కూడా జూన్ 1 నుంచే మొదలవ్వాలి. ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పుడిప్పుడే మొదలైంది. ఈ కారణంగా ఫస్టియర్ విద్యార్థులకు జూన్ ఆఖరు వరకూ క్లాసులు జరిగే అవకాశం లేదు. అయితే, ప్రైవేట్ కాలేజీల్లో ఇప్పటికే దాదాపు అడ్మిషన్ల ప్రక్రియే పూర్తయ్యింది. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించకపోయినా, చాలాచోట్ల అనధికారికంగానే క్లాసులు నడుస్తున్నాయనే వార్తలొస్తున్నాయి. రెండో సంవత్సరం క్లాసులు కూడా ఇప్పటికే ప్రారంభించారు.

600 కాలేజీలకు పూర్తికాని అఫ్లియేషన్

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలు 3 వేలకుపైగానే ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కాలేజీలు 422 వరకూ ఉన్నాయి. గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు తీసేస్తే 1400 కాలేజీలు ప్రైవేట్ రంగంలోనే ఉన్నాయి. వీటన్నింటికీ ఇంటర్‌బోర్డు అనుబంధ గుర్తింపు ఇవ్వాలి. కాలేజీల్లో ఫ్యాకల్టీ, మౌలిక



వసతులు, పరిసరాలను జిల్లా అధికారులు తనిఖీ చేసిన తర్వాత ఈ గుర్తింపు ఇస్తారు. అయితే సరైన డాక్యుమెంట్లు సమర్పించని కారణంగా ఇంకా 600 ప్రైవేట్ కాలేజీలకు గుర్తింపు రాలేదు. అయినా ఆ కాలేజీలు అడ్మిషన్లు కొనసాగించినట్టు తెలుస్తోంది. ఒక్కో కాలేజీ రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేశాయి. వేల సంఖ్యలో విద్యార్థులను చేర్చుకున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 72వేల మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులుంటే, ప్రైవేటు కాలేజీల్లో 2.35 లక్షల మంది ఉన్నారు. ఆఖరిదశ వరకూ అఫ్లియేషన్ల ప్రక్రియ కొనసాగించడం వల్ల ప్రతీ సంవత్సరం విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు.

ప్రభుత్వ కాలేజీల్లో సమస్యలెన్నో...

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,654 లెక్చరర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- 225 ఒకేషనల్ అధ్యాపకుల పోస్టులూ ఖాళీనే.
- 26 కాలేజీల్లో కీలకమైన సబ్జెక్టులు బోధించే అధ్యాపకుల కొరత వేధిస్తోంది.
- 394 కాలేజీలకు పక్కా భవనాలున్నా, నిర్వహణకు అవసరమైన నిధులు మంజూరు కావడం లేదు.
- కొత్తగా 26 జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేసినా, అవసరమైన అధ్యాపకులను ఇవ్వలేదు. మౌలిక వసతులూ కల్పించలేదు.
- సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌పై ఇంతవరకూ ఎక్కడా నిధులు ఇవ్వలేదని అధ్యాపక సంఘాలు అంటున్నాయి.
- అదనపు గదులు లేకపోవడంతో కొన్ని గ్రూపులను కలిపి బోధించే పరిస్థితి ఉంది.
- ఇప్పటి వరకూ ఎక్కడా పాఠ్యపుస్తకాల పంపిణీ జరగలేదు.

ఇంటర్ విద్యపై దృష్టి పెట్టాలి

పేద విద్యార్థులు చేరే ప్రభుత్వ ఇంటర్ కాలేజీలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి. త్వరగా పాఠ్యపుస్తకాలు అందితే బోధన అనుకున్న ప్రకారం జరుగుతుంది. ప్రైవేటుతో దీటుగా ఫలితాలు వస్తాయి. కాలేజీల్లో తాగునీటి సౌకర్యం, ఫర్నీచర్, సరిపడా గదులు ఏర్పాటు చేయాలి. – మాచర్ల రామకృష్ణగౌడ్, తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రభుత్వ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అన్ని సమస్యలూ పరిష్కరిస్తాం

జూనియర్ కాలేజీల్లో ఎలాంటి సమస్యలూ లేకుండా నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. కాలేజీల అఫ్లియేషన్‌కు ఇంకా సమయం ఉంది. అన్ని డాక్యుమెంట్లు సమర్పిస్తే కచ్చితంగా గుర్తింపు ఇస్తాం. మౌలిక వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. పాఠ్య పుస్తకాల ముద్రణ కొనసాగుతోంది. త్వరలో అందించే ప్రయత్నం చేస్తాం. – శ్రుతి ఓజా, ఇంటర్‌బోర్డు కార్యదర్శి

అధిక ధరకు మందుల విక్రయం

ఒక దుకాణం సీజ్ చేసిన డీసీఏ

సాక్షి, హైదరాబాద్: అధిక ధరకు మందులు విక్రయించే దుకాణాల్లో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. తాజాగా ముషీరాబాద్‌లోని ఒక మందుల దుకాణాన్ని డీసీఏ అధికారులు సీజ్ చేశారు. బీ-సిమ్ ఆయింట్‌మెంట్‌ను నిర్ణీత ధర కంటే ఎక్కువకు విక్రయిస్తున్నట్టు గుర్తించామని డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో ఆయింట్‌మెంట్‌పై రూ.17 అదనంగా వసూలు చేస్తున్నట్టు గురువారం నాటి సోదాల్లో వెల్లడైందని పేర్కొన్నారు.

5 డిగ్రీల వరకు అధికంగా

- రాష్ట్రంలో తీవ్రస్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు
- అనేక ప్రాంతాల్లో 45 డిగ్రీల సెల్సియస్‌కు మించి నమోదు
- మరో రెండు రోజులు భగభగలే
- ఈ సీజన్‌లోనే అత్యధిక వేడిమి రోజుగా మే 30



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో నమోదవుతున్నాయి. గత నాలుగు రోజులుగా చాలాచోట్ల సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా.. మరో రెండ్రోజులు ఇదే తరహాలో తీవ్రమైన ఎండలు ఉంటాయని వాతావరణశాఖ చెబుతోంది. శుక్రవారం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదయ్యాయి. అత్యధికంగా పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 47.1 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. మంచిర్యాల జిల్లా భీమారంలో కూడా 47.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, నస్పూర్‌లో 46.9, భద్రాద్రి కొత్తగుడెం జిల్లా గరిమెలపాడులో 46.9, నల్లగొండ జిల్లా కేతెపల్లిలో 46.8, ఖమ్మం జిల్లా ఖానాపూర్‌లో 46.8, కరెపల్లెలో 46.6, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.6, మంచిర్యాల జిల్లా హాజీపూర్‌లో 46.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం రాష్ట్రంలోని మెజార్టీ ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. ఖమ్మంలో 45.0 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, కనిష్టంగా నల్లగొండలో 25.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. 2024 వేసవి సీజన్‌లో అత్యంత వేడిమి రోజుగా మే 30వతేదీ రికార్డు సృష్టించింది. మంచిర్యాల జిల్లా భీమారంలో గురువారం ఈ సీజన్లోనే అత్యధికంగా 47.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇలావుండగా నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. శుక్రవారం తమిళనాడు, కర్ణాటకల్లోకి ప్రవేశించినట్లు వాతావరణశాఖ తెలిపింది.

శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
ఖమ్మం	45.0
ఆదిలాబాద్	44.3
రామగుండం	44.2
భద్రాచలం	43.8
హనుమకొండ	43.0
నల్లగొండ	43.0
మెదక్	42.8
నిజామాబాద్	42.7
మహబూబ్‌నగర్	42.0
దుండిగల్	41.0
హకీంపేట్	41.0
హైదరాబాద్	41.0

రాష్ట్రంలో వడదెబ్బకు 8 మంది మృతి

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు
- నల్లగొండ జిల్లాలో ముగ్గురు
- మృతుల్లో ఇద్దరు మహిళలు



ముకుందరెడ్డి



రోడ్డు పక్కన పడిపోయిన లారీ డ్రైవర్

చిట్యాల/ హాలియా/కాసిపేట/చొప్పదండి/ములుగు/మహబూబాబాద్/వరంగల్/మునుగోడు: రాష్ట్రంలో వడదెబ్బకు గురై వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం ఒక్కరోజే ఎనిమిది మంది మృతి చెందారు. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు మృతి చెందగా నల్లగొండ జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. నల్లగొండ జిల్లాలోని అనుముల మండలంలోని కొత్తపల్లికి చెందిన బచ్చు ముకుందరెడ్డి(55) బైక్‌పై వ్యవసాయ పనిముట్ల కోసం ఉదయం నల్లగొండ పట్టణానికి వెళ్లి పనిచూసుకుని ఇంటికి చేరుకున్నాడు. ఈ క్రమంలో వడదెబ్బకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే అతడు మృతి చెందాడు. ఇదే జిల్లాలో ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రాంతానికి చెందిన కర్రి రాజు(40), భార్య దీనమ్మ తమ ముగ్గురు పిల్లలతో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం దుబ్బాక గ్రామంలో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మధ్యాహ్నం నల్లగొండ జిల్లా చిట్యాల బస్టాండ్‌లో రామన్నపేటకు వెళ్లేందుకు రాజు బస్సుకోసం ఎదురుచూస్తుండగా వడదెబ్బకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇదే జిల్లాకు చెందిన మునుగోడు మండలం ఊకొండి గ్రామానికి చెందిన కమ్మలపల్లి మమత (28) ఉపాధి పనుల నిమిత్తం కూలీ పనులకు వెళ్లి వడదెబ్బకు గురై సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే తోటి కూలీలు 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందింది.

మంచినీళ్ల కోసమని కిందికి దిగి...

కరీంనగర్ జిల్లా పెద్దపల్లిలోని బసంత్ నగర్‌లో నివాసం ఉండే మధ్యప్రదేశ్‌కు చెందిన జాకీర్ హుస్సేన్(60) అనే లారీ డ్రైవర్ చొప్పదండికి సిమెంట్ లోడ్‌తో వచ్చాడు. ప్రధాన రహదారిపై ఓ హోటల్ సమీపంలో లారీని ఆపి మంచినీళ్ల కోసమని కిందికి దిగాడు. ఈ క్రమంలో అతడు వడదెబ్బ తగిలి సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే 108 సిబ్బందికి స్థానికులు సమాచారం అందించగా వారు వచ్చి హుస్సేన్‌ను ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. ఇక మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ కూలీ దుర్గం భీమయ్య(55) వడదెబ్బతో మృతి చెందాడు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు...

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన జన్ను ఎల్లమ్మ (50), ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేటకు చెందిన దామెర రాంబాబు(48) వడదెబ్బకు గురై మృతి చెందారు. అదేవిధంగా వరంగల్ జిల్లా చెన్నారావుపేటకు చెందిన పల్లకొండ ఐలయ్య(74) రోజువారీగా పందులు మేపడానికి వెళ్లి ఎండ తీవ్రతతో వడదెబ్బ తగిలి మృతిచెందాడు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.